॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ పంచమోఽధ్యాయః - కర్మసన్న్యాసయోగః

## (ఐదవ అధ్యాయము - కర్మసన్న్యాసయోగము)

ఇంతవరకూ అయిన అధ్యాయాలలో అంటే 2,3,4 లలో కృష్ణపరమాత్మ ప్రాథమికంగా రెండు అంశాలను చర్చించాడు. అవి – సాధన, నిష్ఠ.

**సాధన** – సాధన విషయంలో ఎన్నుకునే అవకాశం లేదు. ప్రతి ఒక్కరూ కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొంది, జ్ఞానయోగానికి వచ్చి మోక్షం పొందాలని చూశాము. కర్మయోగం పాటించాలా, జ్ఞానయోగం పాటించాలా అనే అంశంలో మనకు ఎన్నుకునే అవకాశం లేదు. ఎందుకు? కర్మయోగం సాధన, జ్ఞానయోగం సాధ్యం. అలాగే జ్ఞానయోగం సాధన, మోక్షం సాధ్యం. కర్మయోగంవల్ల మోక్షం రావటం లేదు.

ఇప్పుడు కర్మయోగం, జ్ఞానయోగాల మధ్యనున్న అనుబంధాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. కర్మయోగం సాధన అయితే జ్ఞానయోగం సాధ్యం అని చూశాము. సాధన సాధ్యాల మధ్య ఎన్నుకోవటం ఉండదు. రెండు సాధనలు ఉంటే ఏది ఎన్నుకోవాలనే సమస్య వస్తుంది. దీనికి ఉదాహరణగా ప్యాంటు, షర్టుల విషయం చూశాము. రెండు ప్యాంటుల మధ్య ఏది వేసుకోవచ్చుననే సమస్య వస్తుంది, రెండు షర్టుల మధ్య ఏది వేసుకోవచ్చుననే సమస్య వస్తుంది కాని ప్యాంటు, షర్టులలో ఏవి వేసుకోను అనే ప్రశ్నే రాదు. ఎందుకు? అవి రెండూ ఒకకోవకి చెందినవి కావు. అలాగే కర్మయోగం, జ్ఞానయోగం కూడా ఒకకోవకి చెందినవి కావు.

ఇప్పుడు కర్మయోగం సాధన, జ్ఞానయోగం సాధ్యం అని చూశాము కదా! సాధ్యం కావాలంటే సాధన చేయక తప్పదు. అలాగే సాధన చేయటానికి నిశ్చయించుకున్నామంటే సాధ్యం కూడా కోరాలి. ఉదాహరణకు ఎటువెళ్ళాలో తేల్చుకోకుండా బస్సు ఎక్కి లాభమేమిటి? అలాగే ఎక్కడికి వెళ్ళాలో తేల్చుకున్నాకే ఏ బస్సు ఎక్కాలో, దానికి తగ్గ బస్సు ఎక్కాలి.

ఒక డాక్టరు దగ్గరికి వెళ్ళి నాకు కడుపునొప్పిగా ఉందని చెపితే, ఆయన దానికి తగ్గ మందు ఇస్తాడు. అప్పుడు నాకు మందు వద్దు, నాకు కడుపునొప్పి తగ్గాలి అంతే అని అన్నామనుకోండి! డాక్టరు ఏం చేస్తాడు? ముందు కడుపునొప్పికి మందు మానేసి, మన పిచ్చికి తగ్గ మందు ఇస్తాడు. అందువల్ల సాధన ఎన్నుకుంటే దానికి సాధ్యం ఉండితీరాలి. అలాగే సాధ్యం కోరుకుంటే దానికి తగ్గ సాధన చేయాలి. రెండూ ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉన్నాయి. ఒకటి వస్తే, రెండోది వచ్చి తీరుతుంది. అందువల్ల కర్మయోగం పాటించాలా, జ్ఞానయోగం పాటించాలా అని ఎన్నడూ అడగకండి. అది అర్థంలేని ప్రశ్న.

**కర్మయోగం సాధన, జ్ఞానయోగం సాధ్యం**

ఇదే సూత్రం జ్ఞానయోగానికీ, మోక్షానికీ కూడా వర్తిస్తుంది. జ్ఞానయోగం సాధన, మోక్షం సాధ్యం. ఒకవ్యక్తి తండ్రి పరంగా చూస్తే కొడుకు, కొడుకు పరంగా చూస్తే తండ్రి. అంటే ఆయనకు రెండు హోదాలు ఉన్నాయన్నమాట. జ్ఞానయోగానికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. కర్మపరంగా చూస్తే సాధ్యం, మోక్షపరంగా చూస్తే సాధన.

అందువల్ల ఎవరైనా జ్ఞానయోగం సాధనా, సాధ్యమా అని అడిగితే వారికి జవాబు చెప్పకూడదు, దేనిపరంగా అడుగుతున్నారని ఎదురు ప్రశ్నించాలి.

ఇదే విషయం కృష్ణపరమాత్మ పదేపదే చెబుతున్నాడు.

**యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి ।**
**తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥** – 2.52

**శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।**
**సమాధావచలా బుద్ధిస్తదా యోగమవాప్స్యసి ॥** – 2.53

ఈ రెండు శ్లోకాల్లో కృష్ణపరమాత్మ చాలా స్పష్టంగా చెప్పాడు. కర్మయోగం జ్ఞానయోగానికి దారితీస్తే, జ్ఞానయోగం మోక్షానికి దారితీస్తుంది. సాధనవిషయంలో ఇదీ బోధ. ఇంత స్పష్టంగా కృష్ణపరమాత్మ చెప్పినా, ఇప్పటికీ ఈ రెండింటి విషయంలో పొరపాటు పడుతుంటారు చాలామంది. వారు మోక్షానికి కర్మయోగం, జ్ఞానయోగాల్లో ఏదో ఒకటి పాటించవచ్చు అనుకుంటారు. వాటిని మోక్షానికి రెండు మార్గాలు అనుకుని, కర్మమీద శ్రద్ధ ఉన్న వ్యక్తి కర్మ ద్వారా మోక్షం పొందితే, తెలివి ఎక్కువ ఉన్న వ్యక్తి జ్ఞానం ద్వారా మోక్షం పొందవచ్చు అనుకుంటారు. శంకరాచార్యులు కూడా ఈ ఆలోచన అనేక సందర్భాలలో తప్పని వివరించారు.

**కర్మయోగం మోక్షానికి దారి తీయదు, జ్ఞానయోగం మాత్రం మోక్షాన్ని ఇస్తుంది.**

ఇదీ సాధన గురించిన బోధ.

**నిష్ఠ** – ఇది జీవనవిధానానికి చెందినది. రెండు మార్గాలున్నాయి. అవి **ప్రవృత్తిమార్గం, నివృత్తిమార్గం**. ప్రవృత్తి మార్గాన్ని గృహస్థాశ్రమంలో పాటిస్తే, నివృత్తిమార్గాన్ని సన్న్యాసాశ్రమంలో పాటిస్తారు. ఈ రెండు ఆశ్రమ ధర్మాలూ ప్రతి ఒక్కవ్యక్తికీ అందుబాటులో ఉంటాయి. పూర్వకాలంలో గురుకులవాసంలో విద్యనభ్యసించిన బ్రహ్మచారికి విద్య ముగించాక, ఈ రెండు ఆశ్రమాల గురించీ చెబుతారు. అతను పెళ్ళి చేసుకుని గృహస్థుగా ధర్మం నెరవేర్చవచ్చు లేదా అక్కడనుంచే సన్న్యాసం స్వీకరించవచ్చు. ఇలా జీవనవిధానాన్ని నిష్ఠ అంటారు.

ఇక్కడ కృష్ణపరమాత్మ చెప్పిన విషయాన్ని బాగా అర్థం చేసుకోవాలి. **సాధన విషయంలో వికల్పం లేదు** అంటే ఎన్నుకునే అవకాశం లేదు. కాని **నిష్ఠ విషయంలో వికల్పం ఉంది** అంటే ఇందాక చూసినట్టుగా బ్రహ్మచారి గృహస్థుగా మారవచ్చు లేదా సన్న్యాసిగా మారవచ్చు.

ఏది ఎన్నుకున్నా కూడా రెండు సాధనలూ చేయాలి. అంటే రెండు ఆశ్రమాల్లోనూ రెండు సాధనలూ చేయాలి. ఆ చేసే కర్మనుబట్టి ఆశ్రమం అనే పేరు వచ్చింది. గృహస్థాశ్రమ ధర్మం గృహస్థుకు కర్మయోగం అయితే సన్యాసాశ్రమ ధర్మం సన్యాసికి కర్మయోగం అవుతుంది. ఇద్దరూ పూజలూ, పారాయణాలూ, ప్రార్థనలూ చేస్తారు. కాకపోతే వారు చేసే ప్రార్థనల్లో తేడా ఉంటుంది. వారు పాటించే పద్ధతిలో తేడా ఉంటుంది. గృహస్థు యజ్ఞోపవీతం వేసుకుంటే, సన్యాసి దండం పట్టుకుంటాడు. గృహస్థు సగుణబ్రహ్మను ప్రార్థిస్తే, సన్యాసి ఉపనిషత్తు మంత్రాలు జపిస్తాడు. గృహస్థు ఓం నమశ్శివాయ, ఓం నమో నారాయణాయ అంటూ జపాలు చేస్తే; సన్యాసి ఓంకారం జపిస్తాడు. గృహస్థు విష్ణుసహస్రనామాలు చదివితే, సన్యాసి ఉపనిషత్తులో మహావాక్య మంత్రాలను జపిస్తాడు.

కాని ఇద్దరికీ కర్మయోగం తప్పదు. ఎందుకు? ఇద్దరికీ జ్ఞానయోగానికి కావాల్సిన చిత్తశుద్ధి పొందటానికి అర్హత కావాలి. అందువల్ల కృష్ణపరమాత్మ చెప్పాడు – **ఏ ఆశ్రమ జీవితమన్నా తీసుకోండి, కాని స్వధర్మాన్ని పాటించండి**. స్వధర్మాన్ని పాటించటాన్నే **కర్మయోగం** అంటారు. అది పాటించాక జ్ఞానయోగానికి రావాలి. దాన్ని **వేదాంత విచారణ** అంటారు. దానికి ఇద్దరూ కూడా గురువు వద్దకు వెళ్ళి, శాస్త్రాన్ని నేర్చుకుని మోక్షం పొందాలి. **నిష్ఠ విషయంలో వికల్పం ఉంది.**

ఈ రెండు ఆశ్రమధర్మాల్లో ఏది బాగుందని అడిగితే రెండింటిలోనూ లాభనష్టాలు ఉన్నాయి. గృహస్థాశ్రమంలో నాకేం లాభం కనపడటం లేదు అనకండి, లేకపోతే ఇంతమంది ఇందులోకి రానే రారు; కళ్యాణ మంటపాలను రెండు సంవత్సరాల ముందునుంచే ఏర్పాటు చేసుకోరు. ముందు గృహస్థాశ్రమంలో లాభనష్టాలేమిటో చూద్దాము.

**లాభం** – పంచమహాయజ్ఞాలు చేయటానికి, తద్వారా సమాజసేవ చేయటానికి గృహస్థాశ్రమం చాలా సదుపాయంగా ఉంటుంది. అదికాక అనేక రకాల భద్రతలకు ఆస్కారం ఉంటుంది. ధనకనకవస్తువాహనాలు ఉంటాయి; పిల్లలు ఉంటారు; బంధుమిత్రులు ఉంటారు.

**నష్టం** – హక్కులు ఉన్నచోట బాధ్యత కూడా ఉంటుంది. పిల్లలు మనని చూడాలంటే వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత ఎక్కువగా ఉంది. వారికి ఎల్.కే.జీ.లో సీటు సంపాదించటం దగ్గరనుంచీ పెళ్ళి చేసేదాకా అనేక బాధ్యతలుంటాయి. బాధ్యతలను వెన్నంటి టెన్షన్ ఉంటుంది. పిల్లలు ప్రయోజకులవుతారో లేదో?

**గృహస్థాశ్రమంలో భద్రత ఉండటం లాభం, టెన్షన్ నష్టం.**

సన్యాసాశ్రమంలో లాభనష్టాలేమిటో చూద్దాము.

**లాభం** – సంసారం లేదు, ఆస్తి లేదు, బంధాలు లేవు కాబట్టి టెన్షన్ లేదు.

**నష్టం** – గృహస్థుకు ఉండే భద్రత లేదు. ఇల్లు, వాకిలి, ఆస్తిపాస్తులు సమకూర్చుకోలేదు.

**సన్యాసాశ్రమంలో బాధ్యత లేకపోవటం లాభం, భద్రత లేకపోవటం నష్టం.**

అందువల్ల కృష్ణపరమాత్మ రెండు ఆశ్రమాలనూ స్తుతించాడు నాల్గవ అధ్యాయంలో –

**త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః ।**
**కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్ కరోతి సః ॥** – 4.20

**నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః ।**
**శారీరం కేవలం కర్మ కుర్వన్ నాప్నోతి కిల్బిషమ్ ॥**– 4.21

ఒక శ్లోకం గృహస్థాశ్రమంలో ఉండి మోక్షం పొందిన జ్ఞాని గురించి చెపితే, ఇంకొక శ్లోకం సన్న్యాసం స్వీకరించిన జ్ఞాని గురించి చెబుతుంది. అంటే దీనర్థం ఏమిటి?

**ఏ ఆశ్రమంలోకి అన్నా వెళ్ళండి, కాని రెండు సాధనలూ పాటించి మోక్షం పొందండి. ఇది కృష్ణపరమాత్మ బోధ సారాంశం.**

కాని అర్జునుడు మళ్ళీ అయోమయంలో పడ్డాడు. రెండూ బాగున్నాయంటే రెండింటిల్లో ఏది ఎన్నుకోవాలి? అసలే అతను సందిగ్ధంలో ఉన్నాడు. అతని మనస్సు సన్న్యాసం స్వీకరించమంటోంది, స్వజనులను చంపవద్దంటున్నది. అతను అతని గృహస్థ ధర్మం పాటించాలా, సన్న్యాసం స్వీకరించాలా?

మామూలుగా రెండింటి మధ్య ఎన్నుకోవాలంటే పెద్ద చిక్కే ఎవరికైనా! అబ్బాయికి ఒకటే యూనివర్సిటీలో సీటు వస్తే ఏ సమస్యా లేదు. అదే రెండు యూనివర్సిటీల్లో సీటు వస్తే ఏది ఎన్నుకోవాలి? ఐదుగురు అబ్బాయిల జాతకాలతో మీ అమ్మాయి జాతకం భేషుగ్గా కుదిరితే, ఏ పెళ్ళికొడుకుని ఎన్నుకోవాలి? ఇది పెద్ద సమస్య! స్వంతంగా నిర్ణయం తీసుకోవటానికి జంకుతారు. ఎందుకంటే మీ నిర్ణయాలవల్ల కలిగే పరిణామాలను తట్టుకునే శక్తి ఉండదు.

ఇప్పుడు అర్జునుని పరిస్థితీ అలాగే ఉంది. కృష్ణపరమాత్మ సన్న్యాసం గురించి చాలా స్పష్టంగా చెప్పాడు. కాని తమాషా ఏమిటంటే అంత స్పష్టంగా చెప్పినా కూడా అర్జునుడు కొంత అయోమయంలో పడగలిగాడు. నిజానికి అంత సర్వజ్ఞుడైన కృష్ణపరమాత్మనే నిస్సహాయస్థితిలో వేశాడు. ఎందుకంటే 18వ అధ్యాయంలో కూడా ఇదే ప్రశ్న వేస్తాడు.

**సన్న్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్ ।**
**త్యాగస్య చ హృషీకేశ పృథక్ కేశినిషూదన ॥** – 18.1

ఇక్కడ ఐదవఅధ్యాయంలో కూడా ఇదే సన్న్యాసం గురించి అడుగుతున్నాడు. ఈ నేపథ్యంతో ఐదవ అధ్యాయంలోకి అడుగుపెడతాము. దీనిపేరు కర్మ సన్న్యాసయోగం. సన్న్యాసం గురించిన చర్చ వస్తుంది కాబట్టి ఆ పేరు వచ్చింది.

**అర్జున ఉవాచ**

శ్లో. 1 **సన్న్యాసం కర్మణాం కృష్ణ పునర్యోగం చ శంససి ।**
**యచ్ఛ్రేయ ఏతయోరేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్ ॥**
సన్న్యాసమ్, కర్మణామ్, కృష్ణ, పునః, యోగమ్, చ, శంససి,
యత్, శ్రేయః, ఏతయోః, ఏకమ్, తత్, మే, బ్రూహి, సునిశ్చితమ్ ॥

| | | | |
|---|---|---|---|
| కృష్ణ! | = ఓ కృష్ణా | యత్ | = ఏది |
| కర్మణామ్, సన్న్యాసమ్ | = (ఒకసారి) కర్మసన్న్యాసమును | సునిశ్చితమ్ | = నిశ్చయముగా |
| పునః | = మరొకసారి | మే, శ్రేయః | = నాకు శ్రేయస్కరమో |
| యోగమ్ చ, | = కర్మయోగమునూ | తత్, ఏకమ్ | = ఆ ఒక్కదానిని |
| శంససి | = ప్రశంసించుచున్నావు | బ్రూహి | = తెలుపుము |
| ఏతయోః | = ఈ రెండింటిలో | | |

**అర్జున ఉవాచ**
**హే కృష్ణ! కర్మణాం సన్న్యాసం, పునఃయోగం చ శంససి ।**
**ఏతయోః యత్ ఏకం శ్రేయః తత్ మే సునిశ్చితం బ్రూహి ॥**

తా: అర్జునుడు పలికెను – ఓ కృష్ణా! ఒక్కసారి కర్మసన్న్యాసమును, మరొకసారి కర్మయోగమును ప్రశంసించు చున్నావు. నిశ్చయముగా ఈ రెండింటిలో నాకు ఏది శ్రేయస్కరమో చెప్పుము.

**1. నిష్ఠాద్వయం శ్లోకాలు 1–6–** ఇంత స్పష్టంగా కృష్ణపరమాత్మ చెప్పినా కూడా, అర్జునుడు అయోమయంలో పడ్డాడని చూశాము కదా! అందువల్ల అర్జునుని ప్రశ్నతో మొదలవుతుంది ఈ అధ్యాయం. ఓ కృష్ణా నువ్వు రెండు ఆశ్రమాలనూ మెచ్చుకుంటున్నావు.

**యోగం చ శంససి** – గృహస్థాశ్రమాన్ని మెచ్చుకుంటున్నావు. మన హిందూధర్మంలో గృహస్థాశ్రమాన్ని బాగా స్తుతిస్తారు. ఎందుకు? గృహస్థు సమాజానికి మూలస్తంభం. అతనిమీదే తక్కిన మూడు ఆశ్రమాలూ ఆధారపడి ఉంటాయి. కొన్ని సాంప్రదాయాల్లో సన్న్యాసులను కీర్తిస్తూ, గృహస్థుల దగ్గరకు వెళ్ళకండి, మీరు కూడా బంధాలు పెంచుకుంటారు అంటారు. కాని నిజం కాదు. మన వైదిక సాంప్రదాయం గృహస్థును కీర్తిస్తుంది. అసలు ఆ జీవనవిధానాన్ని కూడా ఆశ్రమం అని పిలవటంలోనే దాని గొప్పదనం తెలుస్తున్నది. అది కూడా ఆధ్యాత్మిక జీవనానికి తోడ్పడుతుంది.

యోగం అంటే కర్మనిష్ఠ. కర్మనిష్ఠ అంటే గృహస్థుయొక్క జీవనవిధానం. శంససి అంటే మెచ్చుకుంటున్నావు. మూడవ అధ్యాయంలో జనక మహారాజు ఉదాహరణ చెప్పాడు. నాలుగవ అధ్యాయంలో 20వ మంత్రంలో కూడా మెచ్చుకున్నాడని చూశాము.

**సన్న్యాసం కర్మణాం చ శంససి** – సన్న్యాసిని కూడా మెచ్చుకున్నావు. (దాని వెంటనే 4.21 చూశాము)

గృహస్థు గురించి చెప్పినప్పుడు – **కర్మణ్యపి ప్రవృత్తః** అన్నాడు. కర్మలో మునిగి తేలుతున్నవాడు అన్నాడు. సన్న్యాసి గురించి చెప్పినప్పుడు – **త్యక్తసర్వపరిగ్రహః** అన్నాడు. అంటే అన్నీ వదులుకున్న వ్యక్తి అన్నాడు. అంటే కర్మణాం సన్న్యాసం శంససి, యోగం చ. శంకరులువారు యోగం చ, అనుష్ఠానం చ శంససి అని కలిపారు. అంటే ఓ కృష్ణా నువ్వు కర్మయోగాన్నీ మెచ్చుకుంటున్నావు; కర్మ సన్న్యాసాన్నీ మెచ్చుకుంటున్నావు.

**యత్ శ్రేయః ఏతయోః ఏకమ్–** ఇప్పుడు ఈ రెండింటిలో నేను ఏది పాటించాలో నువ్వే చెప్పు. రెండూ బాగున్నాయి, ఏదైనా ఫర్వాలేదు అనవద్దు అంటున్నాడు. కర్మ అనుష్ఠానం, కర్మత్యాగం రెండూ రెండు భిన్నమార్గాలు. సమాజంలో ఉంటే సన్న్యాసం కుదరదు; సన్న్యాసం స్వీకరిస్తే సమాజంలో ఉండలేము. అందువల్ల రెండూ పాటించలేము. అందువల్ల ఈ రెండు జీవనవిధానాల్లో ఏదో ఒకటి చెప్పు. ఇక్కడ జాగ్రత్తగా గమనిస్తే, రెండు సాధనల్లో ఏదో ఒకటి చెప్పు అనటం లేదు; రెండు జీవనవిధానాల్లో ఏదో ఒకటి చెప్పు అంటున్నాడు.

**సునిశ్చితం తన్మే బ్రూహి** – ఏదైనా ఫర్వాలేదని దాటేయకు. ఏదోఒకటి తేల్చిచెప్పు అంటున్నాడు. నువ్వు కొంత సమయం తీసుకున్నా ఫర్వాలేదు, నాకు జవాబు కావాలి. ఇదీ అర్జునుని ప్రశ్న. కృష్ణపరమాత్మ మళ్ళీ మొత్తం చెప్పాలి. దానికి ఎంత ఓపిక కావాలో ఊహించుకోండి!

ఒక సంగీత విద్వాంసుడు గంటసేపు తోడిరాగంలో పాడితే, తల ఊపుతూ విన్న పెద్దమనిషి హఠాత్తుగా లేచి, మీరు తోడిరాగంలో బాగా పాడతారని విన్నాను. నాకోసం దయచేసి అందులో పాడగలరా అని అడిగాడుట! అంతవరకూ తక్కినవారందరూ నిద్రపోతున్నారు, ఈయన ఒక్కడే శ్రద్ధగా వింటున్నాడనుకుని మురిసిపోతున్న ఆ సంగీత విద్వాంసుడు మూర్ఛపోకపోతే అతని అదృష్టం.

అలాగే ఉంది కృష్ణపరమాత్మ పరిస్థితి కూడా. మూడు అధ్యాయాల్లోనూ నేను చెప్పుకొచ్చింది అదే అనలేదు. అర్జునునిమీద అభిమానం కొద్దీ, మళ్ళీ మొదటినుంచీ చెప్పుకొస్తున్నాడు.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 2 **సన్న్యాసః కర్మయోగశ్చ నిఃశ్రేయసకరావుభౌ ।**
**తయోస్తు కర్మసన్న్యాసాత్ కర్మయోగో విశిష్యతే ॥**
సన్న్యాసః, కర్మయోగః, చ, నిఃశ్రేయసకరౌ, ఉభౌ,
తయోః, తు, కర్మసన్న్యాసాత్, కర్మయోగః, విశిష్యతే ॥

| | | | |
|---|---|---|---|
| సన్న్యాసః | = సన్న్యాసము | తయోః | = ఆ రెండింటిలో |
| చ | = ఇంకా | కర్మసన్న్యాసాత్ | = కర్మసన్న్యాసముకన్నా |
| కర్మయోగః | = కర్మయోగము | కర్మయోగః | = (సాధన సులభమైన) కర్మయోగము |
| ఉభౌ | = (అను) ఈ రెండును | విశిష్యతే | = శ్రేష్ఠమైనది |
| నిఃశ్రేయసకరౌ | = పరమశ్రేయస్సును గూర్చునవియే | | |
| తు | = అయితే | | |

**శ్రీభగవాన్ ఉవాచ**
**సన్న్యాసః కర్మయోగః చ ఉభౌ నిఃశ్రేయసకరౌ ।**
**తయోః తు కర్మసన్న్యాసాత్ కర్మయోగః విశిష్యతే ॥**

తా: శ్రీకృష్ణభగవానుడు పలికెను – కర్మసన్న్యాసము, కర్మయోగము అను ఈ రెండును పరమకల్యాణదాయకములే. కాని, ఈ రెండింటిలోను కర్మసన్న్యాసముకన్నా కర్మయోగము సాధనయందు సుగమమగుటవల్ల శ్రేష్ఠమైనది.

ముందుగా కృష్ణపరమాత్మ రెండు ఆశ్రమాలూ సమానంగా మంచివే అంటున్నాడు. ఎందుకంటే రెండింటిలోనూ లాభనష్టాలుంటాయని ఇంతకుముందే చూశాము. ప్రపంచమే అంత! అందుకే ప్రపంచాన్ని **ద్వంద్వప్రపంచం** అంటారు. అంటే ప్రపంచంలో ఏదీ పూర్తిగా మంచిదీ కాదు, పూర్తిగా చెడ్డదీ కాదు. అద్దె ఇంట్లో ఉంటే మంచిదా, స్వంత ఇంట్లో ఉంటే మంచిదా అంటే దేనికుండే లాభనష్టాలు దానికుంటాయి.

**కర్మయోగః సన్న్యాసః చ ఉభౌ నిఃశ్రేయసకరౌ** – కర్మయోగం, సన్న్యాసయోగం – ఈ సాధనలు రెండూ పాటించటానికి మంచివే. ఏమిటా సాధనలు? కర్మయోగ సాధన, జ్ఞానయోగ సాధనలు.

గృహస్థాశ్రమంలో కర్మయోగం సమర్థవంతంగా పాటించవచ్చు కాని, జ్ఞానయోగానికి అనేక ఆటంకాలు ఎదురవుతాయి. గృహస్థుకు ఉన్న అనేక అనుబంధాలవల్ల పెళ్ళిళ్ళకు, చావులకు వెళ్ళాల్సివుంటుంది. బంధువులు, స్నేహితులు వస్తూవుంటారు. ఫోన్లు నిరంతరం మ్రోగుతుంటాయి. అందువల్ల కుదురుగా గంటసేపు ఇంట్లో కూర్చుని నేర్చుకోవటానికి కుదరదు; గీతాబోధకు వెళ్ళటమూ కుదరదు. సరిగ్గా బయలుదేరబోయేముందు ఎవరో వస్తారు. వారికోసం క్లాసు మానేయాల్సివుంటుంది. సన్న్యాసికి ఈ బంధాలు ఉండవు కాబట్టి అతనికి జ్ఞానం పొందటానికి ఆటంకాలు ఉండవు; కాని అతను మంచికర్మలు చేసే అవకాశాలు తక్కువ ఉంటాయి. అతనికి కావాల్సిన వనరులు ఉండవు.

రెండింటిలోనూ లాభనష్టాలు ఉంటాయి. కాబట్టి ఏదైనా పాటించవచ్చు. నిశ్రేయస అంటే మోక్షం. రెండింటిలోనూ ఈ సాధన పాటించి, మోక్షం పొందవచ్చు. రెండూ సమానమే అయినప్పుడు, ఎక్కువ తక్కువల గురించి చెప్పలేము. కాకపోతే ఒకవ్యక్తి మానసిక పరిస్థితిని బట్టి ఏ జీవనవిధానం సరిపోతుందో నిర్ణయించవచ్చు. లౌకికవిద్యలోనే ఒకరికి గణితశాస్త్రం అంటేనే భయం, ఇంకొకరు అందులో దిట్ట. అందువల్ల అతను ఏ గ్రూపు తీసుకోవాలి అంటే అతనికి ఉన్న శ్రద్ధనిబట్టి చెప్పాలి.

అలాగే సన్న్యాసాశ్రమానికి ఒక స్వభావం ఉండాలి. సన్న్యాసం స్వీకరించటం అందరివల్లా కాదు. సన్న్యాసాశ్రమం బాగుంటుందా, బాగుండదా అంటే అది ఆ వ్యక్తి స్వభావంబట్టి ఉంటుంది. అతను అందుకు సంసిద్ధుడయితే బాగుంటుంది; లేకపోతే బాగుండదు.

**తయోస్తు కర్మసన్న్యాసాత్ కర్మయోగో విశిష్యతే** – ఈ రెండింటిలో సన్న్యాసాశ్రమంకన్నా గృహస్థాశ్రమమే మేలైనది అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎవరికి? ఎక్కువమందికి. బ్రహ్మచర్యంనుంచి గృహస్థాశ్రమానికి రావాలి. ఇది

సామాన్యసూత్రం. కాని ఎవరన్నా సన్న్యాసాశ్రమానికి రావాలంటే రావచ్చు. ఇది విశేషసూత్రం. అది కూడా గురువు ద్వారానే స్వీకరించాలి.

శిష్యుడు సన్న్యాసం స్వీకరించటానికి సిద్ధంగా లేడని గురువు గ్రహిస్తే, అతనికి వెంటనే సన్న్యాసదీక్ష ఇవ్వడు గురువు. ఎందుకంటే, సన్న్యాసం స్వీకరించటమనేది వన్‌వే ట్రాఫిక్. అందులోకి వెళ్ళటానికే కాని వెనక్కి తిరిగి రావటానికి ఉండదు. గృహస్థు సన్న్యాసి అవగలడు కాని సన్న్యాసి గృహస్థు అవలేడు. అలా వెనక్కి తిరిగిరాలేని విషయాలలో నిర్ణయాలు ఆచితూచి తీసుకోవాలి. అందువల్ల కర్మయోగః విశిష్యతే అన్నాడు. గృహస్థాశ్రమమే శ్రేష్ఠమైనది అన్నాడు.

అందువల్లనే గీత జనబాహుళ్యానికి వర్తిస్తే, ఉపనిషత్తు పరిపక్వత చెందిన మనుష్యులకు అంటారు. గీత గృహస్థాశ్రమాన్ని స్తుతిస్తే, ఉపనిషత్తు సన్న్యాసాశ్రమాన్ని స్తుతిస్తుంది.

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్త్వమానశుః** – కైవల్యమ్ 3

అంతేకాదు ఉపనిషత్తులకు శంకరభాష్యం చదివితే, ఆయన సన్న్యాసాశ్రమాన్ని ఇంకా కీర్తిస్తారు. మనిషి అంటే సన్న్యాసి అని శంకరులవారి ఉద్దేశ్యం. అదే గీత విషయం తీసుకుంటే కృష్ణుడు సంసారి; అర్జునుడు సంసారి; ఇది రాసిన వ్యాసుడు సంసారి. అందువల్ల సంసారిని స్తుతిస్తారు ఇందులో.

కర్మయోగమా, జ్ఞానయోగమా అనే విషయంలో వికల్పం లేదు కాని జీవనవిధానంలో వికల్పం ఉందని చూశాము కదా! జీవనవిధానాన్ని మూడు రకాలుగా ఎన్నుకోవచ్చు. అవి –

**ఎ).** గృహస్థుగా ఉండి, కర్మ, జ్ఞానయోగాలను పాటించటం.

**బి).** బ్రహ్మచర్యంనుంచి గృహస్థుగా మారకుండా సరాసరి సన్న్యాసం స్వీకరించి, అక్కడ చిత్తశుద్ధి పొంది, జ్ఞానం పొందటం.

**సి).** బ్రహ్మచర్యంనుంచి గృహస్థాశ్రమానికి వచ్చి, కర్మయోగం పాటించి, తరువాత సన్న్యాసం స్వీకరించి, జ్ఞానయోగం పాటించటం.

నిజానికి వేదాలు వర్ణించే వర్ణాశ్రమధర్మాల్లో మూడవ పద్ధతినే సూచిస్తారు. కాని నేటి కాలమానపరిస్థితికి తగ్గట్టుగా దీనికి చిన్న మార్పు వస్తుంది. గృహస్థాశ్రమంలోనే ఉండి కర్మయోగం, జ్ఞానయోగం రెండూ పాటించటం.

కాని గృహస్థాశ్రమంలో ఉంటూ అనేక సమస్యలను ఎదుర్కొంటూ, ఆధ్యాత్మిక సాధన చేయటం ఎలా అనే సందేహం వస్తుంది వెంటనే. దానికి జవాబు వచ్చే శ్లోకంలో వస్తుంది.

శ్లో. 3 **జ్ఞేయః స నిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి ।**
**నిర్ద్వంద్వో హి మహాబాహో సుఖం బంధాత్ ప్రముచ్యతే ॥**

జ్ఞేయః, సః, నిత్యసన్న్యాసీ, యః, న, ద్వేష్టి, న, కాంక్షతి,
నిర్ద్వంద్వః, హి, మహాబాహో, సుఖమ్, బంధాత్, ప్రముచ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| మహాబాహో | = ఓ అర్జునా! | జ్ఞేయః | = తెలిసికొనదగినవాడు |
| యః | = ఎవరైతే | హి | = ఎందుకంటే |
| న, ద్వేష్టి | = ఎవరినీ ద్వేషింపడో | నిర్ద్వంద్వః | = రాగద్వేషాది ద్వంద్వరహితుడు |
| న, కాంక్షతి | = దేనినీ ఆశింపడో | సుఖమ్ | = సుఖముగా |
| సః | = అటువంటి కర్మయోగి | బంధాత్ | = సంసారబంధములనుంచి |
| నిత్యసన్న్యాసీ | = సదా సన్న్యాసిగా | ప్రముచ్యతే | = ముక్తుడగును |

**యః న ద్వేష్టి, న(చ) కాంక్షతి, సః నిత్య-సంన్యాసీ యః,**
**మహాబాహో! హి నిర్ద్వన్ద్వః బన్ధాత్ సుఖం ప్రముచ్యతే ॥**

తా: మహాబాహో! ఎవరినీ ద్వేషింపని, దేనినీ కాంక్షింపని కర్మయోగిని నిత్యసన్న్యాసిగా తెలుసుకొనవలెను. ఎందుకంటే రాగద్వేషాది ద్వంద్వములను అధిగమించినవాడు అవలీలగా సంసారబంధాలనుంచి ముక్తుడగును.

కృష్ణపరమాత్మ గృహస్థాశ్రమం శ్రేష్ఠమైనది అన్నాడు కదా, రెండు ఆశ్రమాలలోని లాభాలు పొందేమార్గం ఏదైనా ఉందా? అంటే మనం గృహస్థుగా ఉంటూ, సన్న్యాసాశ్రమంలో ఉండే లాభం పొందగలమా? ఒకవేళ అర్జునుడు అలా ఆలోచిస్తున్నాడేమో! ఒకవేళ అలా ఆలోచిస్తే, దానికి ఒక మార్గముంది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

మీ రాగద్వేషాలను అదుపులో పెట్టుకుంటే గృహస్థాశ్రమం భారంగా అనిపించదు అంటున్నాడు. సన్న్యాసికి బంధాలు ఉండవు కాబట్టి రాగద్వేషాలు చూపించే అవకాశం ఉండదు. కాని గృహస్థుకు అలాకాదు. అనేక బంధాలు ఉంటాయి. పిల్లల పెళ్ళిళ్ళు అయినకొద్దీ బంధాలు పెరుగుతూ వస్తాయి. అందువల్ల సహజంగా రాగద్వేషాలు కూడా పెరుగుతూ వస్తాయి. రాగద్వేషాలంటే మీ ఇష్టాయిష్టాలు. మీ ఇష్టాయిష్టాలు తీరినా, తీరకపోయినా సమత్వం పాటించగలిగితే, మీరు మోక్షాన్ని జయించినట్టే. దానికి చాలా శక్తి కావాలి.

**నివృత్త రాగస్య గృహం తపోవనమ్** – ఎవరైతే తన రాగద్వేషాలను అదుపులో పెట్టుకోవటం నేర్చుకుంటాడో అతని ఇల్లు ఒక తపోవనంలాంటిది. రాగద్వేషాలను ఎలా అదుపులో పెట్టుకోవాలో ఇక్కడ చెప్పడు కృష్ణపరమాత్మ. రాగద్వేషాలు ఎవరికైనా ప్రాథమిక సమస్య. మనకు సంబంధించిన ప్రతిదానిమీద మనకు రాగమో, ద్వేషమో ఉంటుంది. మనం ఉండే ఇంటిమీద రాగం, మన కుటుంబసభ్యులమీద రాగం ఉంటాయి. వారు మనం ఆశించినట్టుగా లేకపోతే మనం బాగా కలత చెందుతాము. అందుకని ఈ రాగద్వేషాలను అదుపులో పెట్టుకోవటం నేర్చుకోవాలి.

**యో న ద్వేష్టి న కాంక్షతి** – ద్వేష్టి ద్వేషాన్ని, కాంక్షతి రాగాన్ని సూచిస్తాయి. ఏ తెలివైన వ్యక్తి ఎవరినీ ద్వేషించకుండా, దేనినీ కాంక్షించకుండా ఉంటాడో, అతను నిత్యసన్న్యాసి. ఒక సన్న్యాసికి ఎంత శాంతి ఉంటుందో, గృహస్థుకు కూడా అంత శాంతి ఉంటుంది. సన్న్యాసికి కుటుంబం గురించిన చింత ఉండదు. గృహస్థు కూడా రాగద్వేషాలను

అదుపులో పెట్టుకుంటే సన్న్యాసి పొందే ప్రశాంతతను పొందగలడు. కాకపోతే సన్న్యాసి కాషాయవస్త్రం ధరిస్తాడు; గృహస్థు కాషాయవస్త్రం ధరించడు. అంతే తేడా.

**స నిత్యసన్న్యాసీ** – అటువంటి గృహస్థు నిత్యసన్న్యాసిగా ఉంటాడు. ఇది నిరూపించడానికి జనకమహారాజు ఉదాహరణ చెబుతారు. జనకమహారాజు కొందరు సన్న్యాసులతో కలిసి వేదాంతం నేర్చుకుంటున్నాడుట. కొందరు సన్న్యాసులకు గృహస్థులమీద చిన్నచూపు ఉంటుంది. అందువల్ల వారి గురువు వారికి జనక మహారాజు గొప్పతనం చూపించాలనుకున్నాడు.

ఒకరోజు రాజసౌధం, సన్న్యాసుల కుటీరాలు కూడా తగలబడిపోతున్నాయన్న వార్త వచ్చింది. సన్న్యాసులు ఉన్నది చిన్న కుటీరంలో, వారికున్నది ఒక జత కౌపీనం. అయినా ఆ వార్త వినగానే క్లాసునుంచి అందరూ పరుగులు పెట్టారు. తీరా వెళ్ళి చూస్తే అది నిజం కాదనీ, గాలివార్తనీ తెలిసింది. వెనక్కి తిరిగివెళితే క్లాసు నిరాటంకంగా సాగుతోంది, ఒక్కడే శిష్యుడితో. ఆ ఒక్కరూ జనకమహారాజు. అందువల్ల కౌపీనవస్త్రం ఉన్నంత మాత్రాన సన్న్యాసి అవాలని లేదు.

**జటిలో ముండీ లుంచితకేశః కాషాయాంబరబహుకృతవేషః**

**పశ్యన్నపి చ న పశ్యతి మూఢః ఉదరనిమిత్తం బహుకృతవేషః** – భజగోవిందమ్ 14

ఒక వ్యక్తి బాహ్యంగా సన్న్యాసి కాకపోయినా, అంతర్గత వైరాగ్యం పొందవచ్చు. అందువల్ల గృహస్థు తన రాగద్వేషాలను నియంత్రించగలిగితే, అతను ఆంతరసన్న్యాసి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇక్కడ ఒక విషయం గమనించాలి మనం. కృష్ణపరమాత్మ అసలు రాగద్వేషాలు ఉండకూడదు అనటం లేదు. మానవమాత్రుడెవరికీ రాగద్వేషాలు ఉండకుండా ఉండవు. ఆ మాటకొస్తే మన దేవుళ్ళకే రాగద్వేషాలు ఉన్నాయని దయానంద స్వామీజీ అద్భుతంగా వర్ణిస్తారు.

సరస్వతీదేవి వేణువుని, కృష్ణపరమాత్మ వీణను ఎన్నుకోలేదు. వారి ఇష్టాయిష్టాల ప్రకారం వారి సంగీత వాయిద్యాలను, వారి వాహనాలను ఎన్నుకున్నారు.

**ఇంద్రియస్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ।** – 3.34

అందువల్ల ప్రతి ఒక్కరికీ ఇష్టాయిష్టాలు ఉంటాయి. నిజానికి మీ స్వరూపమే మీ ఇష్టాయిష్టాలమీద ఆధారపడి ఉంటుంది. ప్రత్యేక వ్యక్తులను ఇంటర్వ్యూ చేసేటప్పుడు మీకు ఏ వ్యక్తి ఇష్టం, మీకు ఏ పుస్తకం ఇష్టం, మీకు ఏ సంగీతం ఇష్టం అంటూ ప్రశ్నలు వేస్తారు. అందువల్ల రాగద్వేషాలు ఉండకూడదు అనటం లేదు కృష్ణపరమాత్మ, కాకపోతే వాటికి బానిస కావద్దంటున్నాడు అంతే! మీ కోరికలు తీర్చుకోగలిగితే సంతోషం! తీర్చుకోలేకపోతే కృంగిపోకూడదు. రాగద్వేషాలను నియంత్రించటమంటే కోరికలను బంధించకుండా ఉంచే కోరికలుగా మలుచుకోవాలి.

కోరికల గురించి మూడవ అధ్యాయంలో చూశాము. కోరికలను **ధర్మబద్ధమైనవాటిగానూ, బంధింపని కోరికలుగానూ** మలుచుకోవాలి. పిల్లలు బాగా చదవాలనీ, వృద్ధిలోకి రావాలనీ కోరుకోవటంలో తప్పులేదు. కాని అవి నెరవేరకపోతే దాన్ని ఎదుర్కొనే ఆత్మస్థైర్యం ఉండాలి.

**మహాబాహో** – ఓ అర్జునా!; **నిర్ద్వంద్వో హి** – ఎవరైతే ద్వంద్వ ప్రవృత్తులున్న ఈ రాగద్వేషాలను నియంత్రిస్తారో! రాగద్వేషాలు, లాభనష్టాలు, మానావమానాలు, సంయోగవియోగాలు – ఇవన్నీ ద్వంద్వంలోకి వస్తాయి. వాటిని అదుపులో పెట్టగలిగిన వ్యక్తి నిర్ద్వంద్వ వ్యక్తి అవుతాడు.

**బంధాత్ ప్రముచ్యతే** – అటువంటి వ్యక్తి ఖచ్చితంగా మోక్షం పొందుతాడు. సన్న్యాసాశ్రమానికి వెళ్ళకుండానే, గృహస్థాశ్రమంలో ఉంటూనే మోక్షం పొందుతాడు. ఎలా? కర్మయోగం, జ్ఞానయోగం అనే ఈ రెండు సాధనలు చేయటం ద్వారా. పూర్వం వేదాంతం నేర్చుకోవాలంటే హృషీకేష్‌కి వెళ్ళాల్సి వచ్చేది. ఇప్పుడు గీతా క్లాసులు అనేకచోట్ల ఉన్నాయి (మద్రాసు వాస్తవ్యులకి పరమార్థానంద స్వామీజీయే స్వయంగా చెబుతారు). ఇలాంటి క్లాసులు గురుకులం వంటివి. వాటిని సరిగ్గా వినియోగించుకోండి. గృహస్థాశ్రమంలో ఉంటూ జ్ఞానయోగం పాటించండి. అది కూడా ఎలా?

**సుఖం** – సుఖంగా. క్లాసు అవగానే ఇంటికి వెళ్ళి భోజనం చేయవచ్చు. సన్న్యాసాశ్రమంలో ఉండే అవస్థలు ఎదుర్కోనవసరం లేదు. పైపెచ్చు జ్ఞానం పొందవచ్చు. అందువల్ల సుఖంగా అంటే శ్రమపడకుండా, మోక్షం పొందవచ్చు.

శ్లో. 4 **సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి న పండితాః ।**
**ఏకమప్యాస్థితః సమ్యగుభయోర్విందతే ఫలమ్ ॥**
సాంఖ్యయోగౌ, పృథక్, బాలాః, ప్రవదంతి, న, పండితాః,
ఏకమ్, అపి, ఆస్థితః, సమ్యక్, ఉభయోః, విందతే, ఫలమ్ ॥

| | | | |
|---|---|---|---|
| బాలాః | = అవివేకులు | ఏకమ్, అపి | = ఆ రెండింటిలో ఏ ఒక్కదాని యందైనా |
| సాంఖ్యయోగౌ | = సన్న్యాసయోగము, కర్మయోగము | | |
| పృథక్ | = వేర్వేరు ఫలములను ఇచ్చేవిగా | సమ్యక్, ఆస్థితః | = బాగుగా స్థితుడైనవాడు |
| ప్రవదంతి | = చెప్పుచుందురు | ఉభయోః, ఫలమ్ | = రెండింటి ఫలమగు పరమాత్మను |
| న, పండితాః | = పండితులు అలా చెప్పరు | | |
| (హి) | = ఎందుకంటే | విందతే | = పొందును |

**సాంఖ్యయోగౌ పృథక్ (ఇతి) (యే) బాలాః ప్రవదన్తి, న పణ్డితాః ।**
**ఏకమ్ అపి సమ్యక్ ఆస్థితః (పురుషః) ఉభయోః ఫలం విన్దతే ॥**

తా: సాంఖ్య, కర్మయోగములు వేర్వేరు ఫలములను ఇచ్చునని అవివేకులు చెబుతారు. పండితులలా పలకరు. ఆ రెండింటిలో ఏ ఒక్కదానినైనను బాగుగా (విధివిధానముగా) ఆచరించినవాడు, ఈ రెండింటి ఫలస్వరూపమైన పరమాత్మను పొందును.

రెండు ఆశ్రమాలూ సమానంగా ఫలితాన్ని ఇస్తాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. నిజానికి మనకు ఉన్నవి నాలుగు ఆశ్రమధర్మాలు. కాని కృష్ణపరమాత్మ ఇక్కడ రెండింటినే తీసుకున్నాడు. అవి గృహస్థాశ్రమం, సన్న్యాసాశ్రమం.

గృహస్థాశ్రమాన్ని ప్రవృత్తిమార్గమనీ, సన్న్యాసాశ్రమాన్ని నివృత్తిమార్గమనీ అంటారు. ఒకటి ఎక్కువా, ఒకటి తక్కువా అనుకోకూడదు.

**బాలాః ప్రవదంతి** – ఎవరైనా ఒకటి ఎక్కువ అంటే, అతన్ని అజ్ఞాని అంటారని గట్టిగా చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. బాలాః అంటే చిన్నపిల్లలు; అంటే మానసిక పరిపక్వత లేనివారు. జ్ఞానం లేనివారు. ప్రవదంతి అంటే మాట్లాడతారు. అలాంటి మాటలు విననవసరం లేదు. ఏమంటారు వారు?

**సాంఖ్యయోగౌ పృథక్** – సాంఖ్య అంటే సన్న్యాసాశ్రమం; యోగ అంటే గృహస్థాశ్రమం; పృథక్ అంటే భిన్నం. ఒకటి కాదు. సన్న్యాసాశ్రమం, గృహస్థాశ్రమం సమానం కాదు అని మానసిక పరిపక్వత లేనివారు అంటారు. తెలివైన వారు ఏమంటారు?

**న పండితాః** – పండితులు అలా అనరు. అందువల్లనే మన సాంప్రదాయంలో సన్న్యాస గురుశిష్యపరంపర ఉంది; గృహస్థ గురుశిష్యపరంపర కూడా ఉంది.

> **శ్రీ శంకరాచార్యమథాస్య పద్మపాదం చ, హస్తామలకం చ శిష్యమ్ ।**
> **తం తోటకం వార్తికకారమన్యాన్ అస్మద్గురూన్ సంతతమానతోస్మి ॥**
> ఈ గురుపరంపరలో సన్న్యాస గురుశిష్యపరంపర వస్తుంది.

> **భృగుర్వై వారుణిః వరుణం పితరముపససార**
> **అధీహి భగవో బ్రహ్మేతి। తస్మాత్ ఏతత్ ప్రోవాచ** – తైత్తిరీయమ్

భృగువు పుత్రుడు, వరుణుడు తండ్రి. తండ్రి పుత్రునికి బోధించాడు.

> **శ్వేతకేతుర్హారుణేయ ఆస తం హ పితోవాచ** – ఛాందోగ్యమ్ 6.1.1

ప్రసిద్ధమైన తత్త్వమసి మహావాక్యాన్ని తండ్రి పుత్రునికి చెప్పాడు.

ఆ విధంగా శాస్త్రం రెండురకాల పరంపరల గురించీ చెబుతుంది. దీనివల్ల జ్ఞానం ఏ ఆశ్రమంలో ఉండి అయినా పొందవచ్చని అర్థమవుతుంది.

**ఏకమప్యాస్థితః** – అందువల్ల ఏదో ఒక జీవనవిధానాన్ని ఎన్నుకోమంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆ జీవనవిధానం మన ఆలోచననుబట్టి, మన ప్రారబ్ధకర్మనుబట్టి కూడా ఉంటుంది. అందువల్ల ఎవరైనా సన్న్యాసం స్వీకరించాలనుకుంటే అతని జాతకం కూడా చూస్తారు. ఏదేమైనా, ఏ ఆశ్రమంలో ఉన్నా, ఆ ఆశ్రమధర్మాన్ని నిర్వహించాలి. బాహ్యంగా కాషాయవస్త్రం వేసుకుని, శిరోముండనం చేయిస్తే చాలదు. ఆంతరసన్న్యాసం కావాలి.

**సమ్యక్ ఉభయోర్విందతే ఫలమ్** – ఏ ఆశ్రమంలో ఉన్నా, ఆ ఆశ్రమధర్మాన్ని సమర్థవంతంగా పాటిస్తే, ఆ వ్యక్తి రెండు ఆశ్రమాలకూ సమానంగా ఉన్న ఫలాన్ని పొందుతాడు. ఏమిటా సమాన ఫలం? జ్ఞానం!

శ్లో. 5 **యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే ।**
**ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ॥**
యత్, సాంఖ్యైః, ప్రాప్యతే, స్థానమ్, తత్, యోగైః, అపి, గమ్యతే,
ఏకమ్, సాంఖ్యమ్, చ, యోగమ్, చ, యః, పశ్యతి, సః, పశ్యతి ॥

| | | | |
|---|---|---|---|
| యత్, స్థానమ్ | = ఏ పరంధామము | సాంఖ్యమ్ | = జ్ఞానయోగమును |
| సాంఖ్యైః | = జ్ఞానయోగులచేత | చ | = ఇంకా |
| ప్రాప్యతే | = పొందబడునో | యోగమ్ | = కర్మయోగమును |
| తత్ | = ఆ స్థానము | ఏకమ్ | = ఫలవిషయమున ఒక్కదానినిగా |
| యోగైః, అపి | = కర్మయోగులచేతనూ | పశ్యతి | = చూచునో |
| గమ్యతే | = పొందబడును | సః, చ | = అతడే |
| యః | = ఏ పురుషుడు | పశ్యతి | = నిజముగా చూచువాడు (నిజమైన ద్రష్ట) |

**యత్ స్థానం సాంఖ్యైః ప్రాప్యతే, తత్ యోగైః అపి గమ్యతే ।**
**యః సాంఖ్యం చ యోగం చ ఏకం పశ్యతి, స (ఏవ) పశ్యతి ॥**

తా: జ్ఞానయోగులు పొందు పరంధామమునే కర్మయోగులును పొందుదురు. జ్ఞానయోగఫలమును, కర్మయోగ ఫలమును ఒక్కటిగా చూచువాడే యథార్థమును గ్రహించును.

ఇదే భావాన్ని ఈ శ్లోకంలో కూడా కొనసాగిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**సాంఖ్యైః స్థానం ప్రాప్యతే** – సాంఖ్యః అంటే సన్న్యాసులు; స్థానం అంటే మోక్షం. సన్న్యాసులు మోక్షం పొందుతారు. ఎలా? కర్మయోగం, జ్ఞానయోగాలు పాటించటం ద్వారా. కర్మయోగం చిత్తశుద్ధికి అని చూశాము. సన్న్యాసి చేసే కర్మలు కూడా వేరే అని చూశాము. సన్న్యాసి మోక్షం పొందుతాడు అనగానే, అర్జునుడు – అయితే నేను సన్న్యాసం స్వీకరిస్తాను అనే ప్రమాదం ఉంది. అందువల్ల కృష్ణపరమాత్మ ఏమంటున్నాడు?

**తత్ యోగైః అపి గమ్యతే** – తత్ అంటే ఆ స్థానం; ఆ స్థానం అంటే మోక్షం, లక్ష్యం. యోగైః అంటే గృహస్థులు. సన్న్యాసులు ఏ మోక్షాన్ని పొందుతారో గృహస్థులు కూడా అదే మోక్షాన్ని పొందుతారు. సన్న్యాసుల మోక్షం ఎక్కువా కాదు, గృహస్థుల మోక్షం తక్కువా కాదు. మోక్షం అంటేనే అనంతం. అనంతాల్లో రెండు అనంతాలు ఉండవు.

**ఏకం సాంఖ్యం చ యోగం చ** – సన్న్యాసులు పొందే మోక్షం, గృహస్థులు పొందే మోక్షం రెండూ ఒకటే. ఏకం అంటే ఏకఫలం.

**యః పశ్యతి స పశ్యతి** – ఆశ్రమయోః ఏక ఫలత్వం యః పశ్యతి, సః పశ్యతి. రెండు ఆశ్రమాలకు ఒకటే ఫలం అని గ్రహించిన వ్యక్తే తక్కినవారు తప్పుగా చూస్తున్నారని తెలుసుకోగలడు.

రెండు ఒకటే అని ఎందుకు కృష్ణపరమాత్మ నొక్కివక్కాణిస్తున్నాడు? ఏ కాస్త అవకాశం దొరికినా అర్జునుడు యుద్ధభూమినుంచి పారిపోయేలా ఉన్నాడు. అతను పారిపోకుండా చూసే బాధ్యత ఉంది కృష్ణపరమాత్మకు.

శ్లో. 6 **సన్న్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తుమయోగతః ।**
**యోగయుక్తో మునిర్బ్రహ్మ నచిరేణాధిగచ్ఛతి ॥**
సన్న్యాసః, తు, మహాబాహో, దుఃఖమ్, ఆప్తుమ్, అయోగతః,
యోగయుక్తః, మునిః, బ్రహ్మ, నచిరేణ, అధిగచ్ఛతి ॥

| | | | |
|---|---|---|---|
| తు | = అయితే | ఆప్తుమ్ | = పొందుట |
| మహాబాహో! | = ఓ మహాబాహో! | దుఃఖమ్ | = కష్టము |
| అయోగతః | = కర్మయోగమును అనుష్ఠింపక | మునిః | = భగవత్స్వరూపమును మననము చేయు |
| సన్న్యాసః | = సన్న్యాసము (శరీరేంద్రియ మనస్సుల ద్వారా జరుగు కర్మలన్నింటి యందును కర్తృత్వమును త్యజించుట) | యోగయుక్తః | = కర్మయోగి |
| | | బ్రహ్మ | = పరబ్రహ్మ పరమాత్మను |
| | | నచిరేణ | = శీఘ్రముగా |
| | | అధిగచ్ఛతి | = పొందును |

**హే మహాబాహో! అయోగతః సన్న్యాసః తు దుఃఖమ్ ఆప్తుమ్,**
**యోగ-యుక్తః మునిః నచిరేణ బ్రహ్మ అధిగచ్ఛతి ।**

తా: కాని, ఓ అర్జునా! కర్మయోగమును అనుష్ఠింపక సన్న్యాసము అంటే మనస్సు, ఇంద్రియములు, శరీరముల ద్వారా జరుగు కర్మలన్నింటియందును కర్తృత్వమును త్యజించుట – కష్టము. భగవత్స్వరూపమును మననము చేయు కర్మయోగి పరబ్రహ్మపరమాత్మను శీఘ్రముగా పొందగలడు.

ఈ శ్లోకంలో కొత్త విషయం ప్రవేశపెడుతున్నాడు. రెండు ఆశ్రమాలూ సమానమే, వాటిని బాహ్యంగా చూస్తే! విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ అన్ని కోర్సులూ సమానమే. ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువ అనలేము. కాని మనం దేన్ని తేలిగ్గా నేర్చుకోగలమన్నది మన మనోస్థాయినిబట్టి, మన బుద్ధినిబట్టి ఉంటుంది. అలాగే అన్ని వాతావరణాలు ఒకటే. కాని కొందరు చలిని తట్టుకోగలిగితే, కొందరు ఎండను తట్టుకోగలుగుతారు.

అందువల్ల రెండు స్థాయిలూ సమానమే అయినా మనిషి మానసిక పరిపక్వతనుబట్టి కొంత తేడా ఉంటుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. మానసిక పరిపక్వత ఉంటే సన్న్యాసాశ్రమం అద్భుతం; అవి లేకపోతే మాత్రం సమస్యే. అందరూ సన్న్యాసి దగ్గరికి వచ్చి నన్ను ఒంటరితనం బాధిస్తోంది అని తమ సమస్యలు చెప్పుకుంటారే తప్ప ఎవరూ మీకెలా ఉంది, ఒంటరిగా అనిపిస్తోందా అని అడగరు.

ఒంటరితనాన్ని ఇష్టపడితే అది ఆశ్రమప్రశాంతతగా అనిపిస్తుంది. అదే ఒంటరితనం బాధ పెడితే అది స్మశాననిశ్శబ్దంగా అనిపించి భయపెడుతుంది. పెళ్ళి చేసుకుని అమెరికా వెళ్ళి, భర్త ఆఫీసుకు వెళితే భయంకరమైన ఒంటరితనాన్ని, చీమ చిటుక్కుమన్నా వినిపించేటంత నిశ్శబ్దాన్ని భరించలేక పోయింది ఒక స్త్రీ. చాలా డిప్రెషన్‌కు లోనయి, భర్తకు విడాకులిచ్చేదాకా వెళ్ళింది పరిస్థితి. ఎవరో మద్రాసుకు వచ్చేయమని సలహా ఇచ్చారు. ఇప్పుడా జంట మద్రాసులో ఉంది. భర్త ఆఫీసుకు వెళ్ళిపోయినా, రణగొణ ధ్వనులకేం లోటులేదు.

**జ్ఞానం సతాం మానమదాది నాశనం, కేషాంచిదేతన్మదమానకారణమ్ ।**
**స్థానం వివిక్తం యమినాం విముక్తయే, కామతురాణామతికామకారణమ్ ॥** – భర్తృహరి. వైరాగ్య. 77

పరిణతి చెందిన వ్యక్తికి నిశ్శబ్దం ఒక వరం. అతను ఆత్మబ్రహ్మ గురించి ఆలోచించగలుగుతాడు. అదే నిశ్శబ్దం ఇంకొక అతనికి భరించలేనిది కావచ్చు. అందువల్ల సన్న్యాసాశ్రమాన్ని ఆనందించటానికి, మానసిక పరిపక్వత కావాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**మహాబాహో సన్న్యాసః దుఃఖమ్ ఆప్తుమ్ అయోగతః** – ఓ అర్జునా! సన్న్యాసాశ్రమ జీవనం గడపటం అంత తేలిక కాదు. సమస్యలున్నాయని గృహస్థాశ్రమంనుంచి సన్న్యాసాశ్రమంలోకి దూకితే అది – పెనం మీంచి పొయ్యిలో పడ్డట్టే. మానసిక పరిపక్వత వచ్చి సన్న్యాసం తీసుకుంటే బాధలేదు. లేకపోతే దుఃఖమే.

**యోగయుక్తో మునిః** – మునిః అంటే ఏకాంతాన్ని ఇష్టపడే వ్యక్తి.

**మననాత్ మునిః; మౌనాత్ మునిః**

మునికి రెండు అర్థాలున్నాయి – ధ్యానాన్ని ఇష్టపడే వ్యక్తి; ఏకాంతాన్ని ఇష్టపడే వ్యక్తి అని వస్తుంది. చాలామంది ఏకాంతాన్ని ఇష్టపడరు. ఎవరూ దొరక్కపోతే వారిలో వారు మాట్లాడుకునే వారు కూడా ఉంటారు.

**బ్రహ్మ అధిగచ్ఛతి** – కాని మౌనాన్ని ఇష్టపడే అటువంటి సన్న్యాసి బ్రహ్మను పొందుతాడు. అంటే మోక్షాన్ని పొందుతాడు. ఎప్పుడు?

**నచిరేణ** – వీలున్నంత త్వరలో.

కృష్ణపరమాత్మ సలహా ఏమిటంటే చాలామందికి గృహస్థాశ్రమమే అనువైనది, చాలా కొద్దిమందికి మాత్రమే సన్న్యాసాశ్రమం అనువైనది. మనస్సు పరిపక్వత చెందకుండా సన్న్యాసం స్వీకరిస్తే వారు చాలా అవస్థ పడతారు. అందువల్ల గృహస్థాశ్రమమే క్షేమం.

శ్లో. 7 **యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః ।**
**సర్వభూతాత్మభూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥**
యోగయుక్తః, విశుద్ధాత్మా, విజితాత్మా, జితేంద్రియః,
సర్వభూతాత్మభూతాత్మా, కుర్వన్, అపి, న, లిప్యతే ॥

| | | |
|---|---|---|
| విజితాత్మా | = | (ఇక్కడ) శరీరమును జయించినవాడు |
| జితేంద్రియః | = | ఇంద్రియాలను జయించినవాడు |
| విశుద్ధాత్మా | = | మనస్సును వశము నందుంచుకొనినవాడును |
| సర్వభూతాత్మభూతాత్మా | = | సర్వప్రాణులలో ఆత్మ స్వరూపుడైన పరమాత్మను తన ఆత్మగా కలవాడునగు |
| యోగయుక్తః | = | కర్మయోగి |
| కుర్వన్, అపి | = | కర్మలను ఆచరించుచున్నను |
| న, లిప్యతే | = | ఆ కర్మలు వానిని అంటవు |

**యోగయుక్తః విశుద్ధాత్మా విజితాత్మా జితేన్ద్రియః ।**
**సర్వభూతాత్మభూతాత్మా, కుర్వన్ అపి న లిప్యతే ॥**

తా: శరీరమును జయించినవాడు, ఇంద్రియాలను జయించినవాడు, మనస్సును జయించినవాడును, సర్వప్రాణులలో ఆత్మస్వరూపుడైన పరమాత్మను తన ఆత్మగా కలవాడు అగు కర్మయోగి కర్మలను ఆచరించుచున్నను ఆ కర్మలు వానిని అంటవు.

ముందు శ్లోకంవరకూ రెండు ఆశ్రమాలనూ పోల్చి, రెండింటిలోనూ లాభనష్టాలు ఉన్నాయనీ, రెండూ సమానంగా మోక్షాన్ని ఇస్తాయనీ, కాని ఎక్కువమందికి గృహస్థాశ్రమమే మెరుగైనదనీ భగవంతుడు చెప్పాడు. అక్కడితో రెండురకాల జీవనవిధానాల గురించిన చర్చ ముగిసింది.

2. **సాధనద్వయం – శ్లోకాలు 7-21** రెండు సాధనలు ఉన్నాయి. అవి – కర్మయోగ, జ్ఞానయోగ సాధనలు.
**ఎ). కర్మయోగ సాధన** – శ్లోకాలు 7-12 ఈ శ్లోకంనుంచి, ఏ విధమైన జీవన విధానంలో ఉన్నా కూడా పాటించాల్సిన సాధనల గురించి చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. అవన్నీ ఈ ఒక్క శ్లోకంలో అద్భుతంగా చెప్పబడ్డాయి. కృష్ణపరమాత్మ గృహస్థుని దృష్టిలో పెట్టుకుని సాధనలు చెబుతున్నాడు. ఎందుకంటే ఈ రెండూ సమానమే అయినా గృహస్థాశ్రమం శ్రేష్ఠమని చెప్పాడు కాబట్టి. ఏమిటా సాధనలు?

1. **యోగయుక్తః** – కర్మయోగ యుక్తః – మూడవ అధ్యాయంలో వివరించినట్టుగా ముందు కర్మయోగి అవ్వాలి. కర్మయోగి అంటే తన లౌకిక లక్ష్యాలను, ఆధ్యాత్మిక లక్ష్యాలను సమతుల్యం చేసే వ్యక్తి. కర్మయోగి ఎంతసేపూ ధనం వెంట పరుగులు తీయడు. కర్మయోగికి రెండురకాల జీవనాలు గడపాలని తెలుసు. పంచమహాయజ్ఞాలు లౌకిక జీవనంలో చేయాలి, ఆంతర్గత ఎదుగుదలకోసం ఆధ్యాత్మిక చింతన చేయాలి. జీవితం అర్థకామప్రధానమే కాదు – ధర్మమోక్షాలను కూడా పాటించాలి. ఈ రెండింటినీ సమతుల్యం చేయాలి. ఉద్యోగరీత్యా నిచ్చెనలో ఎత్తుకు ఎదగాలి తప్పులేదు; కాని ఆధ్యాత్మిక చింతను దూరం చేయకూడదు.

ఆదివారం గీతాబోధకు రావటమే బ్రహ్మప్రళయం; మధ్యలో గీతను పట్టుకునే తీరిక లేదు అంటారు కొందరు. కాని దానికి ఇంకా ఎక్కువ సమయం కేటాయించటానికి ప్రయత్నించాలి; దానికోసం భగవంతుణ్ణి ప్రార్థించాలి కూడా.

**ఊర్వారుకమ్ ఇవ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మాఽమృతాత్**

దోసకాయ పక్వం చెందేవరకూ తీగకు అనుకుని ఉంటుంది. ఎప్పుడైతే అది పక్వం చెందుతుందో అప్పుడే తీగ దాన్నుంచి విడివడుతుంది. అలా లౌకిక విషయాలకు అంటుకుని ఉన్నా కూడా సమయం ఆసన్నమయినప్పుడు విడివడాలి. దీన్ని యోగయుక్తం అంటారు. ఆంతర ఎదుగుదలకు ప్రాముఖ్యత నివ్వటం.

**నాకు ఏముంది అనుకునేకన్నా, నేను ఏమిటి** అనే విషయానికి ప్రాముఖ్యత నివ్వాలి. ఆరంభంలో నాకు ఏమున్నాయి అనే విషయంమీదే శ్రద్ధ వహిస్తాము, నేను ఏమిటో పట్టించుకోము. రానురాను మన దృక్కోణం మారాలి. తనకంటూ ఏమీ లేకపోయినా పూర్ణుడు అతను అని జ్ఞానిని వివరిస్తారు శంకరులవారు. అందువల్ల నాకు ఏముంది అనుకునేకన్నా, నేను ఏమిటి అనేది ముఖ్యం. ఈ విషయం అర్థమయితే, నేను కర్మయోగిగా మొదలయినట్టే.

మొదటి దశ ఏమిటి? యోగయుక్తం. కర్మయోగి అవటం. యోగః అంటే కర్మయోగః. యోగయుక్తః అంటే **కర్మయోగేన యుక్తః** కర్మయోగీ భవ. కర్మయోగి అయినట్టు సూచన ఏమిటి? కృష్ణపరమాత్మే మూడు సూత్రాల కార్యక్రమాన్ని ఇచ్చాడు మూడవ అధ్యాయంలో –

**మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా ।**
**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥** – 3.30

కర్మయోగి అవాలంటే మూడు నియమాలను పాటించాలి. ఆధ్యాత్మిక చింతనకు ప్రాధాన్యత నివ్వాలి; చేసే ప్రతి పనీ ఈశ్వరార్పణబుద్ధితో చేయాలి; వచ్చిన ప్రతిఫలాన్నీ ఈశ్వరప్రసాదంగా స్వీకరించాలి. అటువంటి వ్యక్తిని యోగయుక్తః అంటారు. సమాజం మీరు లౌకికంగా ఎంత ఎదిగారు అని చూస్తే, వేదాంతం ఆధ్యాత్మికంగా ఎంత ఎదిగారు అని చూస్తుంది. కర్మయోగం మీకు లౌకికంగా ఉన్నతిని తీసుకురాకపోవచ్చు కాని, వేదాంతపరంగా తీసుకువస్తుంది. ఏమిటా ఉన్నతి?

2. **విశుద్ధాత్మా** – శుద్ధమైన మనస్సు. శుద్ధమైన మనస్సు అంటే కామక్రోధలోభమోహమదమాత్సర్యాలకు అతీతంగా ఉన్న మనస్సు. అనారోగ్యకరమైన ఆలోచనలను కృష్ణపరమాత్మ ఆసురీసంపత్తి అంటాడు 16వ అధ్యాయంలో. కర్మయోగం పాటిస్తే ఆసురీసంపత్తి తొలగి, దైవీసంపత్తి పెరుగుతుంది.

**అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగవ్యవస్థితిః ।**
**దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్ ॥** – 16.1

3. **విజితాత్మా జితేంద్రియః** – ఇక్కడ ఆత్మ అంటే శరీరం. విశుద్ధాత్మాలో ఆత్మ అంటే మనస్సు. పక్కపక్కనే వాడిన రెండు పదాల్లోని ఆత్మ పదానికి రెండు అర్థాలు. విశుద్ధాత్మా అంటే శుద్ధమైన మనస్సు; విజితాత్మా అంటే శరీరాన్ని జయించినవాడు; జితేంద్రియః అంటే ఇంద్రియాలను జయించినవాడు.

విజితాత్మా, జితేంద్రియః రెండు పదాలూ ముఖ్యమే. అది నదిని సరిగ్గా వాడటం వంటిది. నదిని సరిగ్గా వాడాలంటే రెండు పనులు చేయాలి. పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తున్న నదిని సముద్రంలో చేరకుండా ఆనకట్ట కట్టాలి. కాని ఆనకట్ట కట్టి, ఆపిన నదిని సరియైన దిశలో మళ్ళించకపోతే అది ఆనకట్టను తెంచుకుని బయటకు

ప్రవహిస్తుంది. అందువల్ల నది నీటిని నిల్వ ఉంచాలి; మంచిమార్గంలో ప్రవహింపచేయాలి. అలాగే మనలో శారీరకశక్తి ఉంది; ఇంద్రియ శక్తి ఉంది; మానసిక శక్తి ఉంది; ధీశక్తి ఉంది. నిజానికి మనకు ఎంతో శక్తి ఉంది కాని దాన్ని అనవసరంగా వృథా చేసేస్తున్నాము. ఇటువంటి శక్తిని నిల్వచేసి, సరియైన దిశలో పంపిస్తే దాన్ని శక్తులను నిర్దేశించటం అంటారు. అటువంటి వ్యక్తి విశుద్ధాత్మా అవుతాడు, జితేంద్రియుడు అవుతాడు.

ఎప్పుడైతే ఒకవ్యక్తి తన ఇంద్రియాలను, మనస్సును శుద్ధి పరచుకుని, ఆత్మజ్ఞానం పొందటానికి అర్హత సంపాదిస్తాడో అటువంటి వ్యక్తిని **జ్ఞానయోగ్యతా పురుషః** అంటారు. జ్ఞానం పొందటానికి ఉండవలసిన అర్హత ఏమిటి? మనస్సును, ఇంద్రియాలను జయించటం.

వేదపూర్వభాగం అంతా ఈ జ్ఞానయోగ్యతాప్రాప్తి కలుగచేస్తుంది. ఎప్పుడైతే జ్ఞానయోగ్యత వస్తుందో, అప్పుడు ఆధ్యాత్మికత వస్తుంది. అది వేద అంతభాగంనుంచి వస్తుంది. కర్మకాండనుంచి జ్ఞానకాండకు వెళ్ళాలి.

**సర్వభూతాత్మభూతాత్మా (భవతి)** – కర్మయోగి జ్ఞానయోగిగా మారతాడు. బహిర్ముఖుడుగా ఉన్నవాడు, అంతర్ముఖుడు అవుతాడు. జ్ఞానయోగంవల్ల ఏం జ్ఞానం పొందుతాడు? దాన్ని కృష్ణపరమాత్మ ఒక్కవాక్యంలో చెప్పేశాడు. అది చాలా ముఖ్యమైన వాక్యం – సర్వభూతాత్మభూతాత్మా.

జ్ఞానయోగంలో మూడు దశలున్నాయి. అవి –

**ఎ).** నేను శరీరంకన్నా భిన్నంగా ఉన్న ఆత్మను. కాంతి, చేతికి సన్నిహితంగా ఉన్నా, కాంతి చేతికి భిన్నంగా ఉంది. చెయ్యి అక్కడ పెట్టినా, తీసేసినా కాంతి ఉంటూనే ఉంటుంది. అలాగే నేను శరీరానికి భిన్నంగా ఉన్న ఆత్మను అంటే, శరీరం ఉన్నా, లేకపోయినా ఆత్మ ఉంటుంది. ఇదంతా వివరంగా రెండవ అధ్యాయంలో 12వ శ్లోకంనుంచి 25వ శ్లోకంవరకు చూశాము.

**బి).** ఈ ఆత్మ నా శరీరంలో మాత్రమే గాదు, అన్ని శరీరాల్లోనూ ఉంది. ఒకే కాంతి చేతిమీదా, పుస్తకంమీదా, బల్లమీదా పడుతుంది. వస్తువులు అనేకం; వాటిమీద పడే కాంతి ఏకం. రూపం ఉన్న వస్తువులమీద రూపం లేని కాంతి పడుతున్నది. అలాగే శరీరాలు అనేకం; వాటిలో ఉన్న ఆత్మ ఏకం. సర్వవ్యాపకమైన, అరూపమైన ఆత్మ రూపమున్న అన్ని శరీరాల్లోనూ ఉంది.

మూడవదశ కృష్ణపరమాత్మ ఇప్పుడు చెప్పడు. మనం కూడా అప్పుడే చూద్దాము.

సర్వభూతాత్మభూతాత్మా అంటే జ్ఞానయోగి, నేను నా శరీరంలోనూ, తక్కిన అన్ని శరీరాల్లోనూ ఉన్న ఆత్మను అని తెలుసుకుంటాడు. సర్వభూత ఆత్మను, ఏక భూత ఆత్మను కాదు. భూతం అంటే శరీరం. సర్వభూత ఆత్మ అంటే నాలోనే కాదు, అన్ని శరీరాల్లోనూ ఉన్నాను.

**సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని ।**
**ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥** – 6.29

**యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।**
**తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥** – 6.30

ఈ వివరాలు మళ్ళీ ఆరవ అధ్యాయంలో చూస్తాము. ఇప్పుడు నేను నాలోనూ, అన్ని శరీరాల్లోనూ ఉన్న ఆత్మను అని జ్ఞానయోగి తెలుసుకుంటాడని అర్థం చేసుకుంటే చాలు. ఈ జ్ఞానం పొందితే, కలిగే ఫలమేమిటి? అతనికి దేహ అభిమానం పోతుంది.

ఇంతవరకూ నేను శరీరాన్ని అనుకుంటున్నాను. అంత ప్రత్యక్షంగా నేను శరీరాన్ని అనకపోయినా, నేను నా గురించి ఇచ్చే వివరాలన్నీ శరీరానికి సంబంధించినవే. నా వయస్సు ఇంత; నేను ఫలాన వారి పుత్రుడను అంటూ చెప్పే వివరాలన్నీ దేహానికి సంబంధించినవే. ఇప్పుడు నేను శరీరానికి భిన్నంగా ఉన్న ఆత్మను అని తెలియటంవల్ల శరీరంనుంచి విడివడతాను. ఎప్పుడైతే శరీరం నేను కాదు అని అర్థం చేసుకుంటానో, అప్పుడే కర్మలు నేను చేస్తున్నాననే భావన కూడా పోతుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

దేహ అభిమాన త్యాగం, కర్మ అభిమాన త్యాగానికి దారి తీస్తుంది. ఎందుకు? కర్మలన్నీ శరీరానికి చెందినవే. ధర్మి అభిమానం ధర్మ అభిమానానికి దారి తీస్తుంది. నిజానికి శంకరులవారు ఈ ప్రాథమిక వాక్యంతో తన బ్రహ్మసూత్ర భాష్యం మొదలు పెడతారు. మన సమస్యలన్నీ మనకున్న రెండు అభిమానాలవల్ల ఏర్పడుతున్నాయి– ఒకటి శరీరంతో మమేకం చెందటం; ఇంకొకటి శరీరధర్మాలతో మమేకం చెందటం. వేదాంతం ఈ అభిమానాలను పారద్రోలటానికి కంకణం కట్టుకుంది.

**కుర్వన్నపి న లిప్యతే** – జ్ఞాని ఏ కర్మవల్లా చలించడు. ఏ కర్మతోనూ మమేకం చెందడు. కుర్వన్నపి – కర్మ చేస్తున్నా కూడా చలించడు. కారు గంటకు 80 కిలోమీటర్ల వేగంతో వెళుతున్నా కారులో కూర్చున్న మీకు ఆయాసం రాదు. అలాగే జ్ఞానికి కర్మ అభిమానం ఉండదు. దీన్ని **అహంకార అభిమాన అభావం** అంటారు. దీన్ని మూడవ అధ్యాయంలో చూశాము.

**ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।**
**అహంకారవిమూఢాత్మా కర్తాఽహమితి మన్యతే ॥** – 3.27

శరీరంతో మమేకం చెందిన వ్యక్తి కర్త అవుతాడు, దాని ఫలితంగా భోక్త కూడా అవుతాడు. అటువంటి వ్యక్తిని విమూఢాత్మా అన్నాడు కృష్ణపరమాత్మ.

**తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః ।**
**గుణా గుణేషు వర్తంతే ఇతి మత్వా న సజ్జతే ॥** – 3.28

దానికి భిన్నంగా జ్ఞాని తన శరీరాన్ని తనకు భిన్నంగా చూడగలుగుతాడు. తక్కిన శరీరాలు ఈ భూమ్మీదకు వచ్చిపోయినట్టుగా తన శరీరం కూడా ఎప్పుడో వెళ్ళిపోతుందని అర్థం చేసుకుంటాడు. మామూలుగా మనం ఎవరో చనిపోతే వైరాగ్యం ప్రదర్శిస్తాము కాని జ్ఞాని తన శరీరంమీద వైరాగ్యం పెంచుకుంటాడు. వైరాగ్యం

పెంచుకుంటే ప్రకృతి సూత్రాలను స్వీకరిస్తాము. వైరాగ్యం లేకుండా మమకారం ఉంటే ప్రకృతి సూత్రాలమీద కోపం, ద్వేషం పెంచుకుంటాము.

జ్ఞాని అలా కాదు. అతను ప్రకృతి సూత్రాలను అంగీకరిస్తాడు. ఈ శరీరం షడ్వికారాలకు లోనవుతుందని అర్థం చేసుకుంటాడు. అవి – అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి – దీన్నే వైరాగ్యం అంటారు. న లిప్యతే అంటే అతను చలించడు. ఈ భావాన్నే తర్వాత వచ్చే శ్లోకాల్లో ఇంకా వివరంగా చెబుతున్నాడు.

శ్లో. 8 **నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।**
**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥**
న, ఏవ, కించిత్, కరోమి, ఇతి, యుక్తః, మన్యేత, తత్త్వవిత్,
పశ్యన్, శృణ్వన్, స్పృశన్, జిఘ్రన్, అశ్నన్, గచ్ఛన్, స్వపన్, శ్వసన్ ॥

శ్లో. 9 **ప్రలపన్ విసృజన్ గృహ్ణన్నున్మిషన్ నిమిషన్నపి ।**
**ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంతే ఇతి ధారయన్ ॥**
ప్రలపన్, విసృజన్, గృహ్ణన్, ఉన్మిషన్, నిమిషన్, అపి,
ఇంద్రియాణి, ఇంద్రియార్థేషు, వర్తంతే, ఇతి, ధారయన్ ॥

| | | | |
|---|---|---|---|
| తత్త్వవిత్, యుక్తః | = తత్త్వజ్ఞుడైన సాంఖ్యయోగి | గృహ్ణన్ | = గ్రహించుచు |
| పశ్యన్ | = చూచుచు | ఉన్మిషన్ | = కనులను తెరచుచు |
| శృణ్వన్ | = వినుచు | నిమిషన్, అపి | = మూయుచును |
| స్పృశన్ | = స్పృశించుచు | ఇంద్రియాణి | = ఇంద్రియములు |
| జిఘ్రన్ | = ఆఘ్రాణించుచు | ఇంద్రియార్థేషు | = తమతమ శబ్దాది విషయములందు |
| అశ్నన్ | = తినుచు | వర్తంతే, ఇతి | = ప్రవర్తించుచున్నవని |
| గచ్ఛన్ | = నడుచుచు | ధారయన్ | = తలంచుచు |
| స్వపన్ | = నిద్రించుచు | కించిత్, న | = నేను ఏ కొంచెమూ |
| శ్వసన్ | = శ్వాసక్రియలను నడుపుచు | ఏవ, కరోమి | = (ఏమియు) చేయుట లేదు |
| ప్రలపన్ | = భాషించుచు | ఇతి, మన్యేత | = అని భావించును |
| విసృజన్ | = త్యజించుచు | | |

**యుక్తః పశ్యన్, శృణ్వన్, స్పృశన్, జిఘ్రన్, అశ్నన్,**
**గచ్ఛన్, స్వపన్, శ్వసన్, ప్రలపన్, విసృజన్, గృహ్ణన్, ఉన్మిషన్,**

**నిమిషన్ అపి ఇన్ద్రియాణి ఇన్ద్రియ–అర్థేషు వర్తన్తే ఇతి ధారయన్**
**కించిత్ న ఏవ కరోమి ఇతి మన్యేత ।**

తా: తత్త్వజ్ఞుడైన సాంఖ్యయోగి చూచుచు, వినుచు, స్పృశించుచు, ఆఘ్రాణించుచు, భుజించుచు, నడుచుచు, నిద్రించుచు, శ్వాసక్రియలను నడుపుచు, భాషించుచు, త్యజించుచు, గ్రహించుచు, కనులను తెరుచుచు, మూయుచు ఉన్నను ఇంద్రియములు తమ తమ విషయములందు వర్తించుచున్నవనియు, తానేమియు చేయుటలేదనియు భావించును.

ఇప్పుడు జ్ఞాని జీవనవిధానం గురించి వివరిస్తున్నాడు. అతను కర్మయోగం, జ్ఞానయోగం పాటించి జ్ఞానం పొందాడు. అతను గృహస్థజ్ఞాని అన్నా కావచ్చు, సన్న్యాసజ్ఞాని అన్నా కావచ్చు. నాలుగవ అధ్యాయంలో ఇద్దరి గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ.

శంకరాచార్యులనే తీసుకోండి – ఆయన దేశమంతటా అనేకసార్లు పర్యటించారు. అది కూడా కాలినడకన. అనేక మతాలను స్థాపించారు; షణ్మతస్థాపన చేశారు; ఎందరితోనో వాదప్రతివాదనలు చేశారు; ఎన్నో శ్లోకాలు రాశారు; ఎన్నో భాష్యాలు రాశారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన గృహస్థుకన్నా చాలా ఎక్కువగా కర్మలు చేశారు. కాని గృహస్థజ్ఞాని, సన్న్యాసజ్ఞానుల్లోనూ సమానంగా ఉన్న లక్షణమేమిటి? **వైరాగ్యం**.

**నైవ కించిత్ కరోమి** – ఆత్మ స్వరూపం ఏ పనీ చేయదు. అది అకర్త. అందువల్ల అభోక్త కూడా. చేయి కదిలితే కాంతి కూడా కదిలినట్టుగా అనిపిస్తుంది కాని నిజానికి అది కదలదు. జ్ఞాని తను అకర్తా, అభోక్తా అని తెలిసి కూడా, తను చేయవలసిన విధిని నిర్వర్తిస్తాడు. అతనికి ఏమీ వ్యక్తిగత కోరిక లేదు. అతను పూర్ణపురుషుడు, కృతకృత్యుడు. అలాంటప్పుడు అతన్ని పని చేయటానికి ఏది ప్రేరేపిస్తుంది? సమాజంమీద దయ, జాలి ప్రేరేపిస్తాయి. అజ్ఞానపూర్వకమైన సమాజంకోసం, అవస్థ పడుతున్న జగత్తుకోసం పనిచేస్తాడు. ప్రేమ, దయలను అతను అలవరచుకోనవసరం లేదు. జ్ఞానం అతనిలో సహజంగా ఉన్న ప్రేమను వెలికితీస్తుంది.

దయానంద స్వామీజీ అద్భుతంగా చెబుతారు – మనం ప్రేమను కష్టపడి పెంపొందించుకోనవసరం లేదు. ఎందుకంటే మనం స్వతహాగా ప్రేమమూర్తులం. మన సహజగుణం జాలి, దయ. కాని మనం దాన్ని మన స్వార్థంతో కప్పేశాము. స్వార్థం, మన శరీర అభిమానంవల్ల ఏర్పడింది. ఎప్పుడైతే దేహ అభిమానాన్ని పారద్రోలుతామో, కప్పబడివున్న జాలి, దయాగుణాలు వాటంతట అవే వెలికివస్తాయి.

ఈ జాలి, దయాగుణాలు ఎలా వెలికివస్తాయి? కర్మరూపంలో వస్తాయి. ధనం కావాల్సిన వారికి ధనసహాయం చేస్తాము; జ్ఞానం కావాల్సినవారికి జ్ఞానం ప్రసాదిస్తాము.

**భుక్తి ముక్తి ప్రదాతా చ తస్మై శ్రీగురవేనమః**

ఏం చేసినా ధార్మికంగా చేస్తాము. దేహ అభిమానం అధార్మిక పనులు చేయిస్తే, దేహ అభిమాన త్యాగం ధార్మికపనులు చేయిస్తుంది. మళయాళంలో ఒక అద్భుతమైన శ్లోకం ఉంది. దానర్థం – "ఓ దేవా! నాకు 'నేను' అనే భావన పడకూడదు. ఒకవేళ 'నేను' అనిపిస్తే, ఆ 'నేను' మొత్తం సృష్టితో మమేకం చెందాలి." మొత్తం జగత్తుతో నేను మమేకం చెందితే, నేను దేవుణ్ణి అవుతాను. అప్పుడు నేను ఏంచేసినా దేవుడు చేసినట్టు అవుతుంది.

దేవుడు ఎన్నడూ అధర్మం చేయడు కాబట్టి జ్ఞాని కూడా ఎన్నడూ అధర్మం చేయడు. అందువల్ల అతను కర్మలు చేస్తూనే ఉంటాడు. ఏం కర్మలు చేస్తాడు?

**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్ అశ్నన్** – ఈ ఐదు పదాలు పంచజ్ఞానేంద్రియ కర్మలను సూచిస్తాయి. చూడటం, వినటం, స్పర్శించటం, వాసన చూడటం, రుచి చూడటం. ఈ పనులన్నీ జ్ఞాని చేస్తూనే ఉంటాడు. అలాగే కర్మేంద్రియాలను కూడా పని చేయిస్తాడు. ఏమిటవి?

**గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ప్రలపన్ విసృజన్ గృహ్ణన్ ఉన్మిషన్ నిమిషన్** – ఇవన్నీ కర్మేంద్రియాల పనులు. గచ్ఛన్ – నడుస్తాడు; స్వపన్ – నిద్రిస్తాడు; ప్రలపన్ – మాట్లాడతాడు; విసృజన్ – విసర్జన క్రియ చేస్తాడు; గృహ్ణన్ – తీసుకుంటాడు; శ్వసన్ – శ్వాసక్రియలు జరుపుతాడు; ఉన్మిషన్ నిమిషన్ – కళ్ళు తెరిచి, మూస్తాడు. ఈ చర్యలన్నీ చేస్తూనే ఉంటాడు. వాటిలో ఏ మార్పూ ఉండదు. జ్ఞానం పొందాక చేతితో నడవడు; తలక్రిందులుగా నడవడు; ముక్కుతో తినడు. అంతా మామూలుగానే ఉంటుంది.

స్థితప్రజ్ఞుని లక్షణాలు ఎలా ఉంటాయని అర్జునుడు రెండవ అధ్యాయంలో అడిగాడు. జ్ఞానిలో ఏదో భిన్నప్రవర్తన ఎదురు చూస్తాము.

> **స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।**
> **స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్ ॥** – 2.54

స్థితప్రజ్ఞుడు ఎలా మాట్లాడతాడు, ఎలా కూర్చుంటాడు, ఎలా నడుస్తాడు అని అడిగాడు. జ్ఞాని జ్ఞానం పొందటంవల్ల అతని దృక్పథంలో గొప్ప మార్పు వస్తుంది. అందువల్ల పరిస్థితులను ఎదుర్కోవటంలో గొప్ప మార్పు వస్తుంది కాని కర్మ చేయటంలో బాహ్యంగా ఏ మార్పూ కనబడదు.

ఏదైనా చిన్న సమస్య ఎదురైతే, అజ్ఞాని వారాల తరబడి బాధపడతాడు; కాని జ్ఞాని బాధ పడడు. ఒక జ్ఞాని ఏదో సమస్య గురించి వినగానే ముందు కంగారుగా 'ఏమిటీ?' అన్నాడుట. కాని వెంటనే నిలదొక్కుకుని, తను నేర్చుకున్న జ్ఞానాన్ని గుర్తు తెచ్చుకుని 'అయితే ఏమిటి?' అన్నాడుట. అదీ తేడా – అజ్ఞానికీ, జ్ఞానికీ. జీవితంలో అనేక ఒడిదుడుకులు వస్తూవుంటాయి, పోతూవుంటాయి.

ఒక వ్యక్తికి గుండెజబ్బు వచ్చి చావుబతుకుల్లో ఉన్నాడు. అతన్ని ఒక డాక్టరు నయం చేస్తున్నాడు. ఆ సమయంలో ఆ రోగికి పదిలక్షల లాటరీ టికెట్టు తగిలింది. అతని కుటుంబసభ్యులు ఈ విషయం అతని చెవిన వేయటానికి జంకారుట. అసలే అంతంత మాత్రంగా కొట్టుకుంటున్న అతని గుండె కాస్తా చటుక్కున ఆగి కూర్చుంటుందేమోనని భయపడ్డారుట. విషయం విన్న డాక్టరు వారికి నచ్చచెప్పి, తను రోగికి నెమ్మదిగా శుభవార్త వినిపిస్తానన్నాడుట. అన్నట్టుగానే ఆ కబురూ, ఈ కబురూ చెప్పి నెమ్మదిగా, 'నీకు 10 లక్షల లాటరీ తగిలితే ఏంచేస్తావు,' అన్నాడట. అతను తడుముకోకుండా, 'మీ దయవల్లనే నేను బతికి బయటపడ్డాను. అందులో 5 లక్షలు మీకు కానుకగా సమర్పించుకుంటాను,' అన్నాడుట. ఆ మాట విని డాక్టరు గుండె ఆగి మరణించాడుట. డాక్టరుకు షాకు తగిలింది. కాని జ్ఞానికి అలాంటి షాకులు ఉండవు. ఒకవేళ ఏమిటి అన్నా, అయితే ఏమిటి దశకు వెంటనే వచ్చేస్తాడు.

**గీత అంటే 'ఏమిటి?'నుంచి 'అయితే ఏమిటి?' దశకు చేరుకోవటం**

**ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంతే** – పాంచభౌతికాలతో చేయబడిన ఈ శరీరం పాంచభౌతిక ప్రపంచంతో వ్యవహారం జరిపితీరాలని అర్థం చేసుకుంటాడు. కొంతమంది ప్రపంచంనుంచి పారిపోతేనే శాంతి దొరుకుతుంది అనుకుంటారు. కళ్ళు మూసుకుని యోగముద్రలో కూర్చోవాలనుకుంటారు లేదా నిర్వికల్ప సమాధిలోకి వెళ్ళాలి అనుకుంటారు కాని ప్రారబ్ధకర్మ ఎక్కువసేపు సమాధిలో కూర్చోనివ్వదు.

**పునశ్చ జన్మాంతరకర్మయోగాత్ స ఏవ జీవః స్వపితి ప్రబుద్ధః** – కైవల్యమ్ 1.14

జ్ఞాని ఇంద్రియాలను, ఇంద్రియవిషయాలతో వ్యవహారం నడపనిస్తాడు. ఇంద్రియాలు, విషయవస్తువులతో వర్తిస్తున్నప్పుడు దానికి తగ్గ ప్రతిచర్య ఉంటుందని గ్రహిస్తాడు. ఉదాహరణకు వాతావరణం వేడిగా ఉంటే చెమట పోస్తుంది; వాతావరణం చల్లగా ఉంటే దోమలు కూడా వస్తాయి. ఇవేవీ తప్పించుకోలేము.

**ఇతి ధారయన్** – ధారయన్ అంటే జ్ఞాని తాను చేసే అన్ని వ్యవహారాలలోనూ ఈ విషయం గుర్తుంచుకుంటాడు.

**తత్త్వవిత్ యుక్తః మన్యేత** – తత్త్వవిత్ అంటే జ్ఞాని; యుక్తః అంటే జాగరూకతో ఉన్న వ్యక్తి. జీవితాన్ని యాంత్రికంగా గడిపితే గీత తోడ్పడదు. అదే జాగరూకతో వ్యవహరిస్తే ఈ జ్ఞానం అన్నివేళలా తోడుగా ఉంటుంది. అటువంటి వ్యక్తిని యుక్తః అంటారు. ఏం గుర్తుంచుకుంటాడు ఎప్పుడూ?

(అహం) నైవ కించిత్ కరోమి – నేను కొంచెం కూడా ఏమీ చేయటం లేదు. నేను ఆత్మను.

శ్లో. 10 **బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।**
**లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా ॥**
బ్రహ్మణి, ఆధాయ, కర్మాణి, సంగమ్, త్యక్త్వా, కరోతి, యః,
లిప్యతే, న, సః, పాపేన, పద్మపత్రమ్, ఇవ, అంభసా ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవరైతే | అంభసా | = జలబిందువులచే |
| కర్మాణి | = కర్మలనన్నింటిని | పద్మపత్రమివ | = పద్మపత్రము వలె |
| బ్రహ్మణి, ఆధాయ | = భగవదర్పణము గావించి | పాపేన | = పాపము(ల)చే |
| సంగమ్, త్యక్త్వా | = ఆసక్తిని త్యజించి | న, లిప్యతే | = తాకబడదు (పాపములు ఆ పురుషునికి ఏ మాత్రము అంటవు) |
| కరోతి | = (కర్మలను) ఆచరించుచున్నాడో | | |
| సః | = ఆ పురుషుడు | | |

**యః సఙ్గమ్ త్యక్త్వా కర్మాణి, బ్రహ్మణి ఆధాయ కరోతి,**
**సః పద్మ-పత్రమ్ అమ్బసా ఇవ, పాపేన న లిప్యతే ।**

తా: కర్మలనన్నింటిని భగవదర్పణము గావించి, ఆసక్తిరహితముగా కర్మల నాచరించు వానిని తామరాకుపై నీటిబిందువులవలె పాపములు అంటవు.

జ్ఞానికి ఏమవుతుందో ముందు రెండు శ్లోకాల్లో చూశాము. జ్ఞాని తను పారమార్థిక సత్యమని అంటే ఆత్మ అని తెలుసుకుంటాడు. ఎప్పుడైతే తన ఉన్నతస్థాయికి ఎదుగుతాడో, అనాత్మస్థాయికి చెందిన కష్టనష్టాలు అతనికి చాలా చిన్నవిగా అనిపిస్తాయి. అవి జ్ఞానిని ఏమాత్రం చలింపజేయలేవు.

స్వాతంత్ర్య పోరాటం సలిపిన వీరులగాథలు చూడండి! వారిని కొట్టారు, హింసించారు, అండమాన్ జైలులో పెట్టారు, కాని వారు **వందేమాతరం** నినాదం మానలేదు. వారి శరీరానికి నొప్పి కలగలేదా? కలిగింది. కాని వారు దాన్ని పట్టించుకోలేదు. వారిలో రెండు **నేనులు** ఉన్నారు. శారీరక నేను, భారతీయుడనైన నేను. భారతీయుడైన నేను పడే బాధల ముందు శరీరమైన నేను పడే బాధలు తక్కువనుకున్నారు వారు. ఆ బాధలు ఉన్నాయి, కాని ఆ నొప్పి పెద్దనొప్పి ముందు చిన్నదయిపోయింది. ఒక కప్పులో ఉప్పునీరు ఉంటే, దానిలోని ఉప్పదనం పోగొట్టాలంటే ఏం చేయాలి? నీటిలో కరిగిపోయిన ఉప్పును ఆవిరి చేయలేము; కాని దానిలో ఇంకా ఎక్కువ నీరు పోస్తే, ఆ ఉప్పు తక్కువవుతుంది. అది పోదు కాని తక్కువగా ఉన్నట్టు అనిపిస్తుంది.

అలాగే జ్ఞానికి శారీరక బాధలు ఉండవని కాదు అర్థం. అనారోగ్యం వస్తే శారీరక బాధలు తప్పవు. గుర్తుంచుకోండి: **జ్ఞానం శారీరక బాధలనుంచి విముక్తి కలిగించదు.** శారీరక బాధలను సంసారం అనికూడా అనరు. మన మానసిక బాధలను సంసారం అంటారు. ఏదైనా వస్తే **నాకే ఎందుకు వచ్చింది** అని వాపోతాము. జ్ఞాని అలా చేయడు. ఒక చిన్న పిల్లవాణ్ణి చూడండి, అనారోగ్యం వస్తే – నాకే ఎందుకు వచ్చింది అనుకోడు; దీనివల్ల ఎంత ఖర్చు అవుతుంది, ఇంకెంత అవస్థ పడాలిలాంటి మానసిక బెంగలు పెట్టుకోడు. ఓపిక లేకపోతే పడుకుంటాడు, ఓపిక ఉంటే జ్వరం ఉన్నా లేచి ఆడుకుంటాడు. జ్ఞాని కూడా శారీరక బాధలకు మానసిక బెంగలను జత చేయడు.

స్వాతంత్ర్యయోధులలాగా ప్రవర్తిస్తాడు జ్ఞాని. ఒక్కొక్క దెబ్బ తగిలినకొద్దీ స్వాతంత్ర్యయోధులు **వందేమాతరం** అని అరిచారు. నేను ఒక వ్యక్తిని అనుకునేకన్నా, నేను ఒక భారతీయుణ్ణి అని అనుకోగలిగినందుకు వారు దెబ్బలు తట్టుకోగలిగారు. అలాంటిది నేను ఒక ఆసియాఖండవాసిని, నేనొక మానవుణ్ణి, నేనొక జీవిని, నేను బ్రహ్మను అనుకుంటే ఆ నొప్పి అంతకంతకూ తగ్గుతూ వస్తుంది. జ్ఞాని అహంకారాన్ని జయించే విధానం ఇది.

కాని ఈ జ్ఞానం పొందాలంటే, మన ఉన్నతస్థితిని అర్థం చేసుకోవాలి. అది చాలా సూక్ష్మమైన సత్యం. ఆత్మ, ఆత్మ అంటున్నారు, అసలు నిజంగా ఆత్మ ఉందా? లేక అది మీ ఊహాగానమా అని ప్రశ్నించేవారికి జవాబు ఈ శ్లోకం. నీ ఉన్నతస్థితిని చేరుకునేవరకూ నీ ఇష్టదేవత ప్రార్థన చేయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్లనే మనం ప్రపంచంమీద ఆధారపడటంనుంచి దేవునిమీద ఆధారపడటం నేర్చుకుని, దేవునిమీద ఆధారపడటంనుంచి ఆత్మమీద ఆధారపడటం నేర్చుకోవాలి.

**ప్రపంచంమీద ఆధారపడటంనుంచి దేవునిమీద ఆధార పడటం – కర్మయోగం**
**దేవునిమీద ఆధారపడటంనుంచి ఆత్మమీద ఆధార పడటం – జ్ఞానయోగం**

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ జ్ఞానయోగంనుంచి కర్మయోగానికి దిగివస్తున్నాడు. ఎవరికైనా ద్వైతభక్తి తేలిక; అద్వైతం కష్టం. అద్వైతానికి త్వరగా రాలేనంటే, మన శాస్త్రం బలవంతపెట్టదు, తొందర పెట్టదు. మీకు కావాల్సిన సమయం తీసుకోండి, ఈ జన్మలో కాకపోతే వచ్చే జన్మలో రండి అంటుంది.

**కర్మాణి బ్రహ్మణ్యాధాయ** – నీ ఉన్నతస్థితిని కనుగొనేవరకూ సగుణబ్రహ్మమీద ఆధారపడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. బ్రహ్మణి అంటే సగుణబ్రహ్మ. సగుణబ్రహ్మ ఎవరు? నీ ఇష్టదేవత. ఆ ఇష్టదేవతకు నీ కర్మలన్నీ అర్పించు. ఈశ్వరార్పణబుద్ధితో కర్మలు చేయి. నిష్కామకర్మ అయినా, సకామకర్మ అయినా ఈశ్వరునికి అర్పించు. కొంతమంది చూడండి – ఏదైనా సంస్థనుంచి కొంచెం ధనం అవార్డుగా వస్తే, మళ్ళీ ఆ సంస్థకే దాన్ని కానుకగా సమర్పిస్తారు.

కర్మను ఎలా ఈశ్వరునికి అర్పించాలి?

**యత్ యత్ కర్మ కరోమి తత్ తత్ అఖిలం శంభో తవారాధనమ్** – ఇదొక సంకల్పం. ఈ సంకల్పం కర్మను ఆరాధనగా మారుస్తుంది. ఇలా ఈశ్వరార్పణభావనతో చేయటంవల్ల రెండు ప్రయోజనాలున్నాయి. ఒకటి, చేసేపనిని శ్రద్ధగా, మనస్ఫూర్తిగా చేస్తాము. రెండు, ఈశ్వరుణ్ణి తలుచుకుని చేయటంవల్ల కర్మపూజ అవుతుంది, పూజ చిత్తశుద్ధిని కలుగజేస్తుంది.

కర్మఫలం గురించి ఎలా ఉండాలి మన ఆలోచన? కర్మలు రెండు రకాలుగా చేస్తాము. కొన్ని కర్మలు కేవలం ఆధ్యాత్మిక ఎదుగుదలకే తోడ్పడతాయి. ఉదాహరణకు సంధ్యావందనం. సంధ్యావందనం చేయటంవల్ల లౌకిక ప్రయోజనం కలుగదు. అలాగే పంచమహాయజ్ఞాలు. వాటిని నిత్యనైమిత్తక కర్మలు అనీ, విహితకర్మలు అనీ అంటారు. ఇవి చిత్తశుద్ధి కలుగజేస్తాయి. వీటి ఫలితం ఎలా ఉన్నా, మనను బాధించవు. ఎందుకంటే వీటివల్ల లౌకికసుఖాలు కలుగవు.

ఇంకొకరకం కర్మలను సకామకర్మలు అంటారు. వీటిలో మనం ఒక ఫలితాన్ని ఆశిస్తాము. ఒక కంపెనీలో పనిచేస్తుంటే, జీతం పెరగాలని కోరుకుంటాము. అవన్నీ కామ్యకర్మల క్రింద వస్తాయి. ఇదంతా వివరంగా మూడవ అధ్యాయంలో చూశాము. ఈశ్వరునికి అర్పించి, ఈశ్వరప్రసాదంగా తీసుకోవాలి. జీతం దేవుని దగ్గర పెట్టి, మళ్ళీ తీసుకుంటాము. కొత్త బట్టలు దేవుని దగ్గర పెట్టి కట్టుకుంటాము. కొత్త ఇంటికి దేవుని ఫోటోతో గృహప్రవేశం చేస్తాము. కొత్త పుస్తకంలో స్వామీజీ సంతకం పెట్టించుకుని వెనక్కి తీసుకుంటాము.

నిష్కామకర్మలో ఏ ఫలితాన్నీ ఆశించము కాబట్టి, ఏ సమస్యా లేదు. సకామకర్మలో కూడా ఈశ్వరార్పణ బుద్ధితో చేసి, ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరిస్తే జీవితం ప్రశాంతంగా సాగుతుంది. ఏం జరిగినా ఈశ్వరేచ్ఛ అని అర్థం చేసుకుంటాము. అప్పుడు ఫలితం ఎలావున్నా బాధపడము. దేవుడు ఎన్నడూ అన్యాయం చేయడు. ఒకవేళ అన్యాయం చేసినట్టు కనబడినా కూడా, మనకు సరిగ్గా అర్థం కాలేదని అర్థం చేసుకోవాలి. ఒక ఫలం రావటం వెనుక అనేక అంశాలు ఉన్నాయని తెలుసుకోవాలి. మనం పొందిన ఫలం మనకు రావాల్సిన ఫలం, మనకు కావాల్సిన ఫలం కాకపోవచ్చు.

**సంగం త్యక్త్వా** – కర్మఫలం ఆశించకుండా. దేవుడు అన్యాయం చేయడు అని అర్థం చేసుకుంటే, భవిష్యత్తు గురించిన ఆందోళన ఉండదు. ప్రతిగృహస్థుకూ ఉండే పెద్ద సమస్య అదే – ఆందోళన. నాకేమయినా ఫర్వాలేదు కాని నా మనవడికి ఏమీ కాకూడదు.

**లోకా సమస్తా మత్పౌత్రశ్చ సుఖినో భవంతు**

ప్రపంచం మొత్తంలో, నా మనవడు సుఖంగా ఉండాలి. మనవడు సమస్త లోకంలో లేడా? కర్మయోగం అంటే ఈ మనవడి గురించిన ప్రత్యేక బెంగ ఉండదు. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.

కర్మయోగి భవిష్యత్తు గురించిన ప్రణాళికలను వేస్తాడు. కాని ఫలం ఏదొచ్చినా ఆందోళన చెందడు. అందువల్ల అర్జునా నీ కర్మలను ఈశ్వరునికి అర్పించి, ఫలం గురించి ఆశించకు. దానివల్ల కలిగే ఫలం ఏమిటి?

**స పాపేన న లిప్యతే** – ఏ పాపమూ అతన్ని అంటదు. చిత్తశుద్ధికోసం ప్రార్థన చేస్తే, ఆ కర్మ సరిగ్గా చేయకపోయినా ఏ పాపమూ అంటదు. కాని అదే కామ్యకర్మగా చేస్తే ఆ పూజ సరిగ్గా చేయకపోతే అనుకున్న ఫలం రాకపోగా, ఒక్కోసారి బెడిసికొట్టవచ్చు కూడా. కాని కర్మయోగికి ఆ పాపభయం ఉండదు. అందువల్ల అతని జీవితం ఎలా ఉంటుంది?

**పద్మపత్రమ్ అంభసా ఇవ** – తామరాకుమీద నీటిబొట్టులా ఉంటుంది. గృహస్థాశ్రమంలో ఉంటూ కూడా, చెక్కుచెదరని చిరునవ్వుతో ఉంటాడు.

శ్లో. 11 **కాయేన మనసా బుద్ధ్యా కేవలైరింద్రియైరపి ।**
**యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వాత్మశుద్ధయే ॥**
కాయేన, మనసా, బుద్ధ్యా, కేవలైః, ఇంద్రియైః, అపి,
యోగినః, కర్మ, కుర్వంతి, సంగమ్, త్యక్త్వా, ఆత్మశుద్ధయే ॥

| | | | |
|---|---|---|---|
| యోగినః | = కర్మయోగులు | | |
| సంగమ్ | = మమతాసక్తులను | బుద్ధ్యా | = బుద్ధిచేత |
| త్యక్త్వా | = వీడి | కాయేన, అపి | = శరీరముచేత |
| కేవలైః | = కేవలము | ఆత్మశుద్ధయే | = చిత్తశుద్ధికోసమే |
| ఇంద్రియైః | = ఇంద్రియములచేత | కర్మ, కుర్వంతి | = కర్మలను ఆచరింతురు |
| మనసా | = మనస్సుచేత | | |

**యోగినః ఆత్మ–శుద్ధయే కాయేన, మనసా, బుద్ధ్యా, కేవలైః ఇంద్రియైః**
**అపి సంగం త్యక్త్వా కర్మ కుర్వన్తి ।**

తా: కర్మయోగులు మమతాసక్తిరహితులై కేవలం ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, శరీరాల ద్వారా అంతఃకరణ శుద్ధికై కర్మలను ఆచరింతురు.

కర్మయోగం ఏ స్థాయిలోనైనా చేయవచ్చంటాడు కృష్ణపరమాత్మ. అది కాయికం, వాచికం, మానసం ఏదైనా కావచ్చు. ఏది కుదిరితే అది చేయవచ్చు. అంతేకాదు –

**పత్రం పుష్పం ఫలం తోయమ్**

ఈ నాలుగూ కాదు, ఈ నాలుగింటిలో ఏదైనా ఇవ్వవచ్చు. కాని భక్తితో చేయాలి. ఎవరూ నేను చాలా బిజీగా ఉన్నాను, నేను కర్మయోగం చేయలేను అనలేరు. బిజీగా ఉన్నారు కాబట్టే కర్మయోగం చేయాలి. అది కూడా కాయికమో, వాచికమో, మానసికమో చేయవచ్చు. మనుష్యులకు ఉన్న పెద్దజబ్బు బద్ధకం. అందుకని ఎక్కడికో వెళ్ళి ఎందుకు పూజలు చేయాలి, ఈశ్వరుడు అంతటా ఉన్నాడు కదా అంటారు. పైగా పత్రం, పుష్పం, ఫలం, తోయం చాలన్నాడు అంటారు.

**కాయేన మనసా బుద్ధ్యా ఇంద్రియైరపి** – ఇంద్రియాల ద్వారా కాయిక, వాచిక, మానస కర్మలు చేస్తారు. బుద్ధ్యా అంటే వేదాంతవిచారణ చేస్తారు.

**యోగినః కర్మ కుర్వంతి** – కర్మయోగులు కర్మ చేస్తారు. ఈశ్వరునికోసం చేస్తారు.

**కేవలైః** – కేవలైః నాల్గింటికీ కలుపుకోవాలి. ఈ పదం చాలా ముఖ్యం. కేవలైః అంటే **అభిమాన వర్జితైః** అంటే అభిమానం చూపకుండా కర్మయోగులు కర్మ చేస్తారు. మామూలుగా మనం విజయం సాధిస్తే అంతా నా గొప్పతనం అనుకుని విర్రవీగుతాము; ఓటమి పొందితే దాన్ని ఇతరులమీదకు తోసేస్తాము. విజయం గర్వాన్ని కలిగిస్తే, ఓటమి నిరాశానిస్పృహలను కలిగిస్తుంది. అందువల్ల కేవలైః అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ విజయం భగవంతుని కృపవల్లే కలిగింది, ఎందుకంటే ఈ ఇంద్రియాలు, ఈ మనస్సు, ఈ బుద్ధి కూడా భగవంతుని కానుకే అనుకోవాలి.

**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః** – 3.30 విజయంలో కూడా అణకువగా ఉండాలి.

కర్మయోగి ఆందోళన లేకుండా ఉంటాడు. ఇప్పుడు ఎక్కడ చూసినా ఆందోళన రాజ్యమేలుతోంది. అది తగ్గించటానికి అనేకమంది అనేక మార్గాలు సూచిస్తున్నారు – ప్రాణాయామం, యోగా, ప్రకృతిదర్శనం వగైరా. ఇక్కడ సంధ్యావందనం చెయ్యమంటే చెయ్యలేరు, ఎక్కడికో వెళ్ళి 500 డాలర్లు ఖర్చుపెట్టి, ప్రశాంతంగా కూర్చుని ప్రాణాయామం నేర్పిస్తారంటే వెళతారు. **వైదికమార్గం పాటిస్తే సమస్యలే ఉండవు.**

**సంగం త్యక్త్వా** – భవిష్యత్తు గురించిన ఆందోళన ఉండదు.

**ఆత్మశుద్ధయే** – ఈ సాధనలన్నీ దేనికోసం? ఆత్మశుద్ధికోసం. ఇక్కడ ఆత్మ అంటే మనస్సు. అందువల్ల ఆత్మశుద్ధి అంటే చిత్తశుద్ధి లేదా మనశ్శుద్ధి. అంతేకాని నిజంగా ఆత్మశుద్ధి కాదు.

**సచ్చిదానంద ఆత్మ నిత్యశుద్ధ ఆత్మ.** ఆత్మ పదానికి అనేక సందర్భాలలో అనేక అర్థాలు వస్తాయి. అందువల్లనే శాస్త్రాన్ని గురువు ద్వారానే నేర్చుకోవాలంటారు.

మీమాంస శాస్త్రం ద్వారా ఏ పదానికి ఏ సందర్భంలో ఏ అర్థమొస్తుందో నిరూపిస్తారు. అలాగే యోగినః పదం కూడా. ఇక్కడ యోగినః అంటే కర్మయోగినః, కాని ఆరవ అధ్యాయంలో యోగి అంటే ధ్యానయోగి. ఇక్కడ ఆత్మశుద్ధి అంటే చిత్తశుద్ధి అని ఎందుకు తీసుకోవాలి? కృష్ణపరమాత్మ స్పష్టంగా చెప్పాడు. కర్మయోగం చిత్తశుద్ధిని ఇస్తుంది కాని జ్ఞానాన్ని ఇవ్వదు అని.

**చిత్తస్య శుద్ధయే కర్మ న తు వస్తూపలబ్ధయే** – వివేక చూడామణి. 11

కర్మవల్ల చిత్తశుద్ధి కలుగుతుంది కాని జ్ఞానం కలగదు.

శ్లో. 12 **యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతిమాప్నోతి నైష్ఠికీమ్ ।**
**అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ॥**
యుక్తః, కర్మఫలమ్, త్యక్త్వా, శాంతిమ్, ఆప్నోతి, నైష్ఠికీమ్,
అయుక్తః, కామకారేణ, ఫలే, సక్తః, నిబధ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| యుక్తః | = నిష్కామకర్మయోగి | అయుక్తః | = సకామపురుషుడు |
| కర్మఫలమ్ | = కర్మఫలము(ల)ను | కామకారేణ | = వాంఛల ప్రేరణలచే |
| త్యక్త్వా | = త్యజించి | ఫలే, సక్తః | = కర్మఫలాసక్తితో (కర్మలను ఆచరించి) |
| నైష్ఠికీమ్, శాంతిమ్ | = భగవత్ప్రాప్తిరూపమైన శాంతిని | | |
| ఆప్నోతి | = పొందును | నిబధ్యతే | = బద్ధుడగును |

**యుక్తః కర్మఫలం త్యక్త్వా నైష్ఠికీం శాన్తిమ్ ఆప్నోతి ।**
**అయుక్తః కామకారేణ ఫలే సక్తః నిబధ్యతే ॥**

తా: నిష్కామకర్మయోగి కర్మఫలములను త్యజించి, భగవత్ప్రాప్తిరూపమైన శాంతిని పొందును. కర్మఫలాసక్తుడైన సకామపురుషుడు, కర్మఫలాసక్తితో కర్మలనాచరించి బద్ధుడగును.

ఇది మరొక అద్భుతమైన శ్లోకం. చాలా ముఖ్యమైన శ్లోకం కూడా. కర్మయోగం శాంతినిస్తుంది, జ్ఞానయోగం కూడా శాంతినిస్తుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. కాని కర్మయోగం ఇచ్చే శాంతి సాపేక్షికశాంతి మాత్రమే. జ్ఞానయోగమే ఆత్యంతిక శాంతిని ఇస్తుంది.

కర్మయోగం ఫస్ట్ఎయిడ్ వంటిది; ఫస్ట్ఎయిడ్ అంటే ఏమిటి? అది పూర్తి చికిత్స కాదు, దాని తర్వాత సెకండ్ ఎయిడ్ అంటే ముఖ్యమైన చికిత్స ఉంది. అలాగే కర్మయోగం ఫస్ట్ఎయిడ్ చేస్తుంది. అంటే జ్ఞానయోగానికి రావటానికి అవసరమైన శాంతిని ఇస్తుంది; జ్ఞానయోగం అసలైన చికిత్స చేస్తుంది.

**యుక్తః శాంతిమాప్నోతి** – యుక్తః అంటే కర్మయోగి. కర్మయోగేన యుక్తః. గీతలో ఈ యుక్తః పదం కూడా అనేకసార్లు అనేక అర్థాలతో వస్తుంది. ఇక్కడ కర్మయోగి అని అర్థం. అతనికి ఏ ఫలం వస్తుంది? శాంతి పొందుతాడు. ఇప్పుడు అందరూ మనస్సుకు స్థిమితం లేదు అంటున్నారు. దానికి మందు కర్మయోగం.

కర్మయోగం శాంతిని కలుగజేస్తుంది. డబ్బు, ఇల్లు, వస్తువులు సుఖాలను ఇస్తాయి కాని శాంతిని ఇవ్వవు. శాంతిని కర్మయోగమే ఇవ్వగలదు. ఎలా ఇస్తుంది?

**నైష్ఠికీమ్** – కర్మయోగ నిష్ఠవల్ల పుట్టిన శాంతి. కర్మయోగానికి అంకితమవటంవల్ల. ఎలా అంకితమయ్యాడు?

**కర్మఫలం త్యక్త్వా** – కర్మఫలం గురించిన చింతను వదులుకోవటం ద్వారా. అంతకుముందు సంగం త్యక్త్వా అంటే ఇప్పుడు కర్మఫలం త్యక్త్వా అంటున్నాడు.

భవిష్యత్తు ప్రణాళిక వేయటంకోసం భవిష్యత్తు గురించి ఆలోచిస్తే అది లాభదాయకంగా ఉంటుంది. భవిష్యత్తులో రాబోయే ఆటంకాల గురించి తెలివిగా ఆలోచిస్తే, ఇప్పుడు వర్తమానంలో సమర్థవంతంగా ప్రణాళికలు వెయ్యగలను. అదే భవిష్యత్తు గురించి ఆందోళన చెందితే, నా సమర్థత దెబ్బ తింటుంది. అంటే భవిష్యత్తు నన్ను సమర్థవంతుణ్ణి చేయగలదు; నాలో ఆందోళన పెంచగలదు.

అలాగే గతం కూడా. గతంనుంచి నేను పాఠాలు నేర్చుకుంటే, నేను వర్తమానంలో సమర్థవంతంగా పనిచేయగలను. గతం గురించి వాపోతూ కూర్చుంటే, ఇప్పుడు నా సమర్థత దెబ్బ తింటుంది.

ఆ విధంగా భవిష్యత్తు, గతాలను ప్రణాళిక వేసుకోవటానికి ఉపయోగిస్తే, నా సమర్థత పెరుగుతుంది. వాటి గురించి చింతిస్తూ కూర్చుంటే, నా సమర్థత కుంటుపడుతుంది. కర్మయోగి అలా కాకుండా గతాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని, భవిష్యత్తు గురించిన భయాన్ని పారద్రోలుతాడు. అప్పుడు అతనికి భవిష్యత్తు బరువు కాదు.

**అయుక్తః** – దానికి భిన్నంగా కర్మయోగి కాని అతని పరిస్థితి ఏమిటి? అతను భూతకాలం చూసి కృంగిపోతాడు. ఒక ఓటమి రాగానే, తన జీవితం ఓటములపాలు అవుతుంది అనుకుంటాడు. నిరాశలో కృంగిపోయి, అంతా విధి ఆడుతున్న వింత నాటకమని అంతా విధిమీదకు తోసేస్తాడు. భవిష్యత్తులో ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతాడు.

**ఫలే సక్తః** – ఎంతసేపూ ఫలం గురించి బెంగపడతాడు. జీవితం అంటేనే ప్రమాదాలతో కూడినది అనుకోడు. ఈ రోజుల్లో రోడ్డు దాటటమే ఒక పెద్ద యమగండం. అందువల్ల పొంచివున్న ప్రమాదాల గురించి ఆలోచిస్తూ కూర్చుంటే ముందుకు సాగలేడు. ఆ ప్రమాదాలనుంచి భద్రత కావాలంటే భగవంతుణ్ణి శరణు వేడటం ఒక్కటే మార్గం.

> **అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
> **తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥** – 9.22

అసలైన జీవనసురక్ష ఎల్.ఐ.సీ. పాలసీ కాదు, భగవంతుడు. ఎల్.ఐ.సీ.లు తీసుకోకూడదని కాదు దాని అర్థం, భగవంతుణ్ణి శరణు వేడమని. భగవంతుణ్ణి శరణు వేడితే, పెద్ద నిశ్చింత కలుగుతుంది.

**కామకారేణ** – కర్మయోగి కాని వ్యక్తి తన కోరికల బలంవల్ల, ఫలంమీద ఆశ కొద్దీ,

**నిబధ్యతే** – కర్మలు ఆచరించి బద్ధుడవుతాడు. సంసారంలో కూరుకుపోతాడు. అందువల్ల అర్జునా! కర్మఠుడు అవకు, కర్మయోగి అవు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 13 **సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।**
**నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్ న కారయన్ ॥**
సర్వకర్మాణి, మనసా, సన్న్యస్య, ఆస్తే, సుఖమ్, వశీ,
నవద్వారే, పురే, దేహీ, న, ఏవ, కుర్వన్, న, కారయన్ ॥

| | | | |
|---|---|---|---|
| వశీ, దేహీ | = అంతఃకరణమును వశము నందుంచుకొని, సాంఖ్య యోగమును ఆచరించు పురుషుడు | సర్వకర్మాణి | = సమస్త కర్మలను |
| | | మనసా | = మానసికముగా |
| | | సన్న్యస్య | = త్యజించి |
| న, కుర్వన్ | = కర్మలను ఆచరింపక | సుఖమ్ | = సుఖముగా |
| న, కారయన్, ఏవ | = ఆచరింప జేయకయే | ఆస్తే | = పరమాత్మస్వరూపమున స్థితుడై యుండును |
| నవద్వారే, పురే | = నవద్వారములుగల శరీరమను పురమందు | | |

**వశీ దేహీ సర్వ–కర్మాణి మనసా సంన్యస్య, నవ–ద్వారే పురే,**
**న ఏవ కుర్వన్, న కారయన్ సుఖమ్ ఆస్తే ।**

తా: అంతఃకరణమును వశమునందుంచుకొని, సాంఖ్యయోగమును ఆచరించు పురుషుడు కర్మలను ఆచరింపకయే, ఆచరింపజేయకయే, నవద్వారములుగల శరీరమందు సమస్త కర్మలను మానసికంగా త్యజించి, పరమాత్మ స్వరూపమున స్థితుడై, ఆనందమును అనుభవించును.

శ్లోకాలు 7–12 వరకూ కర్మయోగంయొక్క ప్రాముఖ్యతను నొక్కి వక్కాణిస్తూ, దాన్ని పాటించటానికి కావాల్సిన అనేక సాధనలు చెప్పుకొచ్చాడు కృష్ణపరమాత్మ.

**బి) జ్ఞానయోగసాధన –** శ్లోకాలు 13–21 కృష్ణపరమాత్మ ఈ శ్లోకాల్లో జ్ఞానయోగం గురించి చెప్పబోతున్నాడు. చాలామందికి జ్ఞానయోగం గురించి తెలియనే తెలియదు. జ్ఞానయోగం పాటించితీరాలని అసలే తెలియదు. నేను గొప్ప భక్తుణ్ణి, పూజలు క్రమం తప్పకుండా చేస్తాను; విలువలకు విలువనిస్తాను; ఉన్నతమైన జీవనం గడుపుతాను; దానితో మోక్షం రాదా? శాస్త్రం చదవటం ఎందుకు అంటారు చాలామంది.

కృష్ణపరమాత్మ మీరు చేసేవన్నీ ముఖ్యమే కాని దానితో జ్ఞానం రాదు అంటాడు. **జ్ఞానయోగానికి ఎప్పుడు వస్తారన్నది మీ ఇష్టం, కాని జ్ఞానయోగానికి వచ్చి తీరాలి.** ఇప్పుడు వస్తారా, రిటైరయ్యాక వస్తారా, వచ్చేజన్మలో వస్తారా మీ ఇష్టం. కాని జ్ఞానం పొందందే మోక్షం రాదు. ఐదవ అధ్యాయం సారాంశం ఆత్మజ్ఞానం. కర్మయోగం గురించి ముందు చెప్పినా, ఇది ప్రాథమికంగా జ్ఞానయోగం గురించి చెబుతుంది. జ్ఞానయోగం అంటే ఏమిటి?

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** – 4.34

జ్ఞానయోగమంటే సమర్థవంతమైన గురువు వద్ద, ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాలపాటు వేదాంతశ్రవణం చేయటం. కర్మకాండ ధర్మం గురించి చెబుతుంది. కర్మకాండ చిత్తశుద్ధిని కలుగజేస్తుంది, కాని ఆత్మజ్ఞానం ఇవ్వదు. వేదాంతశాస్త్రమే ఆత్మజ్ఞానం బోధిస్తుంది.

నేనెవరు? జగత్తు అంటే ఏమిటి? పరమాత్మ ఎవరు? నాకు–జగత్తుకు ఉన్న అనుబంధం ఏమిటి? నాకు–పరమాత్మకు ఉన్న అనుబంధం ఏమిటి? జగత్తుకు–పరమాత్మకు ఉన్న అనుబంధం ఏమిటి? నేను ఎందుకు పుట్టాను? ఈ ప్రశ్నలన్నిటికీ వేదాంతశాస్త్రంలో జవాబు వస్తుంది. వేదాంతం ప్రాథమికంగా ఆరు అంశాలను చర్చిస్తుంది. అవి – జీవుడు, జగత్తు, ఈశ్వరుడు, బంధం, ముక్తి, సాధనలు. వీటిని ముందు చెప్పినట్టుగా ఒక క్రమపద్ధతిలో, కొంతకాలం పాటు ఒక గురువు వద్ద నేర్చుకోవాలి. ఇలా నేర్చుకుంటే ఏం జ్ఞానం పొందుతాడో దానికి జవాబు రెండవ అధ్యాయంలో చూశాము– నేను శరీరం కాదు; నేను మనస్సు కాదు; నేను మనశ్శరీరాల ద్వారా వ్యవహారం నడుపుతున్న ఆత్మను. నా శరీరం మరణించినా, నాకు మరణం లేదు; కాకపోతే నేను శరీరం లేకుండా వ్యవహారం నడపలేను కాబట్టి నేను నడిపే వ్యవహారం ఆగిపోతుంది.

ప్రతిరాత్రీ సుషుప్తిలో ఈ విషయం అనుభవిస్తూనే ఉంటాను. శరీరం, మనస్సు పని చేయకపోయినా, నేను నిద్రలో మరణించను. అలా ఒకవేళ నిద్రలో మరణించేటట్టయితే, కళ్ళలో కారం కొట్టుకునయినా లేచే వుంటాను. కాని నిద్ర నా మరణం కాదని తెలుసు కాబట్టే నిశ్చింతగా ఎక్కడన్నా నిద్రపోతాను. నేను శుద్ధ చైతన్యాన్ని (ఆత్మను). నేను అకర్తా, అభోక్తాను. కాంతి చేతిమీద పడినప్పుడు, కాంతి కదిలినట్టు కనిపించినా, నిజానికి కాంతి సర్వవ్యాపకం. దానికి కదలిక లేదు. అందువల్ల జ్ఞానయోగి ఏం చేస్తాడు?

అతను అకర్తా ఆత్మ అని గ్రహిస్తాడు. జ్ఞాని దృక్పథంలో మార్పు వస్తుంది. అన్ని కర్మలూ మనస్సు, శరీరం చేస్తాయి కాని నేను చేయనని తెలుసుకుంటాడు. అంటే జ్ఞాని అన్ని కర్మలనూ పరిత్యజిస్తాడు. ఇది వివరంగా రెండవ అధ్యాయంలోనూ, మూడవ అధ్యాయంలోనూ చూశాము.

అవి మళ్ళీ ఒకసారి క్లుప్తంగా చూద్దాము.

1. మనలో రెండు అంశాలు ఉన్నాయి. అవి ఆత్మ, అనాత్మ. అనాత్మను అహంకారమనీ, చిదాభాససహిత కార్యకరణసంఘాతమనీ అంటారు. ఇది కర్తా, భోక్తా. దీనికి సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలున్నాయి. ఈ అహంకారమే లోకాలకు ప్రయాణిస్తుంది.

2. రెండవ అంశం ఆత్మ లేదా చైతన్యం లేదా సాక్షి చైతన్యం లేదా చిత్. చైతన్యం లక్షణాలు ఏమిటి?
   - కాంతి చెయ్యి అంతటా ఉన్నా చేతికి భిన్నంగా ఉన్నట్టుగా, చైతన్యం శరీరమంతటా ఉన్నా శరీరానికి భిన్నంగా ఉంది.
   - కాంతి ఏకం, వస్తువులు అనేకం అయినట్టుగా; చైతన్యం **ఏకం**, శరీరాలు అనేకం.

- కాంతి సర్వగతం, చైతన్యం **సర్వగతం**.
- చేయి లేకపోయినా కాంతి ఉన్నట్టుగా, శరీరం లేకపోయినా చైతన్యం ఉంటుంది. అందువల్ల చైతన్యం **నిత్యం**.
- చెయ్యి కదిలినా కాంతి కదలనట్టుగా, శరీరం షడ్వికారాలకు లోనయినా, చైతన్యానికి మార్పు లేదు. చైతన్యం **నిర్వికారం**.
- చేయి ఏ పనిచేసినా కాంతి ఏ పనీ చేయనట్టుగా, శరీరం ఏ పని చేసినా చైతన్యం మంచి కర్మలూ, చెడు కర్మలూ ఏవీ చేయదు. శరీరం కర్తా, భోక్తా అయినా చైతన్యం **అకర్తా అభోక్తా**. అందువల్ల పుణ్యపాపాలు కూడా అంటవు. చైతన్యం అకర్తా అయితే కర్మఫలం అనుభవించే భోక్తా కూడా అవదు.

**యః కర్తా భవతి సః భోక్తా భవతి; యః కర్మణాం కర్తా భవతి సః కర్మఫలానాం భోక్తా భవతి.**

కర్త, భోక్త అవుతాడు. జ్ఞాని ఎప్పుడైతే తను ఆత్మనని అర్థం చేసుకుంటాడో, అప్పుడు అతనికి అహంకారం చిన్న విషయంగా, ప్రాముఖ్యత లేని విషయంగా తోస్తుంది. అంతకుముందు అహంకారంతో మమేకం చెందినప్పుడు, కర్తగా అనేక పనులు చేపట్టి, వాటిగురించి ఆందోళన చెందటం చేసేవాడు. కాని జ్ఞానం పొందాక ఆ ఆందోళన తేలిపోతుంది.

నేలమీద నిల్చుని కొబ్బరిచెట్టును చూస్తే, అది చాలా పెద్దదిగా అనిపిస్తుంది. కాని అదే చెట్టును, ఎత్తైన కొండమీంచి చూస్తే, చాలా చిన్నదిగా అనిపిస్తుంది. జీవితసమస్యలు కూడా అంతే. అహంకారపరంగా చూస్తే, అవి చాలా పెద్ద సమస్యలు, కాని ఆత్మపరంగా చూస్తే చాలా చిన్న సమస్యలు. జ్ఞాని తన అహంకారానికి ఉన్న సమస్యలను తప్పించుకోలేడు. కాని చూసే దృక్పథం మార్చాడంతే. అప్పుడు భరించలేనంత పెద్దవిగా కనిపించిన సమస్యలే, ఇప్పుడు సూదితో గుచ్చితే కలిగేటంత నొప్పిని కూడా కలిగించటం లేదు.

నేను శరీరం అనుకుంటే నా శరీరం గురించి బెంగ; నేను ఆత్మను అని అర్థం చేసుకుంటే అనేక వేల శరీరాల్లో ఇదొకటి. భూమ్మీదనుంచి ఒక మట్టిరేణువు మాయమయినట్టుగా, నా శరీరం మాయమవుతుంది. అందువల్ల కర్మ, పుణ్యపాపాలు అన్నీ వాటి ప్రాముఖ్యతను కోల్పోతాయి. కలలో ఉన్నంతసేపు ఎంతో భయపెట్టిన కల, నిద్రలేచాక తేలిపోతుంది.

జ్ఞానికీ, అజ్ఞానికీ మధ్యనున్న భేదమేమిటి? జ్ఞాని నేను ఆత్మను అంటాడు; అజ్ఞాని నేను అహంకారాన్ని అంటాడు. గీతలో జ్ఞాని గురించి చెప్పిన వర్ణన అంతా ఆత్మకు వర్తిస్తుంది; అజ్ఞాని గురించిన చెప్పిన వర్ణన అంతా అహంకారానికి వర్తిస్తుంది. అందువల్ల మీరేమిటి అనేది, మీరు దేనితో మమేకం చెందుతారు అనే అంశంమీద ఆధారపడి వుంటుంది. అహంకారంతో మమేకం చెందితే మీరు సంసారి; ఆత్మతో మమేకం చెందితే మీరు అసంసారి.

ఈ శ్లోకంలో జ్ఞాని ఆత్మతో మమేకం చెందుతాడని కృష్ణపరమాత్మ చెబుతున్నాడు. ఈ శ్లోకం చాలా ముఖ్యమైన శ్లోకం. శంకరులవారు దీన్ని తరచు ఉటంకిస్తుంటారు – జ్ఞాని ఆత్మతో మమేకం చెందుతాడు కాబట్టి

**నేను శరీరం అనడు, నేను శరీరంలో ఉన్నాను అంటాడు**. నేను శరీరంలో ఉండి, ఈ శరీరాన్ని చైతన్యవంతం చేస్తున్నాను అంటాడు. ఇప్పుడు శ్లోకాన్ని చూద్దాము.

**సర్వకర్మాణి మనసా సన్న్యస్య** – అన్ని కర్మలనూ జ్ఞాని పరిత్యజిస్తాడు. గుర్తుంచుకోండి – జ్ఞాని కర్మలను పరిత్యజించడు; నేను కర్మలు చేస్తున్నాను అనే భావనను పరిత్యజిస్తాడు. కర్మలమీద, అవి చేసే శరీరంమీద ఉండే అభిమానాన్ని పరిత్యజిస్తాడు. దీన్ని **దేహ అభిమానత్యాగం** అంటారు. ఎలా పరిత్యజిస్తాడు?

మనసా – ఇక్కడ మనసా అంటే జ్ఞానేన. జ్ఞానంవల్ల. ఏమిటా జ్ఞానం? నేను శరీరాన్ని కాదు, నేను ఆత్మను.

**వశీ (సర్వకర్మాణి సన్న్యస్య)** – వశీ అంటే జ్ఞాని. అతను స్వామి అవుతాడు. నేను శరీరంగా పరిస్థితులకు బానిసను. నేను ఆత్మగా, పరిస్థితులు నాకు బానిస. స్వప్నప్రపంచంలో ఉండగా, నేను అందులో ఒక వ్యక్తిని. కాని ఆ స్వప్నంనుంచి లేచాక, నేను ఆ స్వప్నానికి సృష్టికర్తను. 'నేను' ఎవరో మారితే, చాలా పెద్ద తేడా వస్తుంది.

**సుఖమ్ ఆస్తే** – జ్ఞాని జీవితాన్ని సుఖంగా గడుపుతాడు. త్ర్యంబకం యజామహే మంత్రం అందరికీ తెలిసిందే. ఇది ఎవరికైనా బాగుండనప్పుడు, మృత్యువును జయించటానికి పఠిస్తారు. నిజానికి ఆ మంత్రం అసలు అర్థం మృత్యువును జయించటం కాదు, మృత్యువును జయించలేము కూడా. మరి ఎలా జయిస్తారు? నేను జననమరణాలు లేని ఆత్మను, నేను మృత్యువు కోరల్లో చిక్కే శరీరాన్ని కాను, శరీరానికి మరణం తప్పదని నేర్చుకోవటమే ఈ మంత్రం ఉద్దేశ్యం. ఎప్పుడైతే ఈ విషయం నేర్చుకుంటామో, అప్పుడే మృత్యుభయం పోతుంది. మనస్సు తేలిక అవుతుంది.

మనస్సు భయాలతో కృంగిపోతున్నప్పుడు భారంగా ఉంటుంది. ఎక్కడికెళ్ళినా మనస్సు వస్తుంది. మానస సరోవరానికి వెళ్ళినా వస్తుంది. మనస్సును అదుపులో పెట్టుకోవటానికి అనేక చెడుమార్గాలు పాటిస్తారు. మందు తాగటం ఒకటి. కాని ఆత్మజ్ఞానం పొందితే ఈ భారం తొలుగుతుంది. తక్కినవారు వృద్ధాప్యంలో తనను ఎవరు చూసుకుంటారు అనే బెంగతో కృంగిపోతారు. కాని జ్ఞానికి ఏ బెంగా ఉండదు. ఎందుకంటే ఆత్మకు ఈ సమస్యలు ఉండవు. అందువల్ల అతను సుఖంగా ఉంటాడు.

**నవద్వారే పురే** – జ్ఞాని ఎక్కడ ఉన్నాడు? తొమ్మిది ద్వారాలున్న పురంలో పురస్వామిగా ఉన్నాడు. పురం అంటే స్థూలశరీరం. స్థూలశరీరాన్ని ఒక చిన్నరాజ్యంతో పోల్చాడు. బాహ్యంగా ఉన్న చర్మం–కోటగోడలు. చుట్టూ గోడలుంటే బాహ్యప్రపంచంతో ఎలా వ్యవహారం జరుపుతాము? దానికి ద్వారాలు ఉండాలి. మన శరీరానికి నవద్వారాలు ఉన్నాయి. అందులో ఏడు శిరస్సులోనూ, రెండు కిందా ఉన్నాయి.

రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు ముక్కు రంధ్రాలు, ఒక నోరు – ఇవి శిరస్సులో ఉన్న ఏడు రంధ్రాలు. వీటి ద్వారా జగత్తులోని శబ్దస్పర్శరూపరసగంధాలను (అదే వరుసలో లేవు) తెలుసుకుంటాము. కింద రెండు ద్వారాలున్నాయి అన్నాము కదా అవి బయటకు వెళ్ళే గేట్లు. అవి విసర్జన గేట్లు. వన్‌వే ట్రాఫిక్

గేట్లు అవి. కాని టూవే ట్రాఫిక్ గేటు కూడా ఉంది. అది నోరు. మనం మాట్లాడుతున్నప్పుడు లోపలినుంచి భావాలు బయటకు వస్తాయి. ఆహారం తీసుకుంటున్నప్పుడు అదే నోరు లోపలికి ఆహారాన్ని పంపిస్తుంది.

**పురమేకాదశద్వారమజస్యావక్రచేతసః** – కఠ 2.2.1

కఠోపనిషత్తులో పదకొండు ద్వారాలున్నాయని యమధర్మరాజు చెబుతాడు. కాని కృష్ణపరమాత్మ అందులోంచి తొమ్మిదే తీసుకున్నాడు. ఎందుకు? తక్కిన రెండూ వీటిలాగా నిత్యం పనిచేయవు. అవి నాభి, బ్రహ్మరంధ్రం. పుట్టినప్పుడు నాభి గురించి వస్తుంది. ఉపాసకుడు మరణించినప్పుడు అతని ప్రాణం బ్రహ్మరంధ్రం చీల్చుకుని వెళుతుంది. పురం ఉంటే పురవీధులు ఉండాలి కదా! మన రక్తనాళాలు పురవీధులు. పంచప్రాణాలు అందులో పని చేసేవారు. ఈ పురరాజు ఆత్మ. జ్ఞాని ఆత్మతో మమేకం చెందుతాడు కాబట్టి జ్ఞానిని తన శరీరానికి యజమాని అంటాము. అందువల్ల దేహీ అంటే ఆత్మ, నవద్వారే పురే – నవద్వారాలున్న శరీరమనే పురంలో ఉంది. ఏ పని చేస్తుంది?

**నైవ కుర్వన్** – ఆత్మ అకర్తా. ఏ పనీ చేయదు. కాంతి సమక్షంలో అన్ని పనులూ అవుతాయి. ఒక ప్రసంగం ఉంటే కుర్చీలు అమర్చి, కార్పెట్ పరచి, మైకుని సిద్ధం చేస్తారు. మనుష్యులు వచ్చి కూర్చుంటారు. కాంతి ఏ పనీ చేయదు. కాంతి సమక్షంలో పనులన్నీ అవుతాయి. దీన్నే సాక్షీభూతంగా చూడటం అంటారు. కాంతి ఏ పనీ చేయదు కాబట్టి మంచిపనుల మంచి ఫలితమూ రాదు; చెడు పనుల చెడు ఫలితమూ రాదు. ఒకే కాంతి సమక్షంలో ఒక వైద్యుడు ఆపరేషన్ చేయవచ్చు; ఒక దొంగ దొంగతనం చేయవచ్చు. కాని కాంతికి ఆపరేషన్ చేసిన పుణ్యమూ అంటదు, దొంగతనం చేసిన పాపమూ అంటదు. ఈ పనులు కాంతి సమక్షంలో అవుతాయి. కాని కాంతి పని చేయదు. **అకర్తృత్వే సతి ప్రకాశత్వం సాక్షిత్వమ్.** అందువల్ల పని చేయకుండా, ప్రకాశింప జేయటాన్ని సాక్షీభావం అంటారు, జ్ఞాని సాక్షిగా మిగులుతాడు.

**న కారయన్** – తను పని చేయదు. ఎవరిచేతా కూడా చేయించదు. ఏదైనా పని చేయాలంటే, అందులో రెండు రకాలుంటాయి. కొన్ని ప్రత్యక్షంగా చేస్తాము. కొన్ని పరోక్షంగా చేస్తాము. పరోక్షంగా చేయటమంటే మనం చేయకుండా, ఇంకొకరిచేత చేయించటం. ప్రత్యక్షంగా చేసేవారిని **కర్తా** అనీ, పరోక్షంగా చేయించేవారిని **కారయితా** అనీ అంటారు. అందుకే చూడండి – హత్య కేసుల్లో, హత్య చేసినవ్యక్తే కాకుండా, హత్య చేయించిన వ్యక్తి కూడా నేరస్థుని క్రిందకే వస్తాడు.

ఆత్మను సరిగ్గా అర్థం చేసుకోక కొందరు ఏదైనా నేరం చేసినా కూడా నేను చేయలేదు; ఆత్మ లేదా భగవంతుడు చేయించాడు, నేను భగవంతుని చేతిలో కీలుబొమ్మను మాత్రమే అని కప్పదాటు వ్యవహారం చూపిస్తారు. నేను నేరం చేయలేదు, నా ద్వారా భగవంతుడు చేయించాడు అంటే ఎవరికి పాపం వస్తుంది? పరికరానికా, దాన్ని వాడిన వ్యక్తికా? ఇప్పుడు ఒక వ్యక్తి ఎవరినో కత్తితో చంపితే శిక్ష ఎవరికి వేస్తారు? కత్తికా? దాన్ని వాడిన వ్యక్తికా? దాన్ని వాడిన వ్యక్తికి వేస్తారు. అలా భగవంతుడు నన్ను పరికరంగా వాడుకున్నాడు అంటే శిక్ష ఆత్మకు లేదా భగవంతునికి పడాలి అంటారు వారు.

అందువల్ల కృష్ణపరమాత్మ స్పష్టంగా చెబుతున్నాడు – భగవంతుణ్ని నిందించవద్దు; ఆత్మను కూడా నిందించవద్దు. ఆత్మ ఎవరినీ ఏ పనీ చేయమని ప్రేరేపించదు. ఆత్మ నేరస్థుణ్ణి నేరం చెయ్యమనీ కోరదు; సాధువును ఉన్నతమైన పనిని చేయమనీ కోరదు. కాంతిలాగా ఆత్మ కూడా సాక్షీభూతంగా చూస్తుంది అంతే! కాంతి సమక్షంలో మంచిపనులూ జరుగుతాయి, చెడు పనులూ జరుగుతాయి. కాని **ఆత్మ అన్యత్ర ధర్మాత్ అన్యత్ర అధర్మాత్**. ఆత్మ ధర్మాధర్మాలకు అతీతం. పుణ్యపాపాలకు అతీతం. అందువల్ల ఆత్మ కర్తా కాదు, కారయితా కూడా కాదు.

శ్లో. 14 **న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।**
**న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥**
న, కర్తృత్వమ్, న, కర్మాణి, లోకస్య, సృజతి, ప్రభుః,
న, కర్మఫలసంయోగమ్, స్వభావః, తు, ప్రవర్తతే ॥

| | | | |
|---|---|---|---|
| ప్రభుః | = పరమేశ్వరుడు (ఆత్మ) | న (సృజతి) | = సృజింపడు |
| లోకస్య, కర్తృత్వమ్ | = మానవుల కర్తృత్వమును | తు | = అయితే |
| న, సృజతి | = సృజింపడు(దు) | స్వభావః | = (వీటన్నిటియందు) ప్రకృతియే |
| కర్మాణి | = (వారి) కర్మలను | ప్రవర్తతే | = ప్రవర్తిల్లును |
| న (సృజతి) | = సృజింపడు | | |
| కర్మఫలసంయోగమ్ | = కర్మఫల సంయోగమును | | |

**ప్రభుః లోకస్య కర్తృత్వం న సృజతి, కర్మాణి న (సృజతి) ।**
**కర్మఫలసంయోగం న (సృజతి) స్వభావః తు ప్రవర్తతే ॥**

తా: పరమేశ్వరుడు(ఆత్మ) మానవులయొక్క కర్తృత్వమును గాని, వారి కర్మలను గాని, కర్మఫలసంయోగమును గాని సృజింపడు(దు). వీటన్నిటియందు ప్రకృతియే ప్రవర్తిల్లును. అంటే గుణాలే గుణములందు ప్రవర్తిల్లుచుండును.

**ప్రభుః న సృజతి** – ఆత్మ ఏమీ చేయదు. ప్రభుః అంటే యజమాని, ఆత్మ. న సృజతి అంటే ఏమీ సృష్టించదు. ఏమిటవి?

**కర్తృత్వం** – కర్తృత్వాన్ని సృష్టించదు. శరీరానికి, మనస్సుకు అంటే అహంకారానికి స్వతహాగా కర్తృత్వభావన ఉంటుంది. దానికి ఆత్మ కారణం కాదు. ఎందుకు? రెండవపాదంలో కృష్ణపరమాత్మ చెబుతాడు, అప్పుడు చూద్దాము.

**కర్మాణి న (సృజతి)** – ఆత్మ కర్మలను కూడా సృష్టించదు.

**న కర్మఫలసంయోగం** – ఆత్మ కర్మఫలం కూడా సృష్టించదు. ఆత్మ కర్తను సృష్టించదు; కర్మను సృష్టించదు; కర్తకూ, కర్మఫలానికి మధ్య సంయోగాన్ని కూడా సృష్టించదు. ఒక్కముక్కలో చెప్పాలంటే – ఆత్మ ఏ పనీ చేయదు. ఆత్మ ఏ పనీ చేయకపోతే ఈ కర్మలన్నీ ఎవరు చేస్తున్నారు? ఎవరు వీటికి బాధ్యులు?

**స్వభావస్తు ప్రవర్తతే** – అది శరీరంయొక్క స్వభావం; మనస్సుయొక్క స్వభావం. వాటి స్వభావరీత్యా అవి పనిచేస్తున్నాయి. విద్యుచ్ఛక్తి సమక్షంలో అన్ని వస్తువులూ పనిచేస్తాయి. ఫ్యానుకు స్వభావరీత్యా తిరిగేగుణం ఉంది, విద్యుచ్ఛక్తి దాన్ని తిరగమని చెప్పదు; రేడియోకు, టెలివిజన్లకు వాటివాటి స్వతఃసిద్ధమైన పనులు ఉంటాయి. వాటి ప్రకారం అవి పనులు చేసుకుపోతాయి.

అలాగే మనస్సు తన పనులు తాను చేసుకుపోతుంది; శరీరం తన పనులు తాను చేసుకుపోతుంది; ఇంద్రియాలు వాటి పనులు అవి చేసుకుపోతాయి; ఆత్మ అన్నింటినీ సాక్షీభూతంగా చూస్తూ ఉంటుంది అంతే! కాంతి సాధువు చేసిన మంచి పనికీ బాధ్యత వహించదు; నేరస్థుడు చేసిన చెడ్డపనికీ బాధ్యత వహించదు అని చూశాము కదా! అందువల్ల కాంతిని నిందించకూడదు; అలాగని కాంతి అవసరం లేదనీ చెప్పకూడదు. ఎందుకంటే కాంతి సమక్షంలోనే ఆయా వ్యక్తులు వారి స్వభావానికి తగ్గట్టుగా పనులు చేయగలుగుతున్నారు.

శ్లో. 15 **నాదత్తే కస్యచిత్పాపం న చైవ సుకృతం విభుః ।**
**అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః ॥**
న, ఆదత్తే, కస్యచిత్, పాపమ్, న, చ, ఏవ, సుకృతమ్, విభుః,
అజ్ఞానేన, ఆవృతమ్, జ్ఞానమ్, తేన, ముహ్యంతి, జంతవః ॥

| | | | |
|---|---|---|---|
| విభుః | = సర్వవ్యాపక భగవంతుడు(ఆత్మ) | అజ్ఞానేన | = అజ్ఞానముచేత |
| కస్యచిత్ | = ఏ ఒక్కనియొక్క | జ్ఞానమ్ | = జ్ఞానము |
| పాపమ్, న, ఆదత్తే | = పాపకర్మమును గ్రహింపడు | ఆవృతమ్ | = ఆవరింపబడును |
| చ | = ఇంకా | తేన | = ఆకారణముచేత |
| సుకృతమ్, ఏవ | = పుణ్యకర్మలను | జంతవః | = ప్రాణులు (మానవులు) |
| న, (ఆదత్తే) | = గ్రహింపడు (కాని) | ముహ్యంతి | = మోహితులగుచున్నారు |

**విభుః కస్యచిత్ పాపం న ఆదత్తే, (విభుః కస్యచిత్) సుకృతం న చ ఏవ (ఆదత్తే) ।**
**అజ్ఞానేన జ్ఞానమ్ ఆవృతమ్, తేన జన్తవః ముహ్యన్తి ॥**

తా: సర్వవ్యాపియైన భగవంతుడు(ఆత్మ) ప్రాణుల పుణ్యపాప కర్మలలో దేనికీ భాగస్వామి కాదు. అజ్ఞానముచే జ్ఞానము కప్పబడియుండుటవల్ల ప్రాణులు మోహితులగుచుందురు.

ముందు శ్లోకాల్లో ఆత్మ కర్తా కాదు, కారయితా కాదు అన్నాడు కృష్ణపరమాత్మ. ఈ శ్లోకంలో ఆత్మ భోక్తా కూడా కాదు అంటున్నాడు. దానికి ఏమీ పుణ్యపాపాలు అంటవు.

**న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖం, న మంత్రో న తీర్థం న వేదా న యజ్ఞః**
**అహం భోజనం నైవ భోజ్యం న భోక్తా, చిదానందరూపః శివోఽహం శివోఽహమ్**

పుణ్యం, పాపం, భోజనం, భోజ్యం, భోక్తా ఏదీ కాదంటే నేనెవరు?

**చిదానంద రూపః శివోఽహం శివోఽహమ్.**

**కస్యచిత్ పాపం న ఆదత్తే** – ఆత్మకు పాపం అంటదు. పాపం అంటదు సరే, పుణ్యం మాట ఏమిటి?

**న చ ఏవ సుకృతమ్** – ఆత్మకు పుణ్యం కూడా అంటదు.

**విభుః** – విభుః అంటే ఆత్మ. సర్వవ్యాపకమైన ఆత్మ.

**ఆత్మా అసంగ స్వరూపో ఆకాశవత్**

ఆకాశం వాన కురిస్తే తడవదు; ఆకాశం అగ్నిజ్వాల ఏర్పడితే కాలదు. అలాగే ఆకాశంలాగా సర్వవ్యాపకమైన ఆత్మ పాపంవల్ల అశుద్ధం అవదు; పుణ్యంవల్ల శుద్ధి పొందదు.

ఒక నేరస్థుడు ఒక పెద్ద నేరం చేసి పారిపోతే, పోలీసులు అతన్ని పట్టి బంధించి కోర్టుకు తీసుకువచ్చారుట. అతనికి శిక్ష విధించే ముందు, అతను ఈ శ్లోకాన్ని ఉటంకించాడుట. నేను ఏ కర్మనూ చేయను; నేను పుణ్యకర్మను కానీ పాపకర్మను కాని చేయను; నేను ఎవరినీ చంపలేదు; అందువల్ల నాకు శిక్ష వెయ్యకూడదు; నా సమక్షంలో నా శరీరం కర్మ చేసింది కాని నేను చేయలేదు కాబట్టి నన్ను శిక్షించకండి అన్నాడుట. దయ్యాలు వేదాలు వల్లించటం అంటే ఇదే.

అదృష్టం బాగుండి న్యాయాధికారి కూడా గీత చదివాడు. అందువల్ల ఆయన అన్నాడు కదా, 'నువ్వు చెప్పింది అక్షరాలా నిజం. నువ్వు ఆత్మవు; నువ్వు అకర్తా, అభోక్తావు; నువ్వేం నేరం చేయలేదు కాబట్టి నిన్ను శిక్షించను; నువ్వు సర్వవ్యాపకుడవు కాబట్టి నిన్ను కారాగారంలో కూడా పెట్టలేను. కాని నీ సమక్షంలో నీ శరీరం నేరం చేసింది కాబట్టి, నేను నీ శరీరాన్నే బంధిస్తున్నాను. అది నువ్వు స్వీకరించాలి.'

తప్పుపని చేసినప్పుడు నేను శరీరం కాదని చెప్పగలిగినప్పుడు; చేసిన తప్పుపనికి శరీరం శిక్ష అనుభవించాల్సి వచ్చినప్పుడు దాన్ని కూడా స్వీకరించగలగాలి. కాని మనమేం చేస్తాం? తప్పు చేసినప్పుడు నేను శరీరం కాదు అంటున్నాము; దానికి శిక్ష పడినప్పుడు నేను శరీరం అని బాధ పడుతున్నాము. అందువల్ల వస్తుంది సమస్య. శరీరంతో విడివడితే కర్తా, భోక్తాగా విడివడాలి. మమేకం చెందితే కర్తా, భోక్తాగా మమేకం చెందాలి. ఒకటి అవును, ఒకటి కాదు అంటే వస్తుంది సమస్య.

అందువల్ల శరీరస్థాయిలో కర్మ ఉంది; కర్మఫలం ఉంది; కర్మసూత్రాలున్నాయి. శరీరస్థాయిలో నేను ధార్మికంగా ప్రవర్తించాలి; ఆత్మస్థాయిలో నేను పుణ్యపాప అతీతస్వరూపాన్ని అని అర్థం చేసుకోవాలి. అందువల్ల ఆత్మ, అనాత్మలను కలిపేయకూడదు.

ఇక్కడ కృష్ణపరమాత్మ ఆత్మస్థాయిలో మాట్లాడుతున్నాడు. నేను అకర్తనూ, అభోక్తను. నేను అకర్తా, అభోక్తా అయితే ఎందుకు అవస్థపడుతున్నాను? దేహ అభిమానంవల్ల; అహంకారంతో మమేకం చెందటంవల్ల.

**అహంకారవిమూఢాత్మా కర్తాఽహమితి మన్యతే ॥** – 3.27

దేహ అభిమానంవల్ల కర్తా, భోక్తా అనుకుంటున్నాను. దేహ అభిమానం ఎందుకు ఉంది? అజ్ఞానంవల్ల.

**అజ్ఞానేన ఆవృతం జ్ఞానమ్** – మన ఉన్నతమైన స్వరూపం గురించిన జ్ఞానం లేక మనం అవస్థలు పడుతున్నాము.

జ్ఞానం అంటే ఏమిటో సరిగ్గా అర్థం చేసుకోవాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ. జ్ఞానం అంటే ఆత్మజ్ఞానం. వేదాంతపరిభాషలో జ్ఞానం అంటే **జీవాత్మ పరమాత్మ ఐక్యజ్ఞానం**.

కర్మయోగం పాటించేముందు కూడా జ్ఞానం కావాలి. కర్మ గురించిన జ్ఞానం; ఈశ్వరార్పణబుద్ధిని గురించి జ్ఞానం కావాలి. అందువల్ల కర్మయోగం పాటించేముందు కూడా జ్ఞానం కావాలి కాని, ఆ జ్ఞానాన్ని ఆత్మజ్ఞానం అనరు. కర్మయోగంలో ఆత్మస్వరూపం గురించి మాట్లాడము; జీవాత్మ, పరమాత్మల ఐక్యం గురించి అసలే మాట్లాడము. అందువల్ల కర్మయోగం పాటిస్తే మోక్షం రాదు. కర్మయోగం గురించిన జ్ఞానం పొంది, కర్మయోగాన్ని పాటించి, చిత్తశుద్ధి పొంది, ఆత్మజ్ఞానం పొందాలి. ఆత్మజ్ఞానం పొందితే, మోక్షం పొందుతాము.

గీతలో జ్ఞానం గురించి మాట్లాడినప్పుడల్లా, అది ఒక్క జ్ఞానం గురించే అని అర్థం చేసుకోవాలి. అది అద్వైతజ్ఞానం; జీవాత్మ పరమాత్మ ఐక్యజ్ఞానం. తక్కిన జ్ఞానాలేవీ దీనిలోకి రావు. ఇది అహంకార వ్యతిరిక్త ఆత్మజ్ఞానం. అహంకారం నా చిన్నస్థాయికి చెందినది. ఆత్మ నా ఉన్నతస్థాయికి చెందినది. మనకున్న సమస్యలన్నీ క్రిందస్థాయికి చెందినవి. నా ఈ ఉన్నతస్థాయి గురించి తెలియకపోవటంవల్ల కలుగుతున్నాయి ఈ సమస్యలన్నీ.

కలలో ఒక వ్యక్తి చాలా అవస్థ పడుతున్నాడు. ఉన్న డబ్బంతా పోయింది; వీధుల్లో బికారిగా తిరుగుతున్నాడు; భోజనంకోసం అందరినీ అర్థిస్తున్నాడు; అందరూ చీదరించుకుంటున్నారు. ఈ అవస్థనుంచి అతను తప్పించుకోవాలంటే ఏం చేయాలి? ఆ కలనుంచి లేవాలి. నిజానికి అతను కడుపు నిండుగా భోజనం చేసి, చక్కగా ఏ.సీ. గదిలో పడుకున్నాడు. అది అతని అసలు స్వరూపం. కలలో పడ్డ అవస్థ, అతని క్రిందిస్థాయియొక్క అనుభవం. స్వప్నం ప్రాతిభాసిక సత్యం అయితే, జాగ్రత్ ప్రపంచం వ్యావహారిక సత్యం. ప్రాతిభాసిక సత్యం చాలా తక్కువసేపు ఉంటుంది. కలలో ఉన్నంతసేపూ అదే నిజమా అన్నట్టుగా ఉంటుంది. కాని కలనుంచి లేచాక ఆ నిజం కరిగిపోతుంది.

వేదాంతం జాగ్రత్ ప్రపంచం కూడా ఒక కలే అంటుంది. దాన్నించి మనం మన ఉన్నతస్థాయికి లేస్తే ఈ స్వప్నం కూడా కరిగిపోతుంది. అంటే వ్యావహారిక సత్యంనుంచి పారమార్థిక సత్యానికి ఎదిగితే, వ్యావహారిక సత్యం కూడా కలలా అనిపిస్తుంది.

**బ్రహ్మైవాహమిదం జగచ్చ సకలం చిన్మాత్రవిస్తారితం**
**సర్వం చైతదవిద్యయా త్రిగుణయాఽ శేషం మయాకల్పితం** – మనీషా పంచకమ్ 2

ఈ సర్వజగత్తునూ, ఈ చిన్న స్థూలశరీరాన్నీ సృష్టించిన ఆ పరబ్రహ్మను నేను; ఈ జగత్తును, ఈ శరీరాన్ని సృష్టించాక, నేను ఈ శరీరంలోకి అనుప్రవేశం చేసి, జీవితమనే నాటకం నడపటానికి వచ్చాను. నిజానికి

మనమందరం భగవంతుని అవతారాలమే! ప్రతి ఒక్క ఉపనిషత్తులోనూ వస్తుంది, భగవంతుడు సృష్టి చేశాక, అందులోకి అనుప్రవేశం చేశాడని.

కాని అనుప్రవేశం చేశాక, జీవితమనే నాటకాన్ని నడిపే బదులు, ఈ నాటకంలో లీనమై పోయాడు. ఎలాగైతే స్వప్నాన్ని సృష్టించి, అందులోకి అనుప్రవేశం చేసిన జాగ్రత్ పురుషుడు అది తను సృష్టించిన స్వప్నం అని మరిచిపోయి, అందులో అవస్థపడతాడో; అలాగే ఈ జాగ్రత్ ప్రపంచాన్ని సృష్టించి, అందులో అనుప్రవేశం చేసిన మనం (పరమాత్మ) ఇది మనం సృష్టించిన రెండవ స్వప్నం అని మరిచిపోయి, ఇందులో అవస్థలు పడుతున్నాము.

**ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్నిబోధత** – కఠ. 1.3.14

లే, నీ నిజ స్వరూపానికి మేలుకో అంటున్నాడు ఆచార్యుడు. పిల్లలు చూడండి, లేవమంటే లేచినట్టే లేచి అటుతిరిగి పడుకుంటారు. పిల్లలే ఎందుకు? కొందరు పెద్దలు కూడా లేచి, కూర్చుని, బెడ్‌కాఫీ తాగి, మళ్ళీ పడుకుని నిద్రపోతారు. అలాగే మనం ప్రతి వేదాంతక్లాసులోనూ ఆత్మ స్వరూపానికి లేస్తాము కాని క్లాసవగానే మళ్ళీ నిద్రపోతాము. అందువల్ల కృష్ణపరమాత్మ అజ్ఞానేన ఆవృతం జ్ఞానమ్ అంటున్నాడు. ఈ అజ్ఞానంవల్ల ఎలా ఉన్నాము?

**జంతవః ముహ్యంతి** – కృష్ణపరమాత్మ మనలను మనుష్యులు అని కూడా అనటం లేదు; జంతువులు అంటున్నాడు.

**పునః పునః జాయతే ఇతి జంతుః** – మళ్ళీ మళ్ళీ పుట్టేది జంతువు. ఎప్పుడైతే నేను శరీరంతో మమేకం చెందుతానో, అప్పుడే నాకు పునరపి జననం, పునరపి మరణం ఉంది. జ్ఞాని తను శరీరం కాదని అర్థం చేసుకుంటాడు కాబట్టి అతను జంతువు కాదు; చావు పుట్టుకలు లేవు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।**

**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥** – 2.20

నేను జంతువును కాను; నాకు చావు పుట్టుకలు లేవు; నేను అజః; నేను జన్మరహితబ్రహ్మను. కాని ఈ జ్ఞానం పొందక, మనం అజ్ఞానంవల్ల అనేక సమస్యల్లో కూరుకుపోతున్నాము. ఈ 15వ శ్లోకం చాలా ముఖ్యమైన శ్లోకం. ఎందుకంటే ఇందులో కృష్ణపరమాత్మ మన సంసారమనే రోగానికి కారణ నిర్ధారణ చేస్తున్నాడు. అజ్ఞానంవల్ల ఈ జంతువులు మోహంలో పడిపోతున్నాయి. శరీరంతో మమేకం చెందితే, దానివల్ల కలిగే ఫలితాలు అనేకం. అందులో కొన్ని –

1. **దేశ పరిమితి** – నేను పరిమితి చెందిన వ్యక్తిని అవుతాను. నాకు దేశపరంగా పరిమితి ఉందనుకోవటంవల్ల అనేక ఊర్లు తిరుగుతూ ఉంటాను.

2. **కాల పరిమితి** – ఎప్పుడైతే నేను శరీరం అనుకుంటానో, అప్పుడే దానికి కాలపరిమితి వస్తుంది. ఎప్పుడో అప్పుడు మరణించాల్సి ఉంటుంది. కాని దానికి మనం సిద్ధంగా ఉండము. ఒక వ్యక్తి తన వీలునామాలో నాకేదైనా రోగం వస్తే నాకు నయం చేయించనవసరం లేదని రాశాడు. కానీ తీరా నిజంగా రోగం వచ్చినప్పుడు,

ఎందుకైనా మంచిదని కుటుంబసభ్యులు డాక్టరు దగ్గరకు వెళదామా అంటే ఏమైనా చేసి నన్ను బ్రతికించండి అన్నాడు ఆ ఆశావాది; అలా ఉంటుంది. చివరి మనవడి ఉపనయనం చూశాక మరణించాలి అనుకుంటాము. ఒకవేళ ఆ కోరిక కూడా తీరితే, ఇంకో కోరిక పొంగుకు వస్తుంది. వీటన్నిటినీ **మోహం** అన్నాడు కృష్ణపరమాత్మ. **జంతవః ముహ్యంతి సంసారమ్ అనుభవంతి.**

ఈ శ్లోకంలో సమస్యకు కారణం తెలిసింది. మోహం కారణం. దానికి వైద్యం ఏమిటి? అది తరువాత వచ్చే శ్లోకంలో వస్తుంది. అది కూడా చాలా ముఖ్యమైన శ్లోకం.

శ్లో. 16 **జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః ।**
**తేషామాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥**
జ్ఞానేన, తు, తత్, అజ్ఞానమ్, యేషామ్, నాశితమ్, ఆత్మనః,
తేషామ్, ఆదిత్యవత్, జ్ఞానమ్, ప్రకాశయతి, తత్పరమ్ ॥

| | | | |
|---|---|---|---|
| తు | = అయితే | తేషామ్ | = వారికి |
| యేషామ్ | = ఎవరియొక్క | జ్ఞానమ్ | = ఆ జ్ఞానము |
| తత్, అజ్ఞానమ్ | = ఆ అజ్ఞానము | తత్పరమ్ | = పరమాత్మను |
| ఆత్మనః, జ్ఞానేన | = పరమాత్మ తత్త్వజ్ఞానముచేత | ఆదిత్యవత్ | = సూర్యునివలె |
| నాశితమ్ | = నశింపజేయబడునో | ప్రకాశయతి | = ప్రకాశింపజేయును |

**యేషాం తు తత్ ఆత్మనః అజ్ఞానం జ్ఞానేన నాశితమ్ ।**
**తేషామ్ జ్ఞానమ్ ఆదిత్యవత్ తత్ పరం ప్రకాశయతి ॥**

తా: కాని, వారి (ప్రాణుల) అజ్ఞానము పరమాత్మ తత్త్వజ్ఞానప్రాప్తి ద్వారా తొలగిపోవును. అప్పుడు ఆ జ్ఞానము వారికి పరమాత్మను సూర్యునివలె ప్రకాశింపజేయును.

ఇందులో సమస్యకు పరిష్కారం చూస్తాము. మన సంసారానికి మూలకారణం అజ్ఞానం. అజ్ఞానేన ఆవృతం జ్ఞానం. అజ్ఞానం మూలకారణం అయితే పరిష్కారం ఏమిటి? ఆ అజ్ఞానాన్ని తొలగించటమే. ఒక బాక్టీరియావల్ల ఒకరోగం వచ్చిందని నిర్ధారణ అయితే, ఆ బాక్టీరియాని సంహరించే మందు వాడతారు. ఇక్కడ అజ్ఞానం బాక్టీరియా అయితే, దాన్ని తొలగించే మందు ఏదో తెలుసుకోవాలి.

అజ్ఞానమనే బాక్టీరియాకు ఉన్నదొకటే మందు. అది జ్ఞానం. **అజ్ఞానాన్ని జ్ఞానంతోనే తొలగించగలము.** శంకరాచార్యులు ఒక ఉదాహరణనిస్తారు – చీకటిని వెలుగుతోనే తొలగించగలము. చీకటిని తొలగించటానికి ఎన్ని మార్గాలు ఉన్నాయి? ఆ గదిని ఊడిస్తే చీకటిని తొలగించగలమా? చీకటి పోగొట్టటానికి చీకట్లో కూర్చుని యోగాసనాలు వేస్తే చీకటిని తొలగించగలమా? చీకట్లో కూర్చుని విష్ణుసహస్రనామం చదివితే చీకటిని తొలగించగలమా? ఒక విషయం గమనించండి, ఈ కర్మలనేమీ కించపరచటం లేదు; వాటి విలువ వాటికుంది, కాని ఎవరైనా ఈ కర్మలు చేయండి అని చెపితే లాభం లేదు. ఇవేవీ చీకటిని తొలగించలేవు. ఇవి చీకటికి వ్యతిరేకమైన కర్మలు కావు. చీకటికి వ్యతిరేకం వెలుతురు మాత్రమే.

**అవిరోధితయా కర్మ నా౽విద్యాం వినివర్తయేత్।**
**విద్యావిద్యాం నిహంత్యేవ తేజస్తిమిరసంఘవత్** – ఆత్మబోధ. 3

ఈ విషయాన్ని ఆత్మబోధలో చక్కగా వివరించారు శంకరులవారు. ఎంత అద్భుతమైన శ్లోకం! కర్మ అజ్ఞానానికి భిన్నంగా లేదు అంటారు ఇందులో. అందువల్ల కర్మ అజ్ఞానాన్ని నాశనం చేయలేదు. ఏ అజ్ఞానాన్నీ నాశనం చేయలేదు. ఒకవేళ నాకు ఫిజిక్స్‌లో అజ్ఞానం ఉంది. ఫిజిక్స్‌లో అజ్ఞానం కాలేజీలో గంటసేపు నడిస్తే తొలగుతుందా? ఫిజిక్స్ ప్రొఫెసర్‌కు అర్చన చేస్తే తొలగుతుందా? పూజ, అర్చన, ఉపాసన, ప్రదక్షిణ – అన్నీ కర్మలే అని గుర్తుంచుకోండి. ఏ కర్మకు తగ్గ ఫలం ఆ కర్మకు ఉంటుంది. కర్మలు అనవసరం అని చెప్పటానికి వీలులేదు. కాని కర్మలు అజ్ఞానం తొలగించలేవు. ఫిజిక్స్ అజ్ఞానం ఉంటే ఫిజిక్స్ నేర్చుకోవాలి. వేరే మార్గం లేదు.

**కర్మ అవిద్యయా న నివర్తతే** అంటున్నారు శంకరులవారు. లౌకికకర్మ చేసినా, వైదిక కర్మ చేసినా లాభం లేదు. కొంతమంది నేను పొద్దున్నే మూడుగంటలకు లేస్తాను, గుడికి వెళతాను, పారాయణం చేస్తాను, సంధ్యావందనం చేస్తాను, యజ్ఞాలు చేస్తాను అని చెబుతారు. ఇవేవీ చెడు కాదు; అద్భుతమైన కర్మలు. కాని ఇవేవీ అజ్ఞానాన్ని మాత్రం తొలగించలేవు. మరి ఏం చేస్తాయి? చిత్తశుద్ధిని కలిగిస్తాయి. అజ్ఞానాన్ని తొలగించటానికి జ్ఞానం పొందాలి.

ఇప్పుడు చెప్పండి, అజ్ఞానాన్ని తొలగించటానికి ఎన్ని మార్గాలున్నాయి? నాలుగా, రెండా, ఒకటా? ఒక్కటే మార్గముంది. అజ్ఞానం సంసార కారణం కాబట్టి, జ్ఞానమార్గం మాత్రమే దానికి నివృత్తి. అందువల్ల కర్మయోగం వల్ల మోక్షం వస్తుంది; భక్తియోగంవల్ల మోక్షం వస్తుంది; రాజయోగంవల్ల మోక్షం వస్తుంది – ఇవేవీ గురువైన కృష్ణపరమాత్మ ఒప్పుకోడు. శాస్త్రమైన వేదాంతం ఒప్పుకోదు. **అనేక మార్గాలున్నాయి అనేది వేదానికి వ్యతిరిక్తం.** భగవద్గీత అనేక మార్గాలను ఒకేసారి చెబుతోంది అనేది పొరపాటు.అనేక మార్గాల పరిమితులను చెబుతున్నది. **భగవద్గీత మోక్షం పొందటానికి ఒకటే మార్గముంది – అది జ్ఞానమార్గం అని చెబుతున్నది.** అనేక మార్గాలు దేనికి ఉన్నాయి? చిత్తశుద్ధి పొందటానికి. కాని మోక్షం పొందటానికి మాత్రం ఒకటే మార్గం ఉంది.

**నాన్యః పంథా అయనాయ విద్యతే** – పురుషసూక్తం

ఒక ఆలయంలోకి ప్రవేశించటానికి అనేక మార్గాలు ఉండవచ్చు. కాని గర్భగుడిలోకి తీసుకువెళ్ళేది ఒక్కటే మార్గం. అలాగే జ్ఞానమార్గానికి రావటానికి అనేక మార్గాలున్నాయి కాని, మోక్షానికి ఒకటే మార్గముంది. **తమేవం విద్వాన్** – విద్వాన్ అంటే జ్ఞాని. జ్ఞాని ఒక్కడే మోక్షం పొందుతాడు.

**జ్ఞానేన తు తదజ్ఞానం నాశితమ్** – జ్ఞానం మాత్రమే ఆ అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. మళ్ళీ ఒక ప్రశ్న ఉదయిస్తుంది ఇక్కడ. ఏ జ్ఞానం? ఏదో ఒక జ్ఞానం ఏదో ఒక అజ్ఞానాన్ని తొలగించదు. ఫిజిక్స్ అజ్ఞానం, కెమిస్ట్రీ జ్ఞానం పొందితే పోతుందా? ఫిజిక్స్ జ్ఞానం మాత్రమే ఫిజిక్స్ అజ్ఞానాన్ని తొలగించగలదు. ఫిజిక్స్‌లోనో, కెమిస్ట్రీలోనో పిహెచ్‌డి పొంది, ఆత్మజ్ఞానం పొందకపోతే, అటువంటి వ్యక్తిని చదువుకున్న అజ్ఞాని అంటుంది

వేదాంతం. తక్కినవారు చదువురాని అజ్ఞానులు అవుతారు. అందువల్ల కృష్ణపరమాత్మ చాలా జాగ్రత్తగా తన పదాలను వాడుతున్నాడు.

(ఆత్మనః) జ్ఞానేన తత్ (ఆత్మనః) అజ్ఞానం నాశితం (భవతి) – ఆత్మజ్ఞానంవల్లనే ఆత్మ అజ్ఞానం నాశనమవుతుంది.

అలా అయితే, ఆత్మజ్ఞానం పొందటమెలా? కృష్ణపరమాత్మ దానికి ఇక్కడ జవాబు చెప్పడు. నాల్గవ అధ్యాయంలో చెప్పేశాడు కాబట్టి, దాన్ని ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** – 4.34

ఏమిటా పద్ధతి? చాలాసార్లు చూసిందే! వేదాంతశ్రవణం చేయాలి. శ్రవణం అంటే ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు ఒక సమర్థవంతమైన గురువువద్ద శాస్త్ర అధ్యయనం చేయాలి. ఆ జ్ఞానం పొందితే ఏమవుతుంది? ఆ విషయం చెబుతున్నాడిక్కడ.

**తేషాం** – ఆ జ్ఞానులకు; **జ్ఞానం తత్పరం ప్రకాశయతి** – ఆ జ్ఞానం వారికి వారి ఉన్నతస్థితిని తెలియజేస్తుంది. ఒక టార్చిలైటు ఎలాగైతే ఒక వస్తువును ప్రకాశింప చేస్తుందో, అలాగే ఆత్మజ్ఞానం నా ఉన్నత స్థితిని ప్రకాశింపజేస్తుంది. ఎటువంటి ఉన్నతస్థితి? నా గురించిన అద్భుతమైన నిజాలు! నేను శుద్ధస్వరూపుడను, ఒక నిజం! నాకు నిత్యభద్రత ఉంది, ఒక నిజం! నేను పూర్ణం, ఒక నిజం! ఆ మాటకొస్తే జీవితంలో నేను ఏయే అద్భుతవిషయాలకోసం వెంపర్లాడతానో అవన్నీ నాలోనే ఉన్నాయి అంటుంది. నీకు ప్రేమకావాలా, నువ్వే ప్రేమతత్త్వానివి అంటుంది. నీలో కరిగిపోనంత ప్రేమ ఉంది. ఎవరినీ నన్ను ప్రేమించమని బ్రతిమాలనవసరం లేదు. నిజానికి ఎవరైనా నేను నిన్ను ప్రేమించటం లేదన్నా కూడా, నువ్వు నిశ్చింతగా చెప్పవచ్చు; అది నీ సమస్య; నువ్వు నన్ను ప్రేమించినా ప్రేమించకపోయినా నేను నిన్ను ప్రేమిస్తున్నాను; నిన్నే కాదు ఈ ప్రపంచం మొత్తాన్ని ప్రేమిస్తున్నాను అని చెప్పవచ్చు.

**అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।**
**నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥** – 12.13

ఆత్మజ్ఞానం నువ్వు ఈ అద్భుతమైన ప్రేమతత్త్వానివి అంటుంది. ఎలా? కృష్ణపరమాత్మ దానికి ఒక ఉదాహరణ ఇస్తున్నాడు.

**ఆదిత్యవత్** – సూర్యునిలాగా. మీరు సూర్యోదయానికి ముందు నగరంలో నడుస్తున్నారనుకోండి. ఎక్కడ గతుకులు ఉన్నాయో, ఎక్కడ గుంతలున్నాయో తెలియదు. మీరు వాటిలో పడే ప్రమాదముంది. అదే సూర్యోదయం తరువాత నడిస్తే ఇవన్నీ స్పష్టంగా కనిపిస్తాయి కాబట్టి మీరు పడే సమస్య లేదు. అలాగే జీవితమనే ప్రయాణంలో అంతర్గతచీకటి ఉండటంవల్ల నిత్యం పడుతూనే ఉన్నారు. కాని జ్ఞానికి అంతర్గతచీకటి తొలగటంవల్ల జీవితంలో కిందపడే ప్రసక్తే లేదు. క్రిందపడడు అంటే బెంగ, చింత, ఆందోళనలాంటి బాధలు లేవు.

శ్లో. 17 **తద్బుద్ధయస్తదాత్మానః తన్నిష్ఠాస్తత్పరాయణాః ।**
**గచ్ఛంత్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూతకల్మషాః ॥**
తద్బుద్ధయః, తదాత్మానః, తన్నిష్ఠాః, తత్పరాయణాః, గచ్ఛంతి,
అపునరావృత్తిమ్, జ్ఞాననిర్ధూతకల్మషాః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తదాత్మానః | = | తద్రూపమును పొందిన | జ్ఞాననిర్ధూత | = | జ్ఞానసాధనతో |
| తద్బుద్ధయః | | మనోబుద్ధులు గలవారును | కల్మషాః | | పాపరహితులై |
| తన్నిష్ఠాః | = | ఆ పరమాత్మయందే నిరంతరము | అపునరావృత్తిమ్ | = | పునరావృత్తిరహితమైన |
| | | ఏకీభావముతో స్థితులైనవారును | | | పరమగతిని |
| తత్పరాయణాః | = | తత్పరాయణులును అగు పురుషులు | గచ్ఛంతి | = | పొందుదురు |

**తద్బుద్ధయః తదాత్మానః తన్నిష్ఠాః తత్పరాయణాః ।**
**జ్ఞాననిర్ధూతకల్మషాః అపునరావృత్తిం గచ్ఛన్తి ॥**

తా: తద్రూపమును పొందిన మనోబుద్ధులు గలవారై, పరమాత్మయందే నిరంతరం ఏకీభావంతో స్థితులై, తత్పరాయణులైన పురుషులు జ్ఞానసాధనతో పాపరహితులై, పునరావృత్తి రహితమైన పరమగతిని పొందుదురు.

ఇంకో అద్భుతమైన శ్లోకం. నిజానికి 13 నుంచి 21 వరకూ అన్ని శ్లోకాలూ అద్భుతమైన శ్లోకాలే! ఈ శ్లోకంలో ఆధ్యాత్మికరంగంలో పైకి రావటానికి చెయ్యాల్సిన సాధనలను చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. అవి ఒక వరుసక్రమంలో వచ్చేలాగా వాటిని మనం పేర్చుకుందాము.

1. **తత్పరాయణాః** – తత్ పరాయణాః అంటే నా ఉన్నతస్థితి. నా జీవితంలో నా అంతిమ లక్ష్యంగా ఉండాలి. ఇప్పుడు నేను తక్కువస్థాయిలో ఉన్న అహంకారంతో మమేకం చెందుతున్నాను. నేను అహంకారంతో ఎప్పుడైతే మమేకం చెందుతానో, అప్పుడే నా ఆనందం అనేక బాహ్యవస్తువులమీద ఆధారపడి ఉంటుంది. నా భార్య అలా ఎందుకు ఉంది, నా పిల్లలు అలా ఎందుకున్నారు అని బాధపడుతూ ఉంటాను. అంతేకాదు, కుటుంబం పెరిగిన కొద్దీ, బంధాలు పెరుగుతూ వస్తాయి. వాటితో పాటు బాధలు కూడా పెరుగుతూ వస్తాయి. **సర్వం పరవశం దుఃఖం.** బాహ్యవస్తువులమీద ఆధారపడితే దుఃఖమే మిగులుతుంది.

ప్రపంచాన్ని మార్చలేము అని 90 సంవత్సరాలకు తెలుసుకుంటాము. అప్పటికి ఒంట్లో ఓపికంతా అయిపోతుంది. అందువల్ల తెలివైన లక్ష్యం ఏమిటి? మనం ఆనందంగా, భద్రతతో ఉండాలి. అవి బాహ్యవస్తువులవల్ల రావు, బాహ్యవస్తువులు ఎలా ఉన్నా ఆనందంగా ఉండాలి. దీన్ని **అంతర్గత స్వేచ్ఛ** అంటారు. **నిజానికి ఈ అంతర్గత స్వేచ్ఛనే మోక్షం అంటారు.** మోక్షం అంటే ఎక్కడో అడివిలోకి వెళ్ళాలనో, మరణం తర్వాత పొందాలనో అనుకోకండి. **మోక్షం అంటే పరిస్థితులు మనం ఆశించినట్టుగా లేకపోయినా కూడా మనం ఆనందంగా ఉండగలగటం.**

దీనివల్ల ప్రయోజనం ఏమిటి? భవిష్యత్తు అంటే భయం వేయదు. భవిష్యత్తు మన పూర్ణత్వాన్ని ప్రభావితం చేయలేదు అని తెలుస్తుంది.

**ఆపూర్యమాణమచలప్రతిష్ఠం సముద్రమాపః ప్రవిశంతి యద్వత్ ।**

**తద్వత్ కామా యం ప్రవిశంతి సర్వే స శాంతిమాప్నోతి న కామకామీ ॥** – 2.70

సముద్రం తన పూర్ణత్వానికి నదులమీద ఆధారపడదు. నదులు మేమే నీకు నీటిని ఇస్తున్నాము అంటే సముద్రం ఏమంటుంది? ఏమీ అనదు. ఎందుకంటే సముద్రానికి తెలుసు – నిజానికి నదులకే నీరును సముద్రం వానరూపంలో ఇస్తున్నదని. అందువల్ల నదులు సముద్రంలో ప్రవహించినా, లేకపోయినా సముద్రం ఎప్పుడూ పూర్ణమే! అంతేకాదు అందులోకి పవిత్రమైన గంగానదీ ప్రవహిస్తుంది, చిన్ననదీ ప్రవహిస్తుంది. కాని సముద్రానికి ఏమీ అవదు. నా ఉన్నత స్థితి కూడా అంతే. ఆత్మనైన నేను సముద్రంతో సమానం. నాలో కలిసే నదులు, నాకు కలిగే అనేక అనుభవాలు. మంచి అనుభవాలు వస్తాయి; చెడు అనుభవాలు వస్తాయి; కాని సముద్రంలాగా నేను ఎప్పటికీ పూర్ణుణ్ణి.

ఎప్పుడైతే నేను ఈ పూర్ణత్వాన్ని అర్థం చేసుకుంటానో, అప్పుడే నా లక్ష్యం మారుతుంది. ప్రపంచాన్ని మార్చటానికి ప్రయత్నించే బదులు, నన్ను నేను మార్చుకోవటానికి ప్రయత్నిస్తాను. ఎటువంటి మార్పు? ఆధారపడే అహంకారం స్థాయినుంచి, నిత్యముక్త అయిన ఆత్మస్థాయికి ఎదుగుతాను. ఇంతవరకూ నేను లౌకిక విషయాలలో కొట్టుమిట్టాడుతూ, అశాంతి పాలవుతున్నాను. ఇప్పుడు నేనేం చేయాలో నాకు తెలుసు. తత్పరాయణాః – నా జీవితానికి ఒక మార్గం ఏర్పడింది.

ఎప్పుడైతే నా ఉన్నతస్థితిని తెలుసుకుంటానో అప్పుడే నేను అసంగత్వం అలవరచుకుంటాను. ఆకాశంలో అన్నీ ఉన్నా, ఎలా ఆకాశానికి దేనితోనూ సంగత్వం లేదో, ఆత్మగా నాకు కూడా దేనితోనూ సంగత్వం లేదు. తెరమీద సినిమా ఆడుతున్నా, తెర అసంగం. తెరమీద కురిసే వాన తెరను తడపలేదు; సినిమాలో ఎగిసే మంటలు తెరను కాల్చలేవు. అలాగే నేను కూడా అందరితో ఉంటాను, కాని ఎవరితోనూ బంధం లేదు. ఈ అంతరసన్యాసం జ్ఞానంవల్లనే వస్తుంది. దీన్ని విద్వత్ సన్యాసం అంటారు. ఈ అధ్యాయాన్ని సన్యాసయోగం అని కూడా అంటారు. జ్ఞానంద్వారా ఆంతర సన్యాసం.

2. **తద్బుద్ధయః** – ఇక్కడ బుద్ధి అంటే జ్ఞానం. తద్బుద్ధి అంటే ఆత్మజ్ఞానం. నా లక్ష్యం ఏర్పడ్డాక ఏం చేస్తాను? ఆత్మజ్ఞానం పొందటానికి వస్తాను. ఇక్కడ కర్మయోగం గురించి చెప్పలేదు కాని అది కలుపుకోవాలి. కర్మయోగం పాటించి, జ్ఞానయోగానికి రావాలి. జ్ఞానయోగంలో ఏం పొందుతాను? నా ఉన్నతస్థితిని తెలుసుకుంటాను.

నా ఉన్నతస్థితి గురించి తెలుసుకుంటే సరిపోదు, నేను అంత తేలిగ్గా దానితో మమేకం చెందను. నా అహంకారంతోనే లయమవుతూ వస్తాను. ఎందుకంటే ఎన్నో సంవత్సరాలుగా నా మనశ్శరీరాలతో మమేకం అయి ఉన్నాను. అది అంత తేలిగ్గా పోదు. పూరిగుడిసెల్లో, మురిక్కాలవల దగ్గర ఉండే బీదవారికి జీవనం ఉన్నతంగా ఉండాలని ప్రభుత్వం వారికి ఉచితంగా ఇళ్ళు పంచి పెడుతుంది. కాని వారేం చేస్తారు? ఆ ఇళ్ళు తీసుకుని, ఎవరికో అద్దెకిచ్చేసి, దర్జాగా వారి పాత జీవితంలో కొనసాగుతారు.

మనలో ఆ బానిసత్వం పేరుకుపోయింది. అంతెందుకు, ఆంగ్లేయుల పరిపాలనే బాగుందనేవారు ఉన్నారు ఇప్పటికీ. బానిసమనస్తత్వం తరతరాలుగా పేరుకుపోయింది. అందువల్లనే నేను ఆత్మను అనుకోకుండా నేను అహంకారాన్ని అనుకుంటాను. దీన్ని వాసన అంటారు. **దేహాత్మ వాసన** ఇది.

అందువల్ల ఆత్మజ్ఞానం పొందాక ఏమంటాను? నేను సంసారిని కాని నాకొక ఉన్నత నేను ఉంది. అది ఆత్మ. అది ముక్తి పొందింది అంటాను. ఆ ఉన్నత నేను ఎక్కడో ఉన్నట్టుగా అనుకుంటాను. దానివల్ల ప్రయోజనం లేదు. దాన్నుంచి తరువాత సాధనకు రావాలి. ఏమిటది? నేను భర్తను, నేను తండ్రిని, నేను విద్యాధికుణ్ణి అంటూ చెప్పుకునే అహంకారపు ప్రశంసలను మానాలి. కొంతమంది నేను గొప్ప భక్తుణ్ణి, దేవుడికి కొంతభూమి దానం చేశానని గొప్పలు చెబుతారు. కొంతమంది నేను సన్న్యాసిని, అన్నీ పరిత్యజించాను అంటారు. శాస్త్రం, 'నువ్వు అన్నీ పరిత్యజించావు – నిజమే కానీ, నేను అన్నీ పరిత్యజించాను అనే భావనను పరిత్యజించలేదు,' అంటుంది.

**త్యజ ధర్మమ్ అధర్మం చ। ఉభే సత్యానృతే త్యజ ॥**

**ఉభే సత్యానృతే త్యక్త్వా। యేన త్యజతి తత్ త్యజ ॥**

అన్నీ పరిత్యజించాక! 'నేను గొప్ప త్యాగిని' అనే అభిమానాన్ని కూడా పరిత్యజించమంటుంది శాస్త్రం. కాని అది తేలిక కాదు. నేను గీత నేర్చేసుకున్నాను. ఒక గర్వం! నాకు బ్రహ్మసూత్రాలు తెలుసు; ఇంకొక గొప్ప! ఆ గర్వం చాలా శక్తివంతమైనది. అది అంత తేలికగా పోదు. అందువల్ల అహంకారం నేనునుంచి ఆత్మ నేనుకు; ఆపేక్షిక నేనునుంచి ఆత్యంతిక నేనుకు మారాలి.

3. **తదాత్మానః** – నిజానికి ఇదే చాలా కష్టమైన పని. నేను ఉన్నతస్థితికి చెందిన ఆత్మను అని అర్థం చేసుకోవటం చాలా తేలిక. కాని అహంకార అభిమానాన్ని ఒదులుకోవటం చాలా కష్టం. అందువల్లనే కృష్ణపరమాత్మ తత్ ఆత్మనః అంటున్నాడు. తత్ ఆత్మనః అంటే ఉన్నత నేనుతో మమేకం చెందటం. అందువల్లనే పూర్వం ఆశ్రమధర్మాల్లో సన్న్యాసాశ్రమధర్మాన్ని చెప్పేవారు. ఎందుకంటే సన్న్యాసం స్వీకరిస్తే బంధాలు తెంపుకోవటం తేలిక. ఒక్కొక్క బంధం ఒక్కొక్క విధమైన అహంకారాన్ని పెంచుతుంది. భార్య ఉంటే భర్త అనే అహంకారం; పుత్రుడు ఉంటే తండ్రిననే అహంకారం పెరుగుతాయి.

**న తాతో న మాతా న గురుర్ నైవ శిష్య నబంధుః న మిత్రమ్** – తండ్రి, తల్లి, గురువు, శిష్యుడు ఎవరూ లేరు; వారంతా శరీరానికి చెందినవారు. అలాగని ఈ విషయం వినగానే, ఇంటికి వెళ్ళి ఇవాళ్టినుంచీ నువ్వు నా భార్యవు కావు, నేను నీ భర్తను కాను అని చెప్పకూడదు. భర్త పాత్రలో ఉంటూ, భర్తగా ప్రేమను చూపిస్తూ, ఇది నేను వేసే వేషం మాత్రమే అనే నిష్ఠలో ఉండాలి. పొద్దున్న లేస్తూనే నా పాత్రను గుర్తు తెచ్చుకోవాలి; రాత్రి పడుకునేటప్పుడు ఇది నా పాత్ర అని గుర్తుంచుకోవాలి.

4. **తన్నిష్ఠాః** – అలా నేను ఉన్నతమైన ఆత్మను అని ఆత్మలోనే రమించటాన్ని తన్నిష్ఠ అంటారు. అంతకు ముందు నేను శరీరాన్ని, నాకు ఆత్మ వుంది అన్నాను. ఇప్పుడు నేను ఆత్మస్వరూపాన్ని అని అర్థం చేసుకున్నాను.ఇప్పుడు నా మాటను మార్చాలి. ఏమని? నేను ఆత్మను, నాకు వ్యవహారం నడపటానికి శరీరం ఉంది. అది ఎప్పుడైనా దేవుడు నాకు ముందు చెప్పకుండా తీసుకువెళ్ళిపోవచ్చు. నేను శాశ్వతమైన ఆత్మను. దేవుడు నన్ను ఎన్నడూ

తీసుకువెళ్ళదు; తీసుకువెళ్ళలేదు. నేను తండ్రిని, నేను భర్తను అనేవన్నీ నేను వేసే పాత్రలు మాత్రమే. ఈ నిదిధ్యాసనంలో ఎప్పుడూ ఉండాలి. దానికి వీలుగా శంకరులవారు అనేక శ్లోకాలు వ్రాశారు. వీటిని నిదిధ్యాసన శ్లోకాలు అంటారు.

**మనో బుద్ధ్యహంకార చిత్తాని నాహం**
**న చ శ్రోత్రజిహ్వే న చ ఘ్రాణనేత్రే**
**న చ వ్యోమభూమిః న తేజో న వాయుః**
**చిదానందరూపః శివోఽహం శివోఽహం**

ఈ శరీరం, ఈ ఇంద్రియాలు, ఈ మనస్సు, ఈ బుద్ధి అన్నీ నేను వ్యవహారం నడపటానికి ఇవ్వబడ్డాయి కాని నేను ఇవేమీ కాను. నేను వాటి వెనకనున్న చైతన్యాన్ని. ఈ సూత్రాన్ని నేను పదేపదే వల్లెవేస్తే నాకు అది సహజంగా అబ్బుతుంది. బ్రహ్మచారి పెళ్ళి చేసుకుని గృహస్థు అయిన కొత్తలో గృహస్థు అయ్యానని జీర్ణించుకోవటానికి కొంత సమయం పడుతుంది కాని తరువాత అది అతనిలో స్థిరంగా ఉండిపోతుంది. కలలో కూడా గృహస్థుగానే కలగంటాడు. ఈ ప్రయత్నరహిత జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠ అంటారు.

నాకు జ్ఞాననిష్ఠ కలిగిందో, లేదో ఎలా తెలుస్తుంది? కష్టకాలంలో నా ప్రమేయం లేకుండా నాకు ఆ జ్ఞానం గుర్తుకువస్తే నేను ఆ జ్ఞాననిష్ఠలో ఉన్నట్టు అర్థం. నా జ్ఞానం అంతా నేను రాసుకున్న నోట్సులోనూ, నేను రికార్డు చేసుకున్న క్యాసెట్టులోనూ ఉండి; నాకు అవసరానికి అందకపోతే ఆ జ్ఞానం ఉండి కూడా ఏమిటి లాభం?

**పుస్తకస్య చ యా విద్యా పరహస్తే చ యద్ధనమ్ ।**
**కార్యకాలే సమాయాతే నసా విద్యా నతద్ధనమ్ ॥**

పుస్తకాల్లో ఉన్న విద్య, పరుల చేతిలో ఉన్న ధనము, అవసరమైనప్పుడు ఆ విద్యకాని, ఆ ధనం కాని నన్ను ఆదుకోవు. అవి ఎప్పుడూ నాకు అందుబాటులో ఉండాలి. అలా నా ప్రమేయం లేకుండా, దానంతట అది నాకు గుర్తుకువస్తే ఆ జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠ అంటారు. బాహ్యంగా మార్పు త్వరగా వస్తుంది కాని అంతర్గత మార్పు త్వరగారాదు. అది వచ్చేలాగా ఆ నిష్ఠలో ఉండాలి.

జ్ఞానం పొందే నాలుగు దశలు –

1. **జ్ఞానయోగం విలువ తెలుసుకోవటం**
2. **నాకు ఆత్మ వుంది అని తెలుసుకోవటం**
3. **నేను ఆ ఉన్నతమైన ఆత్మను అని స్వీకరించటం**
4. **ఈ జ్ఞానం నాలో అప్రయత్నంగా స్వాభావికంగా స్థిరపడటం**

ఈ నాలుగు దశలనూ దాటినవారిని **బ్రహ్మనిష్ఠులు** లేదా **జ్ఞాననిష్ఠులు** అంటారు. అటువంటి వారికి ఏమి వస్తుంది?

**జ్ఞాననిర్ధూతకల్మషాః** – అన్ని కల్మషాలూ జ్ఞానంవల్ల నిర్మూలించబడతాయి. మూడు కల్మషాలు ఉంటాయి. అవి **అజ్ఞానం, సంశయం, విపర్యయం.**

1) అజ్ఞానం అంటే ఆత్మ గురించిన అజ్ఞానం
2) సంశయం అంటే శాస్త్రం నేర్చుకున్నాక కూడా కలిగే కొన్ని సందేహాలు
3) విపర్యయం అంటే అహంకార అభిమానవాసనలు

ఈ మూడూ కల్మషాల కింద వస్తాయి. అవి నిర్ధూతం అంటే జ్ఞానశక్తివల్ల తొలగించబడతాయి. దీన్ని జీవన్ముక్తి అంటారు. ఈ జ్ఞానం పొందినవారు ఇక్కడే, ఇప్పుడే జీవన్ముక్తిని అనుభవిస్తారు. ఎంతకాలం? వారి ప్రారబ్ధకర్మ ఉన్నంతకాలం.

**అపునరావృత్తిం గచ్ఛంతి** – వారు మరణించాక మళ్ళీ పుట్టరు. ఈ శరీరం రాలిపోయాక (వారిది మరణం అనరు, వారు ఆత్మ కాబట్టి దానికి మరణం లేదు కాబట్టి) వారు విదేహముక్తి పొందుతారు. అపునరావృత్తి అంటే విదేహముక్తి. వారికి పునరపి జననం, పునరపి మరణం ఉండదు.

శ్లో. 18 **విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।**
**శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥**
విద్యావినయసంపన్నే, బ్రాహ్మణే, గవి, హస్తిని,
శుని, చ, ఏవ, శ్వపాకే, చ, పండితాః, సమదర్శినః ॥

| | | |
|---|---|---|
| పండితాః | = | జ్ఞానులు |
| విద్యావినయ | = | విద్యతో, వినయంతో |
| సంపన్నే | | ఒప్పుచున్న |
| బ్రాహ్మణే, చ | = | బ్రాహ్మణునియందు |
| గవి | = | గోవునందు |
| హస్తిని | = | ఏనుగునందు |
| శుని | = | కుక్కయందు |
| శ్వపాకే చ | = | కుక్క మాంసము తినువానియందు |
| సమదర్శినః | = | సమదృష్టినే |
| ఏవ | | కలిగియుందురు |

**పండితాః విద్యావినయసంపన్నే బ్రాహ్మణే, గవి, హస్తిని,**
**శుని చ శ్వపాకే చ ఏవ సమదర్శినః (సంతి)**

తా: జ్ఞానులు విద్యావినయసంపన్నుడైన బ్రాహ్మణునియందు, గోవునందు, ఏనుగునందు, కుక్కయందు, కుక్క మాంసము తినువానియందు సమదృష్టినే కలిగియుందురు.

ఈ రెండు శ్లోకాల్లో కృష్ణపరమాత్మ జ్ఞానఫలం గురించి చెబుతున్నాడు. వేదాంతం ప్రకారం మన సమస్య ప్రపంచంవల్ల కాదు; మనుష్యులవల్ల కాదు. ఎందుకంటే అదే ప్రపంచంలో, అదే మనుష్యుల మధ్య మోక్షం పొందిన జ్ఞానులు కూడా జీవిస్తున్నారు.

**సంపూర్ణం జగదేవ నందనవనం సర్వేఽపి కల్పద్రుమా**
**గాంగం వారి సమస్తవారి నివహః పుణ్యాః సమస్తాః క్రియాః ।**
**వాచః ప్రాకృతసంస్కృతాః శ్రుతిశిరో వారాణసీ మేదినీ**
**సర్వావస్థితిరస్య వస్తువిషయా దృష్టిః పరబ్రహ్మణి ॥** – ధన్యాష్టకమ్ 10

ఒక జ్ఞానికి ఈ ప్రపంచం నందనవనం; వృక్షాలు కామధేనువు; అన్ని ప్రదేశాలూ వారణాసి; అన్ని నదులూ గంగానది. అంటే ప్రపంచం అలాగే వుంది, మనుష్యులు అలాగే ఉన్నారు, కాని జ్ఞాని ఆనందం పొందుతున్నాడు. అంటే సమస్య ప్రపంచంలో లేదు. మనం చూసే దృష్టిలో ఉంది. అందువల్ల వేదాంతం ప్రపంచాన్ని మార్చదు; మన దృక్కోణాన్ని మార్చుతుంది.

ప్రపంచం అద్దంలా ఉంటుంది! అద్దంలో నన్ను నేనే చూసుకుంటాను. అలాగే ప్రపంచంలో కూడా నన్ను నేనే చూసుకుంటాను. అంటే ప్రపంచం ఎలా ఉంది అని నలుగురిని అడిగితే, నలుగురు నాలుగు రకాలుగా చెపుతారు. ఎందుకు? ఎవరికేది ఇష్టమయితే దాన్నే ప్రపంచంలో వెతుక్కుంటారు. అందంగా అలంకరించుకునే మోజు ఉన్నవారు, ప్రపంచంలో కూడా ఎవరెలా అలంకరించుకున్నారో చూస్తారు. అందంమీద ఇష్టం ఉన్నవారు, అందమైన వారిని చూస్తారు. మంచితనం ఉన్నవారు మంచితనం ఉన్నవారిని గుర్తిస్తారు; తెలివైనవారు తెలివైనవారిని వెతుకుతారు. ఈ విషయం రమణమహర్షి సద్దర్శనంలో అద్భుతంగా వివరించారు.

చివరికి మనం చూసే దేవుణ్ణి కూడా మన ఇష్టాయిష్టాలకు తగ్గట్టుగానే చూస్తాము. అందం చూసే భక్తుడు దేవుణ్ణి సుందరాకారునిగా కీర్తిస్తాడు; తెలివిమీద మక్కువ ఉంటే దేవుణ్ణి సర్వజ్ఞుడిగా కొలుస్తాడు; సగుణజీవి సగుణ ఈశ్వరుణ్ణే కొలుస్తాడు; నేను నిర్గుణచైతన్యం అని అర్థం చేసుకునే జ్ఞాని దేవుణ్ణి కూడా నిర్గుణచైతన్యంగా అర్థం చేసుకుంటాడు. అందువల్ల నన్ను నేను ఎలా అర్థం చేసుకుంటే, ప్రపంచాన్ని, ఆఖరికి భగవంతుణ్ణి కూడా, అలాగే అర్థం చేసుకుంటాను.

కృష్ణపరమాత్మ జ్ఞాని తనను తాను ఆత్మగా చూస్తాడంటున్నాడు. అప్పుడు అతను తక్కినవారిని కూడా ఆత్మగానే చూస్తాడు. నేను ఆత్మను, నాకు వ్యవహారం నడపటానికి శరీరం ఉంది అని ఎలా అంటాడో, అందరినీ అలాగే చూస్తాడు. అందువల్ల ఈ జ్ఞానంవల్ల కలిగే ఫలమేమిటి? **సర్వత్ర సమదర్శనం.** ఈ సమదర్శనం మామూలు కళ్ళతో కాదు – జ్ఞాననేత్రంతో, దివ్యచక్షువులతో.

**సర్వత్ర సమమ్ అసంగం సచ్చిదానందం చైతన్యం పశ్యతి** – పిల్లవాని చేతిలో ఉన్న ఐదువందల నోటుకూ, మీ చేతిలో ఉన్న ఐదువందల నోటుకూ మధ్యనున్న భేదమేమిటి? పిల్లవానికి అది ఒక కాగితం ముక్క మాత్రమే. దాన్ని చింపటమో, పారేయటమో లేదా నోట్లో పెట్టుకోవటమో చేస్తాడు. కాని మీరు దాన్ని విలువైన డబ్బుగా చూస్తారు. మీరు కాగితాన్ని చూడరని కాదు, కాని ఆ కాగితం వెనక మీరు ఇంకోటి చూస్తారు. అది జ్ఞానం వలన వచ్చిన దృష్టి. అదే విధంగా జ్ఞానిదృష్టి సమదృష్టి, అజ్ఞానిదృష్టి విషమదృష్టి. జ్ఞానిది అభేదదృష్టి, అజ్ఞానిది భేదదృష్టి. ఇదీ ఈ శ్లోకంయొక్క సారాంశం. ఈ సమదృష్టి అసంకల్పితంగా ఏర్పడుతుంది.

**పండితాః సమదర్శినః** – ఇక్కడ పండితః అంటే జ్ఞాని, ఆత్మజ్ఞాని. సాధారణంగా పండితుడు పదాన్ని ఏ విద్యలో అన్నా ఆరితేరిన వ్యక్తిని వర్ణించటానికి వాడతారు. ఉదాహరణకు అతను హిందీ పండితుడు అంటారు. కానీ గీతలో పండితుడు అంటే ఆత్మజ్ఞాని. నిజానికి కృష్ణపరమాత్మ తను చెప్పిన మొట్టమొదటి శ్లోకంలోనే **నానుశోచంతి పండితాః** అన్నాడు. ఇక్కడ దానికి వివరణ వస్తుంది. పండితుడు అంటే సమదర్శనం ఉన్నవాడు.

మామూలు కళ్ళతో కాదు అన్న విషయం మర్చిపోకూడదు. మామూలుగా అతను కూడా అనేక రంగులూ, రూపాలూ చూస్తాడు. మామూలు కళ్ళకు అన్నీ ఒక్కలాగే కనిపిస్తే, కంటి వైద్యానికి వెళ్ళాల్సివుంటుంది. అదే జ్ఞాననేత్రంతో సమత్వం చూస్తే, మోక్షం పొందినట్టు అర్థం. ఈ విషయాన్ని గమనించండి – సమదర్శనం అంటే సమ ఆత్మదర్శనం. ఎక్కడ చూస్తాడు ఈ సమత్వం? కృష్ణపరమాత్మ ఒక పెద్ద పట్టిక ఇస్తున్నాడు.

**విద్యావినయసంపన్నే బ్రాహ్మణే** – ఒకవైపు గొప్ప వ్యక్తి బ్రాహ్మణుడు. బ్రాహ్మణుడు అంటే జాతి బ్రాహ్మణుడు కాదు, సత్త్వగుణ ప్రధానబ్రాహ్మణుడు. నిజానికి బృహదారణ్యంలో ఎవరైతే బ్రహ్మజ్ఞానో, అతనే అసలైన బ్రాహ్మణుడు అని వస్తుంది. అందువల్ల బ్రాహ్మణుడు అంటే జ్ఞాని.

**తస్మాద్బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠాసేత్ బాల్యం చ పాండిత్యం చ నిర్విద్యాஉథ మునిః అమౌనం చ మౌనం చ నిర్విద్యాథ బ్రాహ్మణః** – బృహదారణ్యకమ్ 3.5.1

ఎవరైతే శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా బ్రహ్మనిష్ఠలో ఉంటాడో, అతనిని మాత్రమే బ్రాహ్మణుడు అనగలము.

ఇక్కడ బ్రాహ్మణుణ్ణి ఎలా వర్ణించాడు కృష్ణపరమాత్మ? విద్యావినయసంపన్నే అన్నాడు. సంపన్నుడు అయినవాడు. దేనివల్ల? విద్యవల్ల. **విద్యాదానం సర్వదానాత్ ప్రధానమ్.** తక్కిన సంపదలతో పరిమితి ఉన్న వస్తువులనే కొనగలము కాని విద్య అనే సంపదతో శాశ్వతమైన మోక్షాన్ని పొందగలము.

**ద్రవిణగ్ం సవర్చసం। సుమేధ, అమృతోక్షితః। ఇతి త్రిశంకోర్వేదానువచనమ్** – తైత్తిరీయమ్

ఈ జ్ఞానాన్ని ద్రవిణం అంటే సంపద అన్నారు. బ్రాహ్మణుడు జ్ఞానమనే సంపద ఉన్నవాడు. ఆ జ్ఞానంతో పాటు వినయం కూడా ఉంది. వినయం అంటే అమానిత్వం. వినయం లేకపోతే విద్యరాదు. నీరు పైనుంచి క్రిందికి ప్రవహించినట్టుగా జ్ఞానం వినయం ఉండి, గురువుకు వంగిన వ్యక్తికి ప్రవహిస్తుంది.

**గవి** – గవి అంటే ఆవు. మన సాంప్రదాయంలో ఆవును సత్త్వగుణప్రధాన జంతువుగా పరిగణిస్తారు. అందువల్ల గోపూజ చేస్తారు. అందరు దేవతలూ గోవు శరీరంలో ఉంటారుట. అందువల్ల ఇప్పటికీ గోప్రదక్షిణ చేస్తారు. ఆవుకు ప్రదక్షిణ చేస్తే దేవతలందరికీ చేసినంత పుణ్యం వస్తుంది.

**హస్తిని** – ఏనుగు. మన సాంప్రదాయంలో ఏనుగుకు కూడా పెద్దపీట వేశారు. ఆలయాల్లో ఏనుగుకు పూజ చేస్తారు.

**శుని** – మన సాంప్రదాయంలో అన్నిటికన్నా హీనమైన జాతి కుక్క. అందువల్లనే మన పూర్వీకుల దగ్గర ఆవులు ఉండేవి కాని, కుక్కలు ఉండేవి కావు.

**శ్వపాకేః** – అక్షరాలా తీసుకుంటే కుక్కమాంసం తినేవాడు. మన సాంప్రదాయంలో మాంసభక్షణం చేయరాదు. ఎందుకంటే అది హింసతో కూడినది. అలాగే సురాపానం కూడా చేయకూడదు, ముఖ్యంగా ఆధ్యాత్మిక చింతన ఉన్నవారు. మాంసభక్షణాన్ని తామసికకర్మగా చూస్తారు. అది తమోగుణాన్ని పెంపొందిస్తుంది. మాంసభక్షకుల్లో కూడా కుక్కమాంసం తినేవారు ఇంకా తక్కువ జాతివారు.

పండితాః సమదర్శినః**–** కృష్ణపరమాత్మ ఒకవైపు అందరూ చాలా గౌరవించే బ్రాహ్మణుణ్ణీ, ఇంకొకవైపు అందరూ చిన్నచూపు చూసే కుక్కమాంస భక్షకుణ్ణీ తీసుకుని మధ్యలో కొన్ని జంతువులను పెట్టాడు. ఈ పట్టికలో చెట్లను కూడా తీసుకోవచ్చు. ఇవన్నీ చూడటానికి పూర్తి భిన్నంగా ఉన్నవి. వాటి శరీరనిర్మాణం వేరు, వారికి ఇచ్చే ప్రాముఖ్యత వేరు, వారి గుణం వేరు. స్థూల, సూక్ష్మశరీరాల పరంగా ఇవన్నీ భిన్నంగా ఉన్నాయి. కాని అన్నింటిలోనూ సమానంగా ఉన్నదేమిటి? **ఆత్మ**. సర్వత్ర అంటే **సర్వేషు శరీరేషు సమదర్శినః**.

కాని ఇక్కడ ఒక విషయం జాగ్రత్తగా గమనించాలి మనం. జ్ఞానికి సమదర్శనం ఉంది అంటే అది అతని మనస్సులో, అతని సుప్తచేతనమనస్సులోనే ఉంది. సంగీతకచేరీలో తంబూరాశ్రుతి వినిపిస్తూనే ఉన్నట్టుగా, అతని మనస్సులో ఈ సర్వదర్శనం తంబూరాశృతిలాగా మ్రోగుతూనే ఉంటుంది, కాని వ్యవహారం నడిపేటప్పుడు భేదాలు చూస్తాడు. అలా చూడకపోతే ఏమవుతుంది? గ్లాసులో నీళ్ళు ఇస్తే, సర్వత్ర సమదర్శనం చూడాలని గ్లాసును తాగలేడు కదా! గ్లాసుని గ్లాసుగానే చూస్తాడు, నీటిని నీరుగానే చూస్తాడు. వ్యవహారంలో మనిషిని మనిషిగా, పుస్తకాన్ని పుస్తకంగా, నీరుని నీరుగా చూస్తాడు. వ్యవహారంలో భేదం తప్పదు. అందువల్ల వ్యవహారంలో ధర్మశాస్త్రం పాటించాలి.

**భావాద్వైతం సదా కుర్యాత్ క్రియాద్వైతం న కర్హిచిత్ ।**
**అద్వైతం త్రిషు లోకేషు నాద్వైతం గురుణా సహ ॥**

భావంలో ఎప్పుడూ అద్వైతంలో ఉండాలి, వ్యవహారంలో ద్వైతం చూపాలి అని శంకరులవారు అద్భుతంగా చెప్పారు. గురువు దగ్గర అద్వైతశాస్త్రం అధ్యయనం చేశాక, శిష్యుడు వెళ్ళి ఇప్పుడు మనమిద్దరం సమానమే, ఇంతవరకూ నేను మీకు నమస్కారాలు పెట్టాను, ఇప్పుడు మార్పుకోసం మీరెందుకు నాకు నమస్కారం పెట్టకూడదు అన్నాడనుకోండి, ఎలా ఉంటుంది? వ్యవహారంలో గురువు గురువే, శిష్యుడు శిష్యుడే. అందువల్ల సమదర్శనం సుప్తచేతన మనస్సులో ఉండాలి.

ఆభరణాలు అన్నింటిలో బంగారమే ఉందనే సమదర్శనం కలిగినా నగను మెడలోనే వేసుకుంటారు; గాజును చేతికే వేసుకుంటారు; ఉంగరాన్ని వేలికే పెట్టుకుంటారు. దీన్నే వ్యావహారిక భేదం అంటారు. దీన్నే జ్ఞానం అంటారు.

శ్లో. 19 **ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః ।**
**నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్ బ్రహ్మణి తే స్థితాః ॥**
ఇహ, ఏవ, తైః, జితః, సర్గః, యేషామ్, సామ్యే, స్థితమ్, మనః,
నిర్దోషమ్, హి, సమమ్, బ్రహ్మ, తస్మాత్, బ్రహ్మణి, తే, స్థితాః ॥

| | | | |
|---|---|---|---|
| యేషాం, మనః | = ఎవరి మనస్సు | బ్రహ్మ | = పరమాత్మ |
| సామ్యే, స్థితమ్ | = సమభావమందు స్థితమై యుండునో | నిర్దోషమ్ | = దోషరహితుడు |
| | | సమమ్ | = సముడు(అధిష్ఠానము) |
| తైః | = వారిచే | తస్మాత్ | = అందువల్ల |
| ఇహ, ఏవ | = ఈ జన్మయందే | తే | = వారు (అటువంటి జ్ఞానులు) |
| సర్గః | = జగత్తంతయు | బ్రహ్మణి, స్థితాః | = పరమాత్మయందు స్థితులు అంటే వారు త్రిగుణాతీతులు, జీవన్ముక్తులు |
| జితః | = జయింపబడినది యగును | | |
| హి | = ఎందుకంటే | | |

**యేషాం మనః సామ్యే స్థితం, తైః సర్గః ఇహ ఏవ జితః ।**
**హి బ్రహ్మ నిర్దోషం సమమ్, తస్మాత్ తే బ్రహ్మణి స్థితాః ॥**

తా: సర్వత్ర సమభావస్థితమనస్కులు ఈ జన్మయందే సంపూర్ణజగత్తును జయించిన వారగుదురు. అంటే– ప్రాపంచిక విషయాతీతస్థితికి చేరుదురు. పరమాత్మ దోషరహితుడు, అధిష్ఠానము. సమభావస్థితమనస్కులైన జ్ఞానులు పరమాత్మయందు స్థితులు. కనుక, వారు త్రిగుణాతీతులు, జీవన్ముక్తులు.

ఇది ఇంకొక అద్భుతమైన శ్లోకం. నిజానికి 13 నుంచి 21 వరకూ అన్నీ అద్భుతమైన శ్లోకాలే అని చూశాము. కాని ఇది ఇంకా ముఖ్యమైన శ్లోకం. ఎందుకంటే ఇది మన సిద్ధాంతంలో ఉన్న ఒక పెద్ద చర్చకు జవాబు చెబుతుంది. **జ్ఞాని ఇక్కడే, ఇప్పుడే జీవన్ముక్తి పొందుతాడు.** ఇదీ దీని సారాంశం.

చాలామంది జీవించి ఉండగా మోక్షం కలగదు అంటారు. వారి ఉద్దేశ్యంలో మోక్షం మరణానంతరమే కలుగుతుంది, అది కూడా ఊర్ధ్వలోకాలకు వెళ్ళాక మోక్షం వస్తుంది. శివలోకప్రాప్తిని లేదా విష్ణులోకప్రాప్తిని మోక్షం అంటారు వారు. కాని అద్వైతంలో ఇక్కడే, ఇప్పుడే మోక్షం కలుగుతుంది. ఈ సిద్ధాంతాన్ని నొక్కివక్కాణించే శ్లోకం ఇది. ఆ విషయం కృష్ణపరమాత్మ గట్టిగా చెబుతున్నాడు.

**ఇహైవ** – ఇహ అంటే ఇక్కడే, ఇప్పుడే. ఇక్కడే, ఇప్పుడే మోక్షం సాధ్యం. ఎవరికి?

**తైః** – తైః అంటే అభేద దృష్టి లేదా సమదృష్టి ఉన్నవారు. అంటే జ్ఞానులు. **సర్గఃజితః** – సర్గః అంటే పునరపి జననం, పునరపి మరణం వృత్తాన్ని అంటే సంసారాన్ని; జితః – జయించిన వారు. మొత్తం వాక్యం కలిపితే, **జ్ఞానులు ఇక్కడే ఇప్పుడే సంసారాన్ని జయిస్తారు**. అంటే వారిని సంసారం బాధించదు. ఎందుకు? వారి దృక్కోణం మారింది కాబట్టి.

అల ఉదాహరణ చూద్దాము. ఒక అల తను చిన్న అల అనుకుంటే అంతా బాధలే! తను సముద్రంలో పుట్టిందనీ, దానికొక పుట్టినరోజు ఉందనీ, ఎప్పుడో మరణం తప్పదనీ, అలాగే తన తక్కిన అలస్నేహితులు, బంధువులూ వదిలి వెళ్ళిపోతారనీ బాధపడుతుంది. గాలిని చూస్తే అల అల్లల్లాడిపోతుంది. గాలి తనను అంతం చెయ్యటానికే వచ్చిందనుకుంటుంది.

అదే అలకు తను అల కాదనీ, నీరు అనీ తెలిస్తే దాని ఆలోచన ఎలా ఉంటుంది? దాని దృక్కోణం మారుతుంది. తను ఒక చిన్న అలను, గట్టిగా గాలివీస్తే రాలిపోతాను, ఒడ్డుకు వెళితే చనిపోతాను అనుకునే అల – నేను చిన్న అలను కాదు, మొత్తం సముద్రానికే నీరుగా అధిష్ఠానాన్ని అని అర్థం చేసుకుంటుంది. ఎంత పెద్ద మార్పో చూడండి. చిన్న అల ఎక్కడ, పెద్ద సముద్రం ఎక్కడ? ఎప్పుడైతే రెండింటిలోనూ ఉన్నది నీరే, ఆ నీరుని నేనే అని అల తెలుసుకుంటుందో, అప్పుడు దానికి ప్రాణభయం ఉండదు. గాలిని చూస్తే భయం వేయదు. గాలివల్లే తనకు ఈ నామం, రూపం వచ్చాయని, అవి పోయినా తను నీరుగా శాశ్వతమనీ తెలుసుకుంటుంది. జ్ఞానం పొందిన అల ఆలోచన అలా ఉంటుంది. జ్ఞాని పరిస్థితి కూడా అలాగే ఉంటుంది.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః।**

నాకు చావు పుట్టుకలు లేవు. నేను సుషుప్తిలో వ్యవహారం నడపక పోయినా, నేను ఉన్నాను. **వ్యవహారం లేనంత మాత్రాన నేను లేనట్టు కాదు.** అలాగే ఈ స్థూలశరీరం లేకపోయినా, ఆత్మగా నేను ఉంటాను. అందువల్ల మరణభయం పోతుంది. అందువల్ల సర్గఃజితాః అన్నాడు కృష్ణపరమాత్మ. సంసారాన్ని జయించారు వారు. ఎవరు వారు?

**యేషాం మనః సామ్యే స్థితమ్** – ఎవరి మనస్సైతే సమదర్శనంలో నెలకొని ఉన్నదో వారు. అల ఒక్క క్షణం తను నీరు అని మర్చిపోయినా, ప్రాణభయం ఉంటుంది. అలాగే జ్ఞాని ఎప్పుడూ జ్ఞాననిష్ఠలో ఉండాలి; కాని వ్యవహారంలో ద్వైతంలో ఉండాలని చూశాము. ఎవరైనా నువ్వెవరు అని అడిగితే –

**స్థూలసూక్ష్మకారణశరీరాత్ వ్యతిరిక్తః పంచకోశాతీతః సన్ అవస్థాత్రయసాక్షీ సచ్చిదానంద స్వరూపః సన్ యస్తిష్ఠతి స ఆత్మా** – అని చెపితే, అడిగినవారు వెంటనే అక్కడినుంచి పారిపోతారు. అందువల్ల అందరూ చెప్పినట్టే నేను ఫలానా అని తన వివరాలు చెప్పాలి. అలా సమదర్శనం చేస్తే ఆ సమవస్తువు ఎలా ఉంటుంది?

**సమం బ్రహ్మ** – సమం అంటే అన్నింటిలోనూ అధిష్ఠానంగా ఉన్న బ్రహ్మ లేదా చైతన్యం. ఇంగ్లీషులో మన గురించి ఏదైనా చెప్పాలంటే **ఐ యామ్** అని మొదలుపెడతాం. ఐ యామ్ తర్వాత అనేక వివరాలు కలుపుతాము. కాని అన్నింటిలోనూ సమానంగా ఉన్నది ఏమిటి? ఐ యామ్. **ఐ అంటే చిత్ రూపం.** ఎందుకంటే చైతన్యం ఉన్న వస్తువే 'ఐ' అనగలదు. బల్ల ఐ అనలేదు. **యామ్ అంటే సత్ రూపం.** అంటే ఉనికి. ఐ యామ్ అంటే చిత్ రూపం, సత్ రూపం. అన్నింటికీ సమానంగా ఉన్నది సత్ చిత్. ఆ సమవస్తువును అంటే సత్ చిత్‌ను బ్రహ్మ అంటారు. ఈ చైతన్యం అన్నింటిలోనూ సర్వవ్యాపకంగా ఉంది. అలకు పరిమితి ఉంది కాని నీరుకు లేదు. ఎందుకంటే నీరు అన్ని అలల్లోనూ ఉంది. అలాగే మనస్సుకు దేశపరిమితి ఉంది, శరీరానికి దేశపరిమితి ఉంది,

కాని చైతన్యం అన్ని శరీరాల్లోనూ, అన్ని మనస్సులోనూ ఉంది. అటువంటి చైతన్యం ఎంత పెద్దది? అది బ్రహ్మ. బ్రహ్మ అంటే అనంతం. ఈ అనంతమైన బ్రహ్మ అన్నింటిలోనూ ఉంది. దాని స్వరూపం ఎలా ఉంది?

**నిర్దోషమ్** – ఆ బ్రహ్మ ఎప్పుడూ శుద్ధం. ఎప్పుడూ ఆనందస్వరూపం. ఈ నిత్యశుద్ధ ఆత్మను వదిలేసి అశాశ్వతమైన, అశుద్ధమైన శరీరాన్ని పట్టుకుని ఎందుకు ప్రాకులాడుతారు? జ్ఞాని అలా చేయటం లేదు.

**తస్మాద్ బ్రహ్మణి తే స్థితాః** – జ్ఞాని ఎప్పుడూ బ్రహ్మలో నెలకొని ఉంటాడు. జ్ఞాని తను సత్ చిత్ ఆనందబ్రహ్మ అని, తను నిత్యశుద్ధబుద్ధముక్తస్వరూపుడు అని తెలుసుకుంటాడు.

ఈ జ్ఞానం రెండు దశల్లో పొందుతాడని చూశాము. తను నేను మనశ్శరీరాలను కానని, శరీరంలో ఉండి శరీరానికి భిన్నంగా ఉన్న ఆత్మనని గ్రహిస్తాడు. తరువాత ఈ ఆత్మ సర్వవ్యాపకమైనదని, అందరిలోనూ ఉందని తెలుసుకుంటాడు. అందువల్ల ఎదుటివారిని శరీరంగా కాక, ఆత్మగా చూస్తాడు. వారు కూడా నామరూపాలున్న ఆత్మస్వరూపం అని అర్థం చేసుకుంటాడు. తను శుద్ధ ఆత్మ కాబట్టి, తక్కినవారు కూడా శుద్ధ ఆత్మ అని తెలుసుకుంటాడు. తను శుద్ధ ఆత్మ అని గ్రహించాక, అశుద్ధమైన శరీరం స్థాయికి రాదు. అందువల్ల బ్రహ్మనిష్ఠలో ఉంటాడు. శరీరానికి అవసరమైనంత వరకూ పోషణ చేస్తాడు కాని శరీరంతో మమేకం చెందదు.

శ్లో. 20 **న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య నోద్విజేత్ ప్రాప్య చాప్రియమ్ ।**
**స్థిరబుద్ధిరసమ్మూఢో బ్రహ్మవిద్బ్రహ్మణి స్థితః ॥**
న, ప్రహృష్యేత్, ప్రియమ్, ప్రాప్య, న, ఉద్విజేత్, ప్రాప్య, చ, అప్రియమ్,
స్థిరబుద్ధిః, అసమ్మూఢః, బ్రహ్మవిత్, బ్రహ్మణి, స్థితః ॥

| | | | |
|---|---|---|---|
| ప్రియమ్, ప్రాప్య | = ప్రియమును పొంది | అసమ్మూఢః | = మోహవివశుడు కానివాడును అగు |
| న, ప్రహృష్యేత్ | = పొంగిపోడు | | |
| చ | = అలాగే | బ్రహ్మవిత్ | = బ్రహ్మవేత్త |
| అప్రియమ్, ప్రాప్య | = అప్రియమును పొంది | బ్రహ్మణి | = పరబ్రహ్మమందు |
| న, ఉద్విజేత్ | = ఉద్వేగమునకు లోనుకాడు | స్థితః | = ఏకీభావస్థితుడైయుండును |
| స్థిరబుద్ధిః | = నిశ్చలమైన బుద్ధిగలవాడును | | |

**ప్రియం ప్రాప్య న ప్రహృష్యేత్, అప్రియం ప్రాప్య చ న ఉద్విజేత్,**
**(ఏవం) స్థిర-బుద్ధిః, అసమ్మూఢః, బ్రహ్మవిత్ బ్రహ్మణి స్థితః ।**

తా: ప్రియలాభములకు పొంగిపోనివాడును, అప్రియములు ఎదురైనప్పుడు కృంగిపోనివాడును, స్థిరమైన బుద్ధిగలవాడును, మోహవివశుడు కానివాడును అయిన బ్రహ్మవేత్త పరమాత్మయందు సదా ఏకీభావస్థితి యందుండును.

జ్ఞాని జ్ఞానం పొందాక కూడా అదే ప్రపంచంలో ఉండాలి. ఎందుకంటే జ్ఞాని జీవన్ముక్తిని పొందుతాడు. జీవన్ముక్తి అంటే ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందటం. అజ్ఞానికి ఏ సూత్రాలు ఉన్నాయో జీవన్ముక్తునికి కూడా అవే

సూత్రాలున్నాయి. ఏమిటవి? దేశ, కాల, ప్రారబ్ధాలు. ఈ మూడూ మన జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. దేశం అంటే మనచుట్టూ ఉన్న వాతావరణం, ప్రజలు. మనకు ఇష్టమున్నా లేకపోయినా వారితో కలిసి గడపక తప్పదు. రెండవది కాలం. మనకిష్టం ఉన్నా లేకపోయినా కాలం పరుగులు తీస్తూనే ఉంటుంది.

**దినయామిన్యౌ సాయంప్రాతః శిశిరవసంతౌ పునరాయాతః**

**కాలః క్రీడతి గచ్ఛత్యాయుః తదపి న ముంచత్యాశావాయుః** – భజగోవిందమ్

పగలు, సాయంత్రం అవుతుంది; శిశిర, వసంత ఋతువులు వస్తూనే ఉంటాయి; వయస్సుమీద పడతూ ఉంటుంది. కీళ్ళనెప్పులు మొదలవుతాయి; జుట్టు తెల్లబడుతుంది.

మూడవ అంశం ప్రారబ్ధం. దేశకాలాలు ఇద్దరు వ్యక్తులకు ఒకటే అయినా వారి పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఒకే ఊర్లో, ఒకే ఇంట్లో, ఒకే వయస్సువారున్నా ఒకరు ఉత్సాహంతో చిందులు తొక్కుతుంటే, ఇంకొకరు లేచి కూర్చోటానికి కూడా కష్టపడతారు. ఎందుకు? దానికి ఒకటే కారణం. అది వారి ప్రారబ్ధకర్మ.

అందువల్ల జ్ఞాని కూడా ఈ మూడింటినీ తప్పించుకోలేడు. జ్ఞాని కూడా జీవితంలో ఒడిదుడుకులను భరించక తప్పదు. అలాంటప్పుడు జ్ఞానం పొంది ఏమిటి లాభం అనవచ్చు. పరిస్థితి ఒకటే అయినా దానికి స్పందించే విషయంలో భేదం ఉంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. **జ్ఞానం పరిస్థితిని మార్చదు కాని జ్ఞాని క్లిష్టపరిస్థితులను ఎదుర్కొనే ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంది.** ఈ సమత్వమే ఆత్మజ్ఞానంయొక్క ఫలం.

**ప్రియం ప్రాప్య** – ప్రారబ్ధం బాగున్నప్పుడు మంచి జరుగుతుంది. కాని జ్ఞాని వాటివల్ల పొంగిపోడు. ఈ అనుభవాలన్నీ దేశకాల ప్రారబ్ధాలవల్ల కలుగుతాయని, అవి వచ్చిపోయేవనీ తెలుసుకుంటాడు. జ్ఞాని వాటిని మెచ్చుకోడని కాదు అర్థం. అతను వాటికి పొంగిపోడు. ఏమిటి రెండింటికీ మధ్య తేడా? మంచి జరిగితే అతను ఆనందిస్తాడు, కాని ఆనందంలోనే మునిగిపోడు. అందులో మమేకం చెందితే, ఆ ఆనందం పోగానే శూన్యం ఏర్పడుతుంది. జ్ఞానికి ఆనందం ఉన్నా, లేకపోయినా తేడా అనిపించదు.

**ఆపూర్యమాణమచలప్రతిష్ఠం సముద్రమాపః ప్రవిశంతి యద్వత్ ।**

**తద్వత్ కామా యం ప్రవిశంతి సర్వే స శాంతిమాప్నోతి న కామకామీ ॥** – 2.70

సముద్రంలో నీరు పెరుగుతూ, తరుగుతూ ఉంటుంది. ఎండాకాలంలో నీరు ఆవిరైపోతుంది. వానాకాలంలో నదులు వచ్చి కలుస్తూంటాయి. నీరు ఆవిరైనా, నీరు వచ్చి కలిసినా సముద్రం ఎప్పటికీ పూర్ణంగానే ఉంటుంది.

**న ప్రహృష్యేత్ (ప్రియం ప్రాప్య)** – అందువల్ల జ్ఞాని మంచి జరిగినా పొంగిపోడు. ఇదే సూత్రాన్ని అప్రియానికి వర్ణిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**అప్రియం ప్రాప్య న ఉద్విజేత్** – మంచి జరిగినా పొంగిపోడు, చెడు జరిగినా కృంగిపోడు. దీనికి గొప్ప ఉదాహరణ శ్రీరాముడు. ఒకరోజు పట్టాభిషేకం చేస్తారనే వార్త వచ్చింది. శ్రీరాముడు విన్నాడు, పొంగిపోలేదు. మర్నాడు పట్టాభిషేకం చేయటం లేదు సరికదా, వనవాసం చేయాలన్నారు. దానికీ కృంగిపోలేదు. ఊరు ఊరంతా అట్టుడికి పోయింది కాని అసలైన వ్యక్తి చెక్కుచెదరలేదు.

**న వనం గన్తుకామస్య త్యజతశ్చ వసుంధరామ్ ।**
**సర్వలోకాతిగస్యేవ లక్ష్యతే చిత్తవిక్రియః ॥** – రామాయణం అయోధ్య. 19.33

అడవిలోకి వెళ్ళాలన్నా కూడా రాముడు సమత్వబుద్ధి చూపాడు అంటున్నారు వాల్మీకి మహర్షి. లక్ష్మణుడు మండిపడ్డాడు. తండ్రి అని కూడా చూడకుండా తండ్రిని దుర్భాషలాడాడు. అయోధ్యా నగరాన్ని మట్టుపట్టించి నిన్ను రాజుని చేస్తానన్నాడు. నగరమే లేకపోయాక, దేనికి రాజవుతాడు రాముడు? అందువల్లనే కోపంలో ఏం మాట్లాడుతున్నామో మనకు తెలియదు. అప్పుడు రాముడు ప్రారబ్ధకర్మ గురించి చెబుతాడు. మార్చలేని పరిస్థితిని ప్రారబ్ధంగా వివరించాడు శ్రీరాముడు.

**పరిస్థితిని మార్చలేమని గ్రహించినప్పుడు, మార్చలేని పరిస్థితిని మార్చటానికి ప్రయత్నించే బదులు మన గుండె దిటవు చేసుకునే ప్రయత్నం చేయాలి.** ఏ విధంగా చూసినా మన ప్రయత్నం కావాలి. మార్చగలిగే పరిస్థితి అయితే, పరిస్థితిని మార్చటానికి శ్రమపడాలి; మార్చలేని పరిస్థితి అయితే మన మనస్సును గట్టిపరుచుకునేందుకు శ్రమపడాలి. బాధపడి కృంగిపోవటంవల్ల పరిస్థితి మెరుగుపరచలేము; కోపం తెచ్చుకున్నా పరిస్థితిని మెరుగుపరచలేము. అందువల్ల జ్ఞానికి ఎటువంటి పరిస్థితినన్నా ఎదుర్కొనే ధైర్యం ఉంటుంది. ఎందుకు?

**బ్రహ్మవిత్** – అతను బ్రహ్మవిత్ కాబట్టి. బ్రహ్మవిత్ అంటే ఆత్మవిత్. ఆత్మవిత్ అంటే ఆత్మ జ్ఞానం పొందినవ్యక్తి. అతనికి ఎటువంటి ఆత్మజ్ఞానం ఉంది? కేవలం జ్ఞానం పొందితే చాలదు; ఆ జ్ఞాననిష్ఠలో నెలకొని ఉండాలి. కొందరు సంవత్సరాల తరబడి వేదాంతం నేర్చుకుంటున్నా కూడా క్లిష్టపరిస్థితి ఎదురైనప్పుడు 'నాకే ఎందుకు?' అన్న ప్రశ్న వెంటనే తన్నుకు వచ్చేస్తుంది. ఏదైనా క్లిష్టపరిస్థితి వస్తే, అది నావల్లే వచ్చింది, నేను ఈ జన్మలో చేసిన పాపంవల్లనో, లేదంటే కిందటి జన్మలో చేసిన పాపంవల్లనో వచ్చింది ఇప్పటి దుఃఖం పూర్వ కర్మఫలం అని అనుకోవాలని 108574 సార్లు వల్లెవేస్తారు. కర్మ సిద్ధాంతం అద్భుతంగా ఉంది, బాగా అర్థమయింది అని తల ఊపుతారు, కాని సమస్య రాగానే బెంబేలెత్తి పోతారు. నాకే ఎందుకు అనేస్తారు. నాకే ఎందుకు ప్రశ్న ఉదయించకపోతే, ఆత్మజ్ఞాన నిష్ఠలో ఉన్నట్టు అర్థం. అలా ఉండకపోతే, దాన్ని ఎదుర్కోవటానికి రెండు రకాలుగా ప్రయత్నం చేయాలి. ఏమిటవి? మార్చగలిగిన పరిస్థితి అయితే మార్చటానికి ప్రయత్నం చేయాలి; మార్చలేని పరిస్థితి అయితే దాన్ని స్వీకరించటానికి గుండె దిటవు చేసుకోవాలి.

అందువల్ల కేవలం జ్ఞానం పొందితే చాలదు. ఆ జ్ఞానంలో దృఢంగా నెలకొని ఉండాలి. కర్మ సిద్ధాంతం జీర్ణించుకో గలగాలి.

**స్థిరబుద్ధిః** – జ్ఞానంలో నెలకొని ఉండాలని కృష్ణపరమాత్మ చెబుతున్నాడు. బుద్ధి అంటే జ్ఞానం. స్థిర అంటే నిస్సంశయం. స్థిరబుద్ధిః అంటే నిస్సంశయ జ్ఞానం. నేను శరీరానికి భిన్నంగా ఉన్న ఆత్మను. ఈ జ్ఞానంలో నేను నెలకొని ఉన్నానా అని మనను మనం ప్రశ్నించుకోవాలి. ఎదుటివారికి నచ్చచెప్పనవసరం లేదు, మనం అర్థం చేసుకుని, నమ్మితే చాలు. ఒకవేళ నేను ఇంకా నమ్మలేకపోతే ఏం చేయాలి? ఆ నమ్మకం కలిగేదాకా వేదాంతశ్రవణం చేయాలి. ఎన్నాళ్ళు శ్రవణం చేయాలి?

నేను శరీరానికి భిన్నంగా ఉన్న ఆత్మను అనే నమ్మకం కలిగేదాకా చేయాలి. ఈ జన్మలో నమ్మలేకపోతే, వచ్చే జన్మలో కూడా శ్రవణం చేయాల్సి ఉంటుంది. కాని నమ్మకం, నిస్సంశయజ్ఞానం ముఖ్యం.

కర్మ సిద్ధాంతాన్ని నమ్మాలి. ఏదీ పొరపాటుగా, అనుకోకుండా జరగదు. ప్రతిదీ కర్మ సిద్ధాంతంవల్లనే జరుగుతుంది. ఒకవేళ ఏదైనా అనుభవం నాకు అన్యాయంగా అనిపించినా, అది నిజంగా అన్యాయం కాదు. నాకు పూర్తి విషయం తెలియదు. ఈ జన్మలో ఏం చేశాను అనేదే నాకు సరిగ్గా తెలియదు, అలాంటప్పుడు ముందు జన్మల్లో ఏం చేశానో ఎలా తెలుస్తుంది? దాని గురించిన పూర్తి అవగాహన లేకుండా న్యాయాన్యాయాల గురించి మాట్లాడే అధికారం నాకెక్కడ ఉంది?

జ్ఞానులు కూడా అనేక అనారోగ్యాలు అనుభవించారు. కొంతమంది నేను గీతాబోధకు వెళుతున్నాను, అందువల్ల నాకు జలుబు చేయదు అనుకుంటారు. అది పొరపాటు. అలాంటి ఆలోచన ఉంటే, ఆ ఆలోచనను మానుకుంటే మంచిది. **జ్ఞానం శారీరక బాధను తప్పించదు, శారీరక బాధను తట్టుకునే ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంది.** ఈ విషయం మర్చిపోవద్దు. రమణమహర్షి, రామకృష్ణ పరమహంస వంటి జ్ఞానులు కూడా శారీరక బాధలను అనుభవించారు.

**శ్రవణేన బ్రహ్మవిత్ భవతి మననేన స్థిరబుద్ధిః భవతి**

శ్రవణం చేస్తే జ్ఞానం పొందుతాము; మననం చేస్తే నిస్సంశయ జ్ఞానం కలుగుతుంది. శ్రవణంలో గురువు చెప్పింది వింటాము; మననంలో మనకు కలిగే సందేహాలను తీర్చుకుంటాము. వేదాంతం ఎన్ని ప్రశ్నలైనా వెయ్యటానికి అవకాశం ఇస్తుంది. అందువల్లనే గీత 18 అధ్యాయాలు నడిచింది. అన్నీ అయ్యాక నష్టో మోహః స్మృతిర్లబ్ధా అంటాడు అర్జునుడు. దీన్ని స్థిరబుద్ధి అంటారు.

నిస్సంశయజ్ఞానం పొందినా కూడా ఇంకొక సమస్య ఉంది. మన వాసనలు తరువాత పోవు. ఆ జ్ఞాననిష్ఠలో నెలకొని ఉండాలి. దాన్ని నిదిధ్యాసనం అంటారు. దాని గురించి వివరంగా తర్వాత వచ్చే అధ్యాయంలో చూస్తాము.

**అసమ్మూఢః** – మనకు కలిగిన నిస్సంశయ జ్ఞానంలో నెలకొని ఉండటాన్ని అసమ్మూఢః అంటారు. అంటే విపరీత భావనలు లేకుండా ఉండాలి.

ఆ విధంగా మూడు దశలు చెప్పబడ్డాయి. శ్రవణం ద్వారా **బ్రహ్మవిత్** అవుతాడు; మననం ద్వారా **స్థిరబుద్ధి** పొందుతాడు; నిదిధ్యాసనం ద్వారా **అసమ్మూఢుడు** అవుతాడు. అంటే శ్రవణం ద్వారా జ్ఞానం పొంది, మననం ద్వారా సందేహాలను తీర్చుకుని, నిదిధ్యాసనం ద్వారా వాసనలను పారద్రోలి, జ్ఞాననిష్ఠలో ఉంటాడు. అటువంటి జ్ఞాని పొందే లాభం ఏమిటి?

**న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య నోద్విజేత్ ప్రాప్య చాప్రియమ్**

**బ్రహ్మణి స్థితః** – అటువంటి జ్ఞానిని జీవన్ముక్తుడు, లేదా రెండవ అధ్యాయంలో వర్ణించిన స్థితప్రజ్ఞుడు అంటారు.

శ్లో. 21 **బాహ్యస్పర్శేష్వసక్తాత్మా విందత్యాత్మని యత్సుఖమ్ ।**
**స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖమక్షయమశ్నుతే ॥**
బాహ్యస్పర్శేషు, అసక్తాత్మా, విందతి, ఆత్మని, యత్, సుఖమ్,
సః, బ్రహ్మయోగయుక్తాత్మా, సుఖమ్, అక్షయమ్, అశ్నుతే ॥

| | | | |
|---|---|---|---|
| బాహ్యస్పర్శేషు | = లౌకిక విషయములందు | విందతి | = పొందును |
| అసక్తాత్మా | = అనాసక్తమైన అంతఃకరణము గల సాధకుడు | సః | = (తరువాత) అతడు |
| ఆత్మని | = ఆత్మయందు (స్థిరమైన) | బ్రహ్మయోగ యుక్తాత్మా | = పరమాత్మ ధ్యానయోగమందు అభిన్న భావస్థితుడై |
| యత్, సుఖమ్ | = ఎటువంటి జ్ఞానజనితమైన సాత్త్వికానందము కలదో | అక్షయమ్, సుఖమ్ | = అక్షయానందమును |
| (తత్) | = దానిని | అశ్నుతే | = పొందును (అనుభవించును) |

**బాహ్యస్పర్శేషు అసక్తాత్మా ఆత్మని యత్ సుఖం విన్దతి ।**
**సః బ్రహ్మయోగయుక్తాత్మా అక్షయం సుఖమ్ అశ్నుతే ॥**

తా: ప్రాపంచిక విషయాలందు అనాసక్తమైన అంతఃకరణముగల సాధకుడు ఆత్మస్థితధ్యానజనితమైన సాత్త్వికాత్మానందమును పొందును. తరువాత, అతడు పరమాత్మ ధ్యానయోగమందు అభిన్నభావస్థితుడై అక్షయానందమును అనుభవించును.

ఈ జ్ఞానం పొందటంవల్ల జ్ఞానిలో కలిగే మార్పును వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. అవి సర్వత్రసమదర్శనం, జీవన్ముక్తి, స్థితప్రజ్ఞత్వం. వాటిని వరుసగా 18, 19, 20 శ్లోకాల్లో చూస్తూ వచ్చాము. ఇప్పుడు ఈ శ్లోకంలో ఆనందస్వరూపం చూస్తాము.

జ్ఞాని ఆత్మానందాన్ని పొందుతాడు. ఒక ఆశ్రమంలో ఒకప్పుడు నీటికి ఇబ్బందిగా ఉండేది. వారు లక్షలు ఖర్చుపెట్టి బయటనుంచి పైపులైను వేయించుకున్నా, ఫలితం లేకపోయింది. నీరు తెప్పించుకునేవారు. ఒకరోజు ఆ ఆశ్రమానికి ఒక ఇంజనీరు వచ్చాడు. నీరు భూమిలో ఎక్కడ ఉందో చూపించే ఒక యంత్రం ఉంది అతని దగ్గర. దానితో చూస్తే, ఆశ్రమం ముందు వాకిట్లోనే నీటివనరు ఉందని తెలిసింది. అక్కడి స్వామీజీ ఆనందానికి అవధులు లేవు. అంతవరకూ ఆశ్రమంలో నీరు లేదా? ఉంది, కాని ఉందని తెలియలేదు. అందువల్ల బాహ్యప్రపంచంమీద ఆధారపడాల్సి వచ్చింది. దానివల్ల పడే బాధలు ఎదుర్కోవాల్సి వచ్చింది.

అలా మనలోనే ఆనందమనే నిధి ఉంది. అది మన స్వరూపం.

**ఆనందం బ్రహ్మణో విద్వాన్‌। న బిభేతి కదాచనేతి** – తైత్తిరీయమ్

జ్ఞానికి తన పూర్ణత్వాన్ని ఎలా అనుభవించాలో తెలుసు. అజ్ఞానులు బయట ప్రపంచంమీద ఆధారపడితే, జ్ఞాని తనమీదే ఆధారపడతాడు. జ్ఞాని బయట వస్తువులను ద్వేషించడు. బయట వస్తువులవల్ల దొరికే ఆనందాలన్నీ ఆత్మానందంలో ఉన్నాయంటాడు కృష్ణపరమాత్మ.

**యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే ।**
**తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥** – 2.46

అన్ని అనాత్మ ఆనందాలనూ కలిపినా కూడా వాటన్నిటికన్నా శ్రేష్ఠం ఆత్మానందం. అనాత్మ అంటే విషయవస్తువులు. అవి పరిమితమైనవి. పరిమితమైనవి + పరిమితమైనవి = పరిమితమైనవి. అందువల్ల పరిమితమైన ఆనందాలు ఎన్ని కలిపినా కూడా అవన్నీ కూడా పరిమితమైనవే. వాటన్నిటికన్నా శ్రేష్ఠం ఆత్మానందం.

**స బ్రహ్మయోగయుక్తాత్మా** – బ్రహ్మయోగం అంటే బ్రహ్మజ్ఞానం. బ్రహ్మజ్ఞానం అంటే నేను బ్రహ్మను అనే జ్ఞానం. ఆత్మ అంటే ఇక్కడ మనస్సు. మనం యు.పి.ఎస్. వాడతాం. అంటే అన్ఇంటరప్టెడ్ పవర్ సప్లై కాని జ్ఞానికి యు.ఎ.ఎస్. ఉంటుంది. అంటే అన్ఇంటరప్టెడ్ ఆనంద సప్లై. అది ఆత్మకు కనెక్ట్ చేయబడి ఉంటుంది. దాన్ని 24 గంటలూ వాడతాడని కాదు అర్థం. అనాత్మ ఉంటే, దాన్ని అనుభవిస్తాడు. మనుష్యులు ఉంటే వారితో గడుపుతాడు; లేకపోతే వారు లేరని బాధపడడు. యు.ఎ.ఎస్.కు కనెక్ట్ అవుతాడు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః.** – 2–55

**నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన ।**
**న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః ॥** – 3.18

అటువంటి జీవితం ఎంత అద్భుతంగా ఉంటుందో చూడండి!

**అక్షయం సుఖమ్ అశ్నుతే** – పూర్ణత్వం పొందుతాడు. మహాభారతంలో ద్రౌపది దగ్గర అక్షయపాత్ర ఉందని విన్నాము. అలా జ్ఞానికి ఆత్మ అనే అక్షయపాత్ర ఉంది. అది ఎప్పుడూ ఆనందాన్ని ఇస్తూనే ఉంటుంది. అన్ని లౌకిక ఆనందాలూ ఈ ఆత్మానందంవల్ల వస్తాయని అంటాడు కృష్ణపరమాత్మ. తినే ఆనందం, సంగీతం వినే ఆనందం అన్నీ కలుగుతాయి. కొంతమంది సన్న్యాసులను చూసి జాలిపడతారు, వారికి లౌకిక సుఖాలు లేవనుకుని. కాని ఆత్మానందం ఉంటే, లౌకిక ఆనందం పొందడని కాదు అర్థం. నిజానికి అజ్ఞాని ఎన్ని ఆనందాలు పొందినా ఇంకా ఏదో కొరత ఉంటూనే ఉంటుంది.

**బాహ్యస్పర్శేష్వసక్తాత్మా** – ఈ జ్ఞాని బాహ్యసుఖాలమీద ఆసక్తి చూపడు. జాగ్రత్తగా చూడండి! జ్ఞాని **వాటిని ద్వేషించడు**. ద్వేషం కూడా ఒక బలహీనతే. బంధం ఎలా బలహీనతో, ద్వేషం కూడా ఒక బలహీనతే. సన్న్యాసికి రుచికరమైన భిక్ష దొరికితే ఆనందిస్తాడు. అసక్తః అంటే వాటిమీద తపన ఉండదు. బాహ్యస్పర్శ అంటే విషయానందం; బాహ్యవస్తువులతో పొందే ఆనందం. అసక్త ఆత్మ. ఇక్కడ కూడా ఆత్మ అంటే మనస్సు. అసక్తః అంటే తపన లేకపోవటం. ఈ జ్ఞానికి బాహ్యవిషయాలమీద ఆసక్తిలేదు. అతను ఆత్మానందం పొందుతాడు. అది అక్షయం.

శ్లో. 22 **యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే ।**
**ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః ॥**
యే, హి, సంస్పర్శజాః, భోగాః, దుఃఖయోనయః, ఏవ, తే,
ఆద్యంతవంతః, కౌంతేయ, న, తేషు, రమతే, బుధః ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ అర్జునా! | హి | = నిస్సందేహముగా |
| యే, | = విషయేంద్రియసంయోగము | దుఃఖయోనయః, ఏవ | = దుఃఖహేతువులే |
| సంస్పర్శజాః | వల్ల ఉత్పన్నములగు | ఆద్యంతవంతః | = (అవి) ఆదియు, అంతము |
| భోగాః | భోగములు ఏవి గలవో | | గలవి (అనిత్యములు) |
| తే | = (భోగలాలసులకు సుఖములుగ | బుధః | = వివేకి |
| | భాసించు) ఆ భోగములు | తేషు | = వాటియందు |
| | అన్నియు | న, రమతే | = రమింపదు |

**కౌన్తేయ! యే హి సంస్పర్శజాః భోగాః తే దుఃఖయోనయః ఆద్యన్తవన్తః ఏవ ।**
**తేషు బుధః న రమతే ॥**

తా: విషయేంద్రియ సంయోగమువల్ల ఉత్పన్నములగు భోగములన్నియును భోగలాలసులకు సుఖములుగా భాసించినను అవి నిస్సందేహముగా దుఃఖహేతువులే. ఆద్యంతములుగలవి. అంటే అనిత్యములు. కావున, ఓ అర్జునా! వివేకి వాటియందు ఆసక్తుడు కాడు.

**3. జ్ఞానసాధన, ఫలం శ్లోకాలు 22-26 –** శ్లోకాలు 13 నుంచి 21 వరకూ జ్ఞానయోగం గురించి చర్చించాడు కృష్ణపరమాత్మ. జ్ఞానయోగం ఈ అధ్యాయంయొక్క సారాంశమనీ, జ్ఞానయోగాన్ని ఇక్కడ సన్న్యాసయోగం అంటారనీ, అందువల్ల ఈ అధ్యాయానికి సన్న్యాసయోగం అనే పేరు వచ్చిందనీ చూశాము.

ఈ శ్లోకంనుంచీ రెండు అంశాలు చర్చించబోతున్నాడు కృష్ణపరమాత్మ. అవి జ్ఞానసాధన, జ్ఞానఫలం. గీతలో అనేక సందర్భాలలో అనేక మానసిక సాధనలు చర్చించబడతాయి. ఈ శ్లోకంలోనూ, తరువాత వచ్చే శ్లోకంలోనూ మానసిక సంసిద్ధత గురించీ, రాగద్వేషాలను అదుపులో పెట్టుకునే పద్ధతి గురించీ చెబుతున్నాడు.

ఈ శ్లోకంలో మనిషికి ఉన్న ప్రాథమిక సమస్య గురించి చర్చిస్తున్నాడు. మనిషి బంధంలో కూరుకుపోతున్నాడు. దాన్నే సంసారం అంటాము. బంధవిముక్తి పొందాలనే తీవ్రమైన కోరిక ఉండాలి మనిషికి.

**సంస్పర్శజా భోగాః** – సంయోగంవల్ల ఏర్పడిన ఆనందం. సంస్పర్శ అంటే సంయోగం; జః అంటే దాన్నించి పుట్టిన; భోగా అంటే ఆనందం. రెండు కలవటంవల్ల కలిగిన ఆనందం. ఏ రెండూ? ఇంద్రియాలూ, విషయవస్తువులూ. ఇంద్రియాలు ఐదు – కళ్ళు, చెవులు, ముక్కు, నోరు, చర్మం. ఈ ఐదు ఇంద్రియాల ద్వారా ప్రపంచాన్ని చూస్తాము. అందువల్ల విషయ వస్తువులు కూడా ఐదు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు. కేవలం విషయవస్తువులు ఉంటే ఆనందం రాదు; అలాగే కేవలం ఇంద్రియాలు ఉన్నా ఆనందం కలగదు. ఈ రెండూ ఒకదానితో ఒకటి కలవాలి. ఈ ప్రపంచం మొత్తం సంస్పర్శజా భోగాన్ని ఇస్తుంది.

విషయవస్తువులు అంటే కేవలం వస్తువులే కాదు – మనుష్యులు, పరిస్థితులు కూడా వస్తాయి. మనకు నచ్చిన మనుష్యులతో గడిపితే ఆనందం కలుగుతుంది. కృష్ణపరమాత్మ ఈ ఆనందం అద్భుతమే కాని, దాన్ని వెన్నంటే దుఃఖం కూడా ఉంటుందంటున్నాడు. అందమైన గులాబీని వెన్నంటి ముళ్ళు ఉన్నట్టే, ప్రతి భోగం వెనకా శోకం కూడా ఉంటుంది.

ఉపనిషత్తుల్లో చూస్తాము – ప్రతి కర్మఫలంలో మూడు బాధలుంటాయి. అవి – కోరుకున్న వస్తువును పొందటంలో ప్రయాస; పొందిన వస్తువును పదికాలాల పాటు నిలబెట్టుకోవాలనే తపన, దానికి పడే కష్టం; అది పోతే బాధపడటం. మూడూ ఒకదాన్ని మించి ఒకటి బాధాకరం. పొందటం దుఃఖం అయితే, నిలబెట్టుకోవటం దుఃఖతరం అయితే, పోగొట్టుకోవటం దుఃఖతమం. **ఆర్జనే దుఃఖం, రక్షణే దుఃఖతరం, నాశే దుఃఖతమం.**

**దుఃఖయోనయ ఏవ తే** – అన్ని విషయ ఆనందాలూ దుఃఖమిశ్రితత్వం అంటున్నాడు కృష్ణపరమాత్మ. శుద్ధమైన ఆనందం అంటూ ఏదీలేదు. ప్రతి ఒక్క ఆనందం కూడా ఒక నాణెంలాంటిది. నాణేనికి రెండు వైపులు ఉన్నట్టే ప్రతి సుఖానికీ, దుఃఖం కూడా మిశ్రితమై ఉంటుంది. దీనికి కారణం ఏమిటి?

**ఆద్యంతవంతః కౌంతేయ** – కృష్ణపరమాత్మ దానికి కారణం కూడా ఇస్తున్నాడు. విషయవస్తువులమీద ఆనందాలన్నిటికీ ఒక ప్రారంభం ఉంది – అది ఒక వ్యక్తితో అనుబంధం కాని, ఒక వస్తువును పొందటం కాని. అందువల్ల దానికి ఆది ఉంది. ప్రకృతినియమం ఏమిటి? ఆరంభం ఉన్న ప్రతి దానికీ అంతం కూడా ఉంటుంది. ఆది అంతవంతః. ఒక వస్తువు రావటం ఆనందదాయకమైతే, అది వెళ్ళిపోతే దుఃఖాన్ని కలుగజేస్తుంది. ఒకవేళ వెళ్ళటం ఆనందదాయకమైతే, రావటం దుఃఖాన్ని కలుగజేస్తుంది. **కొంతమంది మనుష్యులు వచ్చి ఆనందాన్ని కలుగజేస్తారు; కొంతమంది మనుష్యులు వెళ్ళి ఆనందాన్ని కలుగజేస్తారు.**

చిన్న సూత్రం అంతే! ప్రతి వస్తువుకూ రాకపోకలు ఉన్నాయి. రాక ఆనందం కలిగిస్తే, పోక దుఃఖాన్ని కలిగిస్తుంది; లేదా రావటం దుఃఖాన్ని కలిగిస్తే, అది వెళ్ళటం ఆనందాన్ని కలిగిస్తుంది. ఆది అంతవంతః కౌంతేయ అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఈ ప్రాథమిక సూత్రాన్ని గ్రహించమంటున్నాడు. ఏమిటది? వస్తువులు, మనుష్యులు మనకు కలుగజేసే ఆనందం వెన్నంటి దుఃఖం ఉంటుంది. అంటే ప్రతి ఆనందం **దుఃఖమిశ్రితత్వం**.

సమస్య ఏమిటి? నాకు ఒక వస్తువు కాని మనిషి కాని ఆనందాన్ని, దుఃఖాన్ని కలుగజేస్తున్నారు. నేను ఆ వస్తువును పొందితే నాకు ఆనందం కలుగుతోంది. బాగానే వుంది. కాని ఆ వస్తువు పోతే దుఃఖం కలుగుతుంది. ఆ దుఃఖాన్ని నేను తట్టుకోలేకుండా ఉన్నాను. నా మనస్సు దానికి సిద్ధంగా లేదు. నా మనస్సు సిద్ధంగా లేదు కాబట్టి అది పోతే నాకు బాధ కలుగుతున్నది.

ఈ బాధ పోవాలంటే ఏం చేయాలి? వస్తువు పొందితే కలిగే ఆనందం, అది పోతే పోతోంది కాబట్టి అది పొందకుండా ఉంటే సరిపోతుంది కదా అనుకుంటారు కొందరు. కొన్నాళ్ళు ఆనందం పొంది, ఆ తరువాత దుఃఖం అనుభవించకుండా, అసలు ఆ వస్తువునే పొందకుండా ఉంటే సరిపోదా? కాని అలా అని ఏమీ పొందకుండా ఉంటే మనస్సు శూన్యంగా ఉంటుంది. ఒంటరితనం బాధిస్తుంది, ఏకాకిగా అనిపిస్తుంది.

ఏ విధంగా చూసినా బాధే. అది పొందితే పోతుందనే బాధ, పొందకపోతే ఏమీ లేదనే బాధ. పని ఎక్కువ ఉన్నా బాధే, పనిలేకపోయినా బాధే! వస్తువులు ఉన్నా బాధే, లేకపోయినా బాధే!

ఇప్పుడు రెండు సమస్యలు ఉన్నాయి. వస్తువు పొందితే సుఖం+దుఃఖం కలుగుతున్నాయి. పొందకపోతే శూన్యతాభావం ఏర్పడుతున్నది. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలి? దీనికి రెండు మార్గాలున్నాయి.

1. **పూర్ణత్వం పెంపొందించుకోవటం** – మనుష్యులకు ఉన్న సమస్యను శంకరులవారు ఒక్క వాక్యంలో చెప్పారు: **అహం యేషాం మమ ఏతే** – వీరు నావారు, నేను వారివారిని. ఈ బాహ్యమైన బంధాల జోలికి పోకుండా నాలోనే పూర్ణత్వముందని అర్థం చేసుకోవటం. **ఆత్మన్యేవాత్మనా తుష్టః.** జ్ఞాని ఆత్మలోనే రమిస్తాడు. బాహ్యవస్తువులు ఉన్నా లేకపోయినా చలించడు. అందువల్ల బాహ్యవస్తువులను వదిలేసి, నాలోనే పూర్ణత్వం వెతుక్కోవటం మొదటి మార్గం.

2. **ఆత్మస్థైర్యం పెంచుకోవటం** – నేను నా వారిని వదులుకోలేను; నా వస్తువులను వదులుకోలేను అంటే కృష్ణపరమాత్మ, అలా అయితే వాటి వెన్నంటి వుండే దుఃఖాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోమంటున్నాడు. పిల్లలు కావాలంటే మంచిదే! కాని వారు అల్లరి చేసినా, చేయకపోయినా; వృద్ధిలోకి వచ్చినా, రాకపోయినా; మాట విన్నా, వినకపోయినా తట్టుకునే మానసిక స్థైర్యం ఉండాలి.

వస్తువులను వదులుకుంటే పూర్ణత్వం పెంపొందించుకోవటం; కావాలి అనుకుంటే ఆత్మస్థైర్యం పెంచుకోవటం. ఈ రెండు మార్గాలే ఉన్నాయి ఎవరికైనా. నేను రెండూ పాటించను అంటే సుఖదుఃఖాల ఆటుపోట్లను తట్టుకుంటూ ఉండాలి. సరే పూర్ణత్వం ఎలా పొందాలి, లేదా ఆత్మస్థైర్యం ఎలా పొందాలి అంటే రెండింటికీ ఒకటే మార్గముంది. అది **ఆత్మజ్ఞానం**. అదీ దాని గొప్పతనం. ఆత్మజ్ఞానం ఒకేసారి రెండూ కలుగజేస్తుంది. జ్ఞానం పొందాక, వస్తువులను వద్దనుకుంటే పూర్ణత్వాన్ని ఇస్తుంది; లేదూ వదులుకోను అంటే ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంది.

అజ్ఞానంలో ఉన్నంతసేపూ, ఒక వస్తువు ఉన్నా సమస్యే, లేకపోయినా సమస్యే. అదే జ్ఞానం పొందితే వస్తువు ఉన్నా బాధలేదు, లేకపోయినా బాధలేదు. ఎందుకంటే ప్రపంచం సుఖదుఃఖాల మేలుకలయిక అని తెలుసు.

**బుధః తేషు న రమతే** – జ్ఞాని ఎవరంటే ప్రపంచం ఇచ్చే సుఖాలకు పొంగిపోడు; దుఃఖాలకు కృంగిపోడు. ప్రపంచం దుఃఖమిశ్రితత్వం అని తెలుసు అతనికి.

శ్లో. 23 **శక్నోతీహైవ యః సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్ ।**
**కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః ॥**
శక్నోతి, ఇహ, ఏవ, యః, సోఢుమ్, ప్రాక్, శరీరవిమోక్షణాత్,
కామక్రోధోద్భవమ్, వేగమ్, సః, యుక్తః, సః, సుఖీ, నరః ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఏ సాధకుడు | సోఢుమ్ | = సహించుటకు |
| ఇహ | = ఈ జన్మయందు | శక్నోతి | = సమర్థుడగుచున్నాడో |
| శరీరవిమోక్షణాత్ | = శరీరమును | సః, నరః | = ఆ సాధకుడు |
| ప్రాక్, ఏవ | = విడువకముందే | యుక్తః | = నిజమైన యోగి |
| కామక్రోధోద్భవమ్, | = కామక్రోధాదులవల్ల | సః | = అతడే |
| వేగమ్ | కలిగిన ఉద్వేగమును | సుఖీ | = నిజమైన సుఖి |

**యః శరీరవిమోక్షణాత్ ప్రాక్ ఇహ కామక్రోధోద్భవం వేగం సోఢుం శక్నోతి, సః ।**
**నరః యుక్తః, సః సుఖీ (భవతి) ॥**

తా: ఈ శరీరమును విడువకముందే అంటే జీవించియుండగానే కామక్రోధాదుల ఉద్వేగములను అదుపులో నుంచుకొనగల సాధకుడే నిజమైన సుఖి, యోగి.

ముందు శ్లోకంలో మానసిక సంసిద్ధత గురించి చూశాము. ఈ శ్లోకంలో రాగద్వేషాలను అదుపులో పెట్టుకునే పద్ధతి గురించి చెబుతున్నాడు.

రాగద్వేషాలను కామక్రోధాలని కూడా అంటారు. రాగం అంటే కొన్ని వస్తువులమీద మమకారం; ద్వేషం అంటే కొన్ని వస్తువులను ఇష్టపడక పోవటం. వేదాంతం ప్రకారం రెండూ తప్పుడు ఆలోచననుంచి ఏర్పడినవే. ఒక వస్తువుమీద ఎప్పుడు రాగం ఏర్పడుతుంది? అది నాకు శాశ్వతమైన ఆనందం, భద్రతలను ఇస్తాయనే భావనవల్ల ఏర్పడుతుంది. కాని అది తప్పు. ఎందుకు? ముందు శ్లోకంలో చూశాము.

**ఆద్యంతవంతః కౌంతేయ**. ఏదీ శాశ్వతం కాదు; మారుతుంది. అలాగే ద్వేషం కూడా తప్పుడు ఆలోచనే. ప్రపంచం నిజంగా దుఃఖభూయిష్టమైతే ఆనందస్వరూపులైన జ్ఞానులు ఈ ప్రపంచంలో జీవించలేరు.

ఇంకో విధంగా చూసినా, ప్రపంచం నిజంగా దుఃఖభూయిష్టమైతే అందరూ సమానంగా దుఃఖంలో మునిగిపోవాలి. ఒక ఇంట్లోనే పాశ్చాత్యసంగీతం పెడితే పిల్లలు కేరింతలు కొడతారు; పెద్దవారు భరించలేరు. ఒకే సంగీతం ఒకరికి ఆనందం; ఇంకొకరికి దుఃఖం కలుగజేస్తోంది. అంటే ఆ ఆనందం, దుఃఖం వస్తువులో ఉందా, మనిషిలో ఉందా? వస్తువులో లేదు. వేదాంతం చెబుతున్నది – **మీరే ప్రపంచాన్ని ఆనందహేతువు చేస్తున్నారు; మీరే ప్రపంచాన్ని దుఃఖహేతువు చేస్తున్నారు**.

ఈ విషయం మనం గ్రహించనంతవరకూ, ప్రపంచాన్ని నిందిస్తూనే ఉంటాము. అంతేకాదు, ప్రపంచాన్ని మార్చటానికి ప్రయత్నిస్తాము. ప్రపంచాన్ని మనకు తగ్గట్టుగా ఎన్నడూ మార్చలేము. ఒకవేళ మార్చినా అది ఎప్పటికీ అలాగే ఉండదు. ఒకవేళ అన్నీ మనకు తగ్గట్టుగా ఉన్నా కూడా, మనకు ఎప్పటికీ భయమే. ఏదో చెడుదృష్టి పడుతోంది, ఈ ఉన్న ఆనందం పోతుందని భయపడతాము. ఆ చెడు దృష్టి తాకకుండా నల్లతాడో, తాయెత్తో కడతాము. అంటే దీని అర్థమేమిటి? ఈ ఆనందం శాశ్వతం కాదు, ఎప్పుడో అప్పుడు కరిగిపోతుందని మనకూ తెలుసు.

అందువల్ల సమస్య ఎక్కడ ఉంది? ప్రపంచంలో లేదు, మనలోనే ఉంది. మనమే రాగద్వేషాలను అదుపులో పెట్టుకోవాలి. మనం రాగద్వేషాలనే కళ్ళజోడుతో చూస్తే, ప్రపంచం మన ఊహలకు తగ్గట్టుగా ఉంటుంది. రాగద్వేషాలనే కళ్ళజోడు తీసి చూస్తే, ప్రపంచం ఉన్నదున్నట్టుగా ఉంటుంది. దేవుడు సృష్టించిన ప్రపంచంలా ఉంటుంది. దేవుని సృష్టిలో సుఖదుఃఖాలు లేవు. సూర్యోదయం ఆనందాన్నిస్తుందా, దుఃఖాన్నిస్తుందా? లేచి పనులు చేసుకునే వారికి ఆనందాన్నిస్తుంది, ఇంకా నిద్రపోదామనుకునేవారికి దుఃఖాన్నిస్తుంది. జ్ఞాని దానికి తన ఆనందాన్ని, దుఃఖాన్ని కలపడు. సూర్యోదయం, సూర్యాస్తమయం; చావు పుట్టుకలు; పెరుగుదల, తరుగుదల; బంధం, బంధ విముక్తి అన్నిటినీ సమదృష్టితో చూస్తాడు.

జీవసృష్టినుంచి ఈశ్వరసృష్టికి రమ్మంటుంది వేదాంతం. దాని తరువాత అసృష్టి అంటే సృష్టి లేకపోవటానికి రావాలి. చివరి దానికి రావటం కష్టం. దాని సంగతి తరువాత చూద్దామంటున్నాడు కృష్ణపరమాత్మ. జీవసృష్టి అంటే ప్రపంచాన్ని మనకళ్ళతో అంటే మన భావాలకు తగ్గట్టుగా చూడటం. ఈశ్వరదృష్టి అంటే ప్రపంచాన్ని ఉన్నదున్నట్టుగా చూడటం. **జీవసృష్టినుంచి ఈశ్వరసృష్టికి రమ్మంటున్నాడు కృష్ణపరమాత్మ.** అది కూడా అంత తేలిక కాదు. అందువల్ల కృష్ణపరమాత్మ జీవితమంతా రాగద్వేషాలను నియంత్రించటం నేర్చుకోవాలంటున్నాడు. ముందు అవి అదుపులో పెట్టుకుంటే వేదాంతం నేర్చుకోవటం తేలిక.

**శరీర విమోక్షణాత్ ప్రాక్** – శరీరం పడిపోయేలోపు అంటే మరణించేలోపు;

**శక్నోతి సోఢుమ్** – ఒక వ్యక్తి అదుపులో ఉంచుకోగలిగితే; వేటిని?

**కామక్రోధోద్భవం వేగమ్** – వేగం అంటే శక్తివంతమైన ప్రభావం. దేనివి? కామ, క్రోధాలవి. కృష్ణపరమాత్మ కామక్రోధాలను పూర్తిగా పారద్రోలమనటం లేదు; వాటిని నియంత్రించుకోమంటున్నాడు. మూడవ అధ్యాయంలో కూడా ఈ విషయాన్ని చర్చించాడు. కామక్రోధాలు ఉండి తీరతాయి. వాటిని ఎలా నియంత్రించాలో తెలియాలి. శరీరం అన్నాక చిన్నచిన్న అనారోగ్యాలు వస్తూనే ఉంటాయి. కాస్త వాతావరణంలో మార్పు వస్తేనే దగ్గు, జలుబు వస్తుంటాయి. శరీరం పూర్తి ఆరోగ్యంగా ఉండదు. ఆరోగ్యం అంటే అనారోగ్యం కలిగినా బాధించనంతగా ఉండి, జీవనయానం కొనసాగించగలిగేటట్టు చేసేది.

మనస్సు పరంగా చూస్తే కూడా అంతే. రాగద్వేషాలు వస్తూనే ఉంటాయి. కాని వాటికి మనం బానిస అవకుండా, వాటిని మనకు బానిసలుగా చేసుకోవాలి.

**స యుక్తః** – ఎవరైతే ఈ రాగద్వేషాలను మరణించేలోపు అదుపులో పెట్టుకోగలుగుతాడో అతన్ని యోగి అంటున్నాడు కృష్ణపరమాత్మ. మీ సంస్థను, మీ కుటుంబాన్ని అదుపులో పెట్టటానికి ప్రయత్నించే ముందు, మిమ్మల్ని మీరు అదుపులో పెట్టుకోవటానికి ప్రయత్నించండి. అలా తనను నియంత్రించుకోగలిగిన వ్యక్తిని యుక్తః అన్నాడు కృష్ణపరమాత్మ. అతను తెలివైనవాడు, అతనే వేదాంతాన్ని అర్థం చేసుకోగలడు. భావపరంగా అతను ప్రశాంతంగా ఉంటాడు.

**సః ఏవ నరః** – అతను తెలివైనవాడే కాదు, అతనే మానవుడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. తన బుద్ధిని అదుపులో పెట్టుకోలేకుండా ఏది తోస్తే అది చేసేవాడు మనిషే కాదు. పక్కన గీతాబోధ జరుగుతుంటే, కుక్క అరిస్తే ఎవరూ పట్టించుకోరు. ఎందుకంటే ఇక్కడ గీతాబోధ జరుగుతోంది, నేను అరవకూడదనే విచక్షణ కుక్కకు ఉండదు. కాని అదేచోట ఒక మనిషి ఇష్టం వచ్చినట్టు అరిస్తే, కొంచెం కూడా ఇంగితజ్ఞానం లేదా అంటారు. అటువంటి వ్యక్తిని నరుడు అనటానికి వీలులేదు అంటాడు కృష్ణపరమాత్మ. నరః వా అనే సందేహం కలుగుతుంది. 'నరః వా' పదాన్ని పదేపదే అంటే వానరుడు అవుతుంది. అందువల్ల రాగద్వేషాలను అదుపులో పెట్టుకున్నవాడే నరుడు. అంతేకాదు –

**సః సుఖీ** – అతనొక్కడే ఆనందంగా జీవితాన్ని గడపగలడు. అతనొక్కడే అంతర్గతంగా ఎదగగలడు. తక్కినవారికి రాగద్వేషాలు ఉంటాయి. వాటివల్ల ఆనందం, దుఃఖాలు మారుతూ ఉంటాయి. రాగద్వేషాలను అదుపులో పెట్టుకోలేకపోతే వేదాంతం ఎలా వంటబడుతుంది? జ్ఞానయోగం ఎలా పాటిస్తాడు?

అందువల్ల ముందు ఆత్మసంయమనం నేర్చుకోవాలి. రాగద్వేషాలను అదుపులో పెట్టటం నేర్చుకోవాలి. ఆత్మజ్ఞానం బుద్ధిలో కలుగుతుంది. కాని మనస్సు స్థిరంగా ఉంటేనే, బుద్ధి పని చేస్తుంది. భావోద్రేకాలతో మనస్సు అల్లకల్లోలం చెందితే బుద్ధి పనిచేయదు. గీతాబోధకు వెళ్ళొద్దని ఇంట్లో ఎవరైనా అంటే, వారితో పోట్లాడి గీతాబోధకు వెళ్ళినా మనస్సు రాయి విసిరిన కొలనులాగా ఉంటుంది. అటువంటి స్థితిలో వేదాంతం మెదడులోకి ఎక్కదు.

శ్లో. 24 **యోఽ_ంతఃసుఖోఽ_ంతరారామః తథాఽ_ంతర్జ్యోతిరేవ యః ।**
**స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽ_ధిగచ్ఛతి ॥**
యః, అంతస్సుఖః, అంతరారామః, తథా, అంతర్జ్యోతిః, ఏవ, యః,
సః, యోగీ, బ్రహ్మనిర్వాణమ్, బ్రహ్మభూతః, అధిగచ్ఛతి ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఏ పురుషుడు | అంతర్జ్యోతిః | = ఆత్మజ్ఞానము కలవాడో |
| ఏవ | = నిశ్చయముగా | సః | = ఆ (జ్ఞాని) |
| అంతఃసుఖః | = సమష్టి, అంతరాత్మయందు సుఖించువాడును | బ్రహ్మభూతః | = పరమాత్మయందు నిష్ఠ కలిగినవాడై |
| అంతరారామః | = ఆత్మయందు రమించువాడును | యోగీ | = జ్ఞానయోగి |
| తథా | = అలాగే | బ్రహ్మ నిర్వాణమ్ | = మరణానంతరం విదేహముక్తి |
| యః | = ఎవడు | అధిగచ్ఛతి | = పొందును |

**యః అన్తఃసుఖః అన్తరారామః తథా చ అన్తర్జ్యోతిః ఏవ,**
**సః యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతః అధిగచ్ఛతి ॥**

తా: (సమష్టి) అంతరాత్మయందే సుఖించువాడును, ఆత్మయందే రమించువాడును, ఆత్మజ్ఞానియైన వాడును అగు సాంఖ్యయోగి, పరమాత్మయందు ఏకీభావస్థితుడై, బ్రహ్మనిర్వాణమును పొందును.

ఇంతకుముందు రెండు శ్లోకాల్లో కృష్ణపరమాత్మ సాధనల గురించి మాట్లాడాడు. ఇప్పుడు ఈ శ్లోకంనుంచి జ్ఞానఫలం గురించి చెప్పబోతున్నాడు. ఒక వ్యక్తి తన రాగద్వేషాలను అదుపులో పెట్టుకున్నాడనుకుందాము. అంటే వస్తువులు ఉన్నా బాధపడడు; లేకపోయినా బాధపడడు. వీటిని అదుపులో పెట్టుకోలేని వ్యక్తి వస్తువులు ఉన్నా బాధపడతాడు; లేకపోయినా బాధపడతాడు. పైగా అతనొక్కడే బాధపడడు; తన చుట్టూ ఉన్నవారిని కూడా ఏడిపిస్తాడు. కాని, ఇప్పుడు ఒకతను రాగద్వేషాలను అదుపులో పెట్టుకుని, తరువాత ఆత్మజ్ఞానానికి వచ్చి పూర్ణత్వం పొందాడనుకుందాము. అటువంటి వ్యక్తి జీవితం ఎలా ఉంటుంది?

**యః అంతః సుఖః** – తనలోనే పూర్ణత్వాన్ని కనుగొన్న అతను జ్ఞాని అవుతాడు. అంతః అంటే అంతరాత్మ అంటే సత్యం. పూర్ణత్వమే తన అసలు స్వరూపం లేదా ఆత్మ స్వరూపం అని తెలుసుకుంటాడు. అతనికి ఆనందం బాహ్యంగా లేదు, తనలోనే ఉంది. ఆత్మజ్ఞానంవల్ల లాభమేమిటి?

**(అంతః సుఖః) అంతరారామః అంతర్జ్యోతిరేవ యః** – జ్యోతి అంటే తెలుసుకోవటం. తన ఆత్మ గురించి, తన పూర్ణత్వం గురించి తెలుసుకున్న వ్యక్తి; తనను గురించి తాను ఎన్నడూ మర్చిపోని వ్యక్తి. అంటే ఏమిటి? వస్తువులు ఉన్నా ఆనందమే, లేకపోయినా ఆనందమే; మనుష్యులతోనూ ఉండగలడు, ఒంటరిగానూ ఉండగలడు. ఏం చేస్తున్నా తన అంతర్గత స్వేచ్ఛను మాత్రం ఎన్నడూ మర్చిపోడు.

**స యోగీ** – అటువంటి వ్యక్తే అసలైన యోగి. యోగి అంటే జ్ఞాని. అతని పరిస్థితి ఎలా ఉంటుంది?

**బ్రహ్మభూతః అధిగచ్ఛతి** – బ్రహ్మతో ఏకమవుతాడు. ఏకమవుతాడు అంటే నిజంగా వెళ్ళి కలవడు; అతను తాను బ్రహ్మ కాక వేరే ఏమీ కాదని తెలుసుకుంటాడు. బ్రహ్మ అంటే పూర్ణత్వం. జ్ఞాని తాను పూర్ణుడనని, తను ఆనందంగా ఉండటానికి, తనకు భద్రతనివ్వటానికి బాహ్యంగా ఏదీ అవసరం లేదని తెలుసుకుంటాడు. దీన్ని బ్రహ్మత్వం అంటారు. ఎన్నాళ్ళు ఈ ఆనందం పొందుతాడు? అతను జీవించి ఉన్నన్నాళ్ళు. అతని ప్రారబ్ధకర్మ ముగిశాక, అతని శరీరం రాలిపోతుంది. అప్పుడతనికి ఏమవుతుంది? ఏమీ అవదు. అతను నేను శరీరాన్ని కాను; నేను మనస్సును కాను అని తెలుసుకుంటాడు. కాబట్టి అంతకుముందు శరీరం ఉన్న చైతన్యం అయితే, మరణం తరువాత ఏమవుతాడు?

**బ్రహ్మనిర్వాణమ్** – శరీరం లేని చైతన్యం అవుతాడు. అంటే విదేహముక్తి పొందుతాడు. మరణించక ముందూ ముక్తపురుషుడే; మరణించాక కూడా ముక్తపురుషుడే.

శ్లో. 25 **లభంతే బ్రహ్మనిర్వాణమ్ ఋషయః క్షీణకల్మషాః ।**
**ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః ॥**
లభంతే, బ్రహ్మనిర్వాణమ్, ఋషయః, క్షీణకల్మషాః,
ఛిన్నద్వైధాః, యతాత్మానః, సర్వభూతహితే, రతాః ॥

| | | | |
|---|---|---|---|
| క్షీణకల్మషాః | = పాపరహితులును | యతాత్మానః | = నిశ్చల స్థితిలో మనస్సును పరమాత్మయందు లగ్నము చేసినవారును అగు |
| ఛిన్నద్వైధాః | = జ్ఞాన ప్రభావమున సమస్త సంశయముల నివృత్తిని సాధించిన వారును | ఋషయః | = బ్రహ్మవేత్తలు |
| సర్వభూతహితే రతాః | = సర్వప్రాణుల హితమును గోరువారును | బ్రహ్మనిర్వాణమ్ | = బ్రహ్మనిర్వాణమును (శాంతబ్రహ్మను) |
| | | లభంతే | = పొందుదురు |

**క్షీణకల్మషాః ఛిన్నద్వైధాః యతాత్మానః ।**
**సర్వభూతహితే రతాః ఋషయః బ్రహ్మ నిర్వాణం లభన్తే ॥**

తా: పాపరహితులును, జ్ఞానప్రభావమున సమస్త సంశయముల నివృత్తిని సాధించినవారును, సర్వప్రాణుల హితమును గోరువారును, నిశ్చలస్థితిలో మనస్సును పరమాత్మయందు లగ్నము చేసినవారును అగు బ్రహ్మవేత్తలు బ్రహ్మనిర్వాణమును పొందుదురు.

ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ జ్ఞానయోగఫలం గురించి చెబుతున్నాడు. అది చెబుతూ, ఆధ్యాత్మిక సాధనలో ఉన్న అనేక దశలను వర్ణిస్తున్నాడు. జ్ఞానయోగం మోక్షం పొందటానికి అంతిమమార్గం కాని జ్ఞానయోగానికి రావటానికి అనేక దశలు దాటుకుంటూ రావాలి. బస్సుమీద ఎక్కడినుంచి ఎక్కడికి వెళుతుందో, మధ్యలో ఏ స్టాపులు వస్తాయో రాసి ఉన్నట్టుగా, ఇక్కడ మనం దాటాల్సిన దశలను చూస్తాము. ఆ దశలు వరుసగా వచ్చేందుకు వీలుగా, ఈ శ్లోకాన్ని తిరిగి అమర్చుకుందాము.

1. **సర్వభూతహితే రతాః** – విలువలు పాటించటం. అక్షరాలా తీసుకుంటే అందరి మంచి కోరుతాడని వస్తుంది. ఎదుటివారి బాధ అర్థమయేటంతగా విశాలహృదయం ఏర్పరచుకోవాలి. ఎదుటివారి బాధ అర్థమయితేనే వారిని బాధించడు. దీన్నే దయాగుణం అంటారు. దీన్నే ప్రాథమిక లక్షణంగా భావిస్తారు. దీనిమీద ఆధారపడి తక్కిన విలువలు ఏర్పడుతాయి. ఎదుటివారి కష్టసుఖాల్లో పాలుపంచుకోగలగాలి. ముందు భార్యతో మొదలుపెట్టాలి. నేనునుంచి మేమిద్దరం అనే భావన రావాలి. దాని తరువాత పిల్లలకు ఆ ప్రేమ పంచాలి. వారి భావాలను అర్థం చేసుకోవాలి. అలా తన ప్రేమను పెంచుకుంటూ పోవాలి – తోటి మానవులమీద, సమాజంమీద, చెట్లమీద, జంతువులమీద కూడా. అటువంటి వ్యక్తి అహింసకు రూపుదిద్దినట్టుగా ఉంటాడు. ఆధ్యాత్మిక ఎదుగుదలలో అహింసను మహావ్రతంగా పరిగణిస్తారు.

పతంజలి అష్టాంగయోగంలో యమనియమాల్లో చెప్పిన మొదటి విలువ అహింస. శారీరకంగా, మానసికంగా, వాచికంగా ఎవరినీ బాధించకూడదు. శంకరులవారు సర్వభూతహితే రతాః కి హింస చేయనివాడు అన్నారు. ఇటువంటి వ్యక్తి ఇతరులకు **హాని చేయడు** అని కాదు అర్థం; ఇటువంటి వ్యక్తి ఇతరులకు **హాని చేయలేడు**. ఎందుకంటే వారి బాధ అతనికి బాగా అర్థమవుతుంది.

అందువల్ల మోక్షం పొందాలంటే పాటించాల్సిన మొట్టమొదటి నియమం – విలువలను పాటించటం అంటే పంచమహాయజ్ఞాలు చేయటం లేదా నిష్కామకర్మ చేయటం. అది దేనికి దారి తీస్తుంది?

**2. క్షీణకల్మషాః –** ఎవరైతే పంచమహాయజ్ఞాలను పాటిస్తారో, అంటే ఎవరైతే కర్మయోగాన్ని పాటిస్తారో, వారు పాపరహితులు అవుతారు. వేదాంతం ప్రకారం పాపం నిర్వచనం ఏమిటి? ఆధ్యాత్మిక ప్రయాణానికి అడ్డుపడేది ఏదైనా పాపమే! ఆధ్యాత్మికతమీద మనకు శ్రద్ధ ఏర్పడకపోతే అది కూడా పాపమే. మనకు పుణ్యం ఉంటేనే ఆధ్యాత్మిక చింతన కలుగుతుంది.

**ఈశ్వర అనుగ్రహాత్ ఏవ పుంసామ్ అద్వైత వాసనా**

గీత చదవాలి, వినాలి అనే కోరిక కలగటానికి కూడా ఈశ్వర అనుగ్రహం కావాలి.

కోరిక ఉండగానే సరిపోదు, దానికి అనేక ఆటంకాలు ఎదురవుతాయి; కుటుంబపరిస్థితి, ఆరోగ్యం, బాహ్యవిషయాలు, ఏదో ఒకటి! ఇవన్నీ కూడా పాపాలే. నిష్కామకర్మ చేస్తే, ఈ ఆటంకాలన్నీ తొలగిపోతాయి. ఎలా? సూర్యుడు ఉదయించగానే చీకటి తొలగినట్టుగా. అందువల్ల క్షీణకల్మషాః అంటే పాపాలనే ఆటంకాలు తొలగుతాయి.

3. **యతాత్మానః** – మనం చేసుకున్న పుణ్యంవల్ల ఆధ్యాత్మికతమీద శ్రద్ధ ఏర్పడగానే, దానికోసం ప్రయత్నించాలి. మోక్షాన్ని నాలుగు పురుషార్థాలలో ఒకటిగా ఎందుకు పేర్కొన్నారు? దానికోసం మనం ప్రయత్నించాలి కాబట్టి. మనకు మోక్షం రావాలా, వద్దా అని దేవుడు నిర్ణయించడు. ఒకవేళ దేవుడు నిర్ణయించేటట్టయితే, కొందరికి మోక్షం వచ్చి, కొందరికి రాదు. అప్పుడు దేవుడు పక్షపాతవైఖరి చూపించినట్టు అవుతుంది.

దేవుని అనుగ్రహం అందరిమీదా సమానంగా ఉంది. మనం ఆ అనుగ్రహాన్ని ఉపయోగించుకోవటానికి సిద్ధంగా ఉన్నామా అన్నది ప్రశ్న.

**సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః** – 9.29

నేను సకల భూతాలలోనూ సమభావంతో వ్యాపించియున్నాను. నాకు అప్రియుడు కాని, ప్రియుడు కాని ఎవ్వరూ లేరు అంటాడు కృష్ణపరమాత్మ. కొంతమంది మోక్షం పొందారు, కొంతమంది పొందలేదు అంటే అది కృష్ణపరమాత్మ తప్పు కాదు; కొందరు ఆయన అనుగ్రహాన్ని ప్రయత్నపూర్వకంగా పొందారు. యతాత్మానః అంటే అర్థం అది. ఎవరైతే సరియైన మార్గంలో ప్రయత్నం చేస్తారో, వారు కావాల్సిన అర్హతను పొందుతారు. వివేకం దానంతట అది రాదు; వైరాగ్యం దానంతట అది రాదు; శమాది షట్కసంపత్తి దానంతట అది రాదు. మనమేం చేస్తాము? మనం కొంచెం కూడా ప్రయత్నం చెయ్యకుండా, అంతా భగవంతునిమీద తోసేస్తాము. పైగా శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అంటాము. మన బద్ధకానికి అది తోడ్పడే వాక్యం. కాని కృష్ణపరమాత్మే చెబుతున్నాడు: యతాత్మానః – నువ్వు ప్రయత్నం చేయాలి.

4. **ఋషయః** – జ్ఞానం పొందటానికి అవసరమైన అర్హతలు పొందగానే సరిపోదు, జ్ఞానం పొందటానికి కూడా ప్రయత్నం చేయాలి. జ్ఞానం కూడా దానంతట అది రాదు. మనం ప్రయత్నం చేయాలి. ఏమిటా ప్రయత్నం?

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా** – గురువు దగ్గరకు వెళ్ళి, గురువు ద్వారా శాస్త్రం నేర్చుకోవాలి. ఋషయః అంటే జ్ఞానినః అంటే జ్ఞాని అవుతారు. ఈ సందర్భంలో ఋషి అంటే జ్ఞాని. ఋషి అంటే కాషాయవస్త్రం ధరించి, గడ్డం పెంచిన వ్యక్తి అని కాదు అర్థం. ఆత్మతత్త్వాన్ని నేర్చుకున్న జ్ఞాని అని అర్థం. సమాజంలో ఉన్న జ్ఞాని ఋషి అవుతాడు; సన్న్యాసివేషం వేసినా జ్ఞానం పొందకపోతే ఋషి కాలేదు.

5. **ఛిన్నద్వైధాః** – నిశ్చయజ్ఞానం కలుగుతుంది. సంశయంతో కూడిన జ్ఞానం ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. అది అజ్ఞానంతో సమానం. సందేహాలు తీరితే అది నిశ్చయజ్ఞానం.

వేదాంతానికి వచ్చిన కొత్తలో ఏదీ నమ్మలేనట్టుగా ఉంటుంది. ఎదురుగా కనిపిస్తున్న ప్రపంచం నిజంగా లేదు, అది మిథ్య అంటుంది. కంటికే కనపడని బ్రహ్మ సత్యం అంటుంది. అక్కడితో ఊరుకోకుండా నువ్వు, ఆ బ్రహ్మ ఒకటే అంటుంది. అందుకని ఏదైనా ఒప్పుకుంటాను కాని, ఈ మూడే ఒప్పుకోను అంటే లాభం లేదు. ఎందుకు? వేదాంతసారమే ఈ మూడు వాక్యాలూ –

**బ్రహ్మసత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః**

అందువల్లనే వేదాంతాన్ని మూడు దశల్లో నేర్చుకోవాలని చూశాము. అవి శ్రవణం, మననం, నిదిధ్యాసనం.

**ఎ). శ్రవణం** – ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు సమర్థవంతమైన గురువు వద్ద శాస్త్ర అధ్యయనం చేయటం. ఈ దశలో గురువు చెప్పింది శ్రద్ధగా వినాలి. ప్రశ్నలు అడగకూడదు. శ్రవణంలో జ్ఞానం కలుగుతుంది.

**బి). మననం** – ఈ దశలో శిష్యుడు తనకు కలిగిన సంశయాలను తీర్చుకోవాలి. తోటి విద్యార్థులను అడిగో, తన నోట్సునే మళ్ళీ చూసుకునో, గురువును ప్రశ్నలు అడిగో, మళ్ళీమళ్ళీ శ్రవణం చేసో సందేహాలు తీర్చుకోవాలి. శ్రవణంలో జ్ఞానం కలిగితే, మననంలో నిశ్చయజ్ఞానం కలుగుతుంది. దీన్నే ఇక్కడ ఛిన్నద్వైధాః అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇతరులకు నచ్చచెప్పనవసరం లేదు, మనకు నమ్మకం కుదిరితే చాలు.

**సి). నిదిధ్యాసనం** – నిశ్చయజ్ఞానం కలిగితే చాలదు, ఆ జ్ఞాననిష్ఠలో ఉండగలగాలి. దాన్ని నిదిధ్యాసనం అంటారు.

6. **బ్రహ్మనిర్వాణం లభంతే** – అటువంటి వ్యక్తి బ్రహ్మలో లయమవుతాడు. ఈ పదాన్ని ముందు శ్లోకంలో కూడా చూశాము. అక్కడ కూడా దీని వివరణ చూశాము. బ్రహ్మలో లయమవుతాడు అంటే శారీరకంగా కాదు. శారీరకంగా అంటే బ్రహ్మ ఎక్కడో ఉన్నట్టు, జ్ఞాని మరెక్కడో ఉన్నట్టు; నదులు వెళ్ళి సముద్రంలో కలిసినట్టుగా, జ్ఞాని వెళ్ళి కలుస్తాడని కాదు అర్థం. బ్రహ్మ సర్వవ్యాపకం అయినప్పుడు, బ్రహ్మను ఎక్కడికో వెళ్ళి కలిసే ప్రసక్తి లేదు.

**బ్రహ్మలో లయమవటమంటే నేను బ్రహ్మకు దూరంగా ఉన్నాను అనే అపోహను వదులుకోవటం.** అజ్ఞానంవల్ల ఏర్పడుతుంది ఈ అపోహ. అజ్ఞానజనిత అపోహను పోగొట్టుకోవటమే లయమవటం.

ఈ శ్లోకంలో చెప్పిన దశలను మళ్ళీ టూకీగా చూస్తే – విలువలను పాటించటం, పాపరహితులం కావటం, మానవ ప్రయత్నం చెయ్యటం, జ్ఞానం పొందటం. దాన్ని నిశ్చయజ్ఞానంగా మలచుకోవటం. గీత నేర్చుకోవాలంటే, ఏవో సాకులు చెప్పకూడదు.

**త్యజేత్ ఏకం కులస్యార్థే గ్రామస్యార్థే కులం త్యజేత్ ।**
**గ్రామం జనపదస్యార్థే ఆత్మార్థే పృథివీం త్యజేత్ ॥**

ఒక కుటుంబాన్ని రక్షించటానికి ఒక వ్యక్తిని త్యాగం చేయవచ్చు; ఒక గ్రామాన్ని రక్షించటానికి ఒక కుటుంబాన్ని త్యాగం చేయవచ్చు; ఒక దేశాన్ని రక్షించటానికి ఒక గ్రామాన్ని త్యాగం చేయవచ్చు; మోక్షం పొందటానికి అన్నిటినీ త్యాగం చేయాలి. ఈ దశలన్నీ దాటివస్తే కలిగే ఫలం ఏమిటి? విదేహముక్తి పొందుతాడు.

శ్లో. 26 **కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్ ।**
**అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్ ॥**
కామక్రోధవియుక్తానామ్, యతీనామ్, యతచేతసామ్,
అభితః, బ్రహ్మనిర్వాణమ్, వర్తతే, విదితాత్మనామ్ ॥

| | | | |
|---|---|---|---|
| కామక్రోధ | = కామక్రోధ | యతీనామ్ | = జ్ఞానులకు |
| వియుక్తానామ్ | = రహితులును | అభితః | = అంతట |
| యతచేతసామ్ | = చిత్తమును జయించిన వారును | బ్రహ్మనిర్వాణమ్ | = పరబ్రహ్మ పరమాత్మయే |
| విదితాత్మనామ్ | = పరబ్రహ్మ పరమాత్మ సాక్షాత్కారమును పొందిన వారును అగు | వర్తతే | = పరిపూర్ణుడైయుండును (గోచరించును) |

**కామక్రోధవియుక్తానాం యతచేతసాం విదితాత్మనామ్ ।**
**యతీనామ్ అభితః బ్రహ్మనిర్వాణం వర్తతే ॥**

తా: కామక్రోధ రహితులును, చిత్తవృత్తులను జయించినవారును అయి, పరబ్రహ్మ పరమాత్మ సాక్షాత్కారమును పొందిన జ్ఞానులకు అంతటను శాంత పరబ్రహ్మ పరమాత్మయే గోచరించును.

విషయాన్ని మరింత స్పష్టంగా చెప్పటానికి ఇంతకు ముందు శ్లోకంలో చెప్పిన భావాన్నే మళ్ళీ చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. ఇక్కడ కూడా ఆధ్యాత్మిక ఎదుగుదలకు దశలను చూస్తాము.

1. **కామక్రోధ వియుక్తానామ్** – కామక్రోధాలను జయించటం. ఒక వస్తువుమీద కోరికను కామం అనీ, అది పొందలేకపోతేనో, అది పోతేనో కలిగే కోపాన్ని క్రోధం అంటారనీ చూశాము. కామం క్రోధానికి దారితీస్తుందని, వీటి గురించి వివరంగా మూడవ అధ్యాయంలో చూశాము.

**కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః ।**

**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥** – 3.37

వేదాంతంలోని ప్రాథమిక సూత్రం తెలిస్తే ఈ కామక్రోధాలను అదుపులో పెట్టుకోవటం తేలిక. ఏమిటా ప్రాథమిక సూత్రం? నా ఆనందం **నాకు ఏది ఉంది** అనే దానిమీద ఆధారపడిలేదు. **నేను ఎవరు** అనేదానిమీద ఆధారపడివుంది. ఎప్పుడూ నేను ఎవరు అని ఆలోచించాలి తప్ప నాకు ఏది ఉంది అని చూడకూడదు. ఇది అర్థమైతే, యోగక్షేమాల గురించిన బెంగ తీరుతుంది. లేకపోతే జీవితమంతా కోరికలు తీర్చుకోవటంలోనే సరిపోతుంది. ఆధ్యాత్మిక చింతనకు చోటు ఉండదు. యోగం అంటే ఏదైనా సంపాదించటం, క్షేమం అంటే దాన్ని నిలబెట్టుకోవటం. యోగక్షేమాలకోసం పాటుపడి, అన్నీ తీరాయి అనుకున్నాక; వేదాంతం నేర్చుకుందామనుకుంటే బుద్ధికున్న పదును తగ్గుతుంది. అందువల్ల కామక్రోధాలను తగ్గించుకోవటం నేర్చుకోవాలి. ఇది మొదటిదశ. దీన్ని **వైరాగ్యం** పెంచుకోవటం అంటారు.

**2. యతచేతసామ్** – మనస్సును అదుపులో పెట్టుకోవటం. ఆధ్యాత్మిక ప్రయాణం మనస్సు ద్వారా చేయాలి. మనస్సు ఏకాగ్రత చూపగలగాలి. ఇంకో విధంగా చెప్పాలంటే శమాది షట్క సంపత్తి కలిగివుండాలి. కఠోపనిషత్తులో ఆధ్యాత్మిక ప్రయాణాన్ని రథంతో పోలుస్తాడు యమధర్మరాజు. శరీరం రథం; గుర్రాలు ఇంద్రియాలు, కళ్ళాలు మనస్సు; రథసారథి బుద్ధి. అన్నీ బాగుంటేనే కాని ప్రయాణం సజావుగా సాగదు. అలాగే మన శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి అన్నీ సవ్యంగా ఉంటేనే కాని ఆధ్యాత్మిక ప్రయాణం సాగదు. దీన్ని యతచేతసామ్ అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇది రెండవ దశ. **దీన్ని శమాదిషట్క సంపత్తిని** అలవరచుకోవటం అంటారు.

**3. యతీనాం** – యతి అవటం. అక్షరాలా యతి అంటే సన్న్యాసి అవటం. పూర్వం బ్రహ్మచర్య ఆశ్రమం, సన్న్యాసాశ్రమం కేవలం శాస్త్రాన్ని అధ్యయనం చేయటానికే కేటాయించేవారు. వారికి ఇంక వేరే ఏమీ ధర్మం ఉండేదికాదు. అందువల్ల సన్న్యాసి అవ్వాలంటే ఎలా సన్న్యాసాశ్రమంలో కేవలం శాస్త్రాధ్యయానికే ప్రాముఖ్యతనిచ్చారో, ఇప్పుడు కూడా అలాగే ప్రాముఖ్యతనివ్వాలి అని అర్థం. మోక్షం, జ్ఞానం – వీటికే ప్రాముఖ్యతనిస్తేనే సన్న్యాసి అనవచ్చు. ఇది మూడవ దశ. దీన్ని **ముముక్షుత్వం** అంటారు.

**4. విదితాత్మనామ్** – నిశ్చయజ్ఞానం పొందటం. వివేక వైరాగ్యాలను అలవర్చుకుని, శమాదిషట్క సంపత్తిని పెంచుకుని, తీవ్ర ముముక్షుత్వం పెంచుకున్న వ్యక్తిని **సాధన చతుష్టయ సంపన్నుడు** అంటారు. అతను శ్రవణ మననాల ద్వారా జ్ఞానం పెంచుకుంటాడు. ఇంతకుముందు శ్లోకంలోనే చూశాము – శ్రవణం జ్ఞానాన్ని కలుగజేస్తుందనీ, మననం నిశ్చయజ్ఞానాన్ని కలుగజేస్తుందనీను. అందువల్ల విదితాత్మనామ్ అంటే నిశ్చయజ్ఞానం పొందిన జ్ఞాని. ఇది నాల్గవ దశ. దీన్ని **నిశ్చయజ్ఞానం పొందటం** అంటారు.

**5. బ్రహ్మనిర్వాణం వర్తతే** – బ్రహ్మలో లయమవుతారు. నిశ్చయజ్ఞానం పొందిన జ్ఞానికి కలిగే ఫలం ఇది. దీన్ని కూడా ముందు శ్లోకంలో చూశాము. బ్రహ్మలో లయమవటమంటే నేను బ్రహ్మకు దూరంగా ఉన్నాననే అపోహను వదులుకోవటం. శారీరకంగా లయం కావటం కాదు; బుద్ధిలో మార్పు కలగటం.

**అభితః** – అభితః అంటే రెండు రకాలుగా. మరణాత్ పూర్వం అపి, మరణానంతరమపి. మరణం ముందు, తరువాత కూడా బ్రహ్మలో లయమవుతాడు. ముందు పొందేదాన్ని జీవన్ముక్తి అనీ, తరువాత పొందేదాన్ని విదేహముక్తి అనీ అంటారు.

దానికి శాస్త్రం ఇచ్చే ఉదాహరణ ఘటాకాశం మఠాకాశంలో కలవటం. ఒక కుండ ఉంటే, కుండలోనూ ఆకాశం ఉంది; బయటా ఆకాశం వుంది. ఆకాశం గురించి నేర్చుకుంటే అది అఖండమనీ, దాన్ని భాగాలుగా విడగొట్టలేమనీ తెలుసుకుంటాము. అప్పుడు కుండలో ఆకాశం, కుండ బయట ఆకాశం అంటూ రెండు విడిగా లేవు. కుండ వున్నా, కుండ లేకపోయినా ఆకాశంలో భాగాలు లేవు. అలాగే చైతన్యం నాలోనూ ఉంది, బయటా ఉంది. శరీరం ఉన్నా లేకపోయినా చైతన్యం ఏకం, సర్వవ్యాపకం. ఈ జ్ఞానం పొందితే శరీరం ఉంటే దాన్ని **జీవన్ముక్తి** అనీ; శరీరం రాలిపోతే దాన్ని **విదేహముక్తి** అనీ అంటారు. జ్ఞానం రెండు ఫలాలనూ ఇస్తుంది. ఇది ఐదవ దశ. జ్ఞానఫలం పొందుతారు.

ఈ శ్లోకంలోని దశలను టూకీగా చూస్తే – వైరాగ్యం పెంచుకుని, శమాదిషట్క సంపత్తిని అలవరచుకుని, ముముక్షుత్వం పెంచుకుని, శాస్త్రాన్ని అధ్యయనం చేస్తే నిశ్చయజ్ఞానం కలుగుతుంది. దానివల్ల జీవన్ముక్తి, విదేహముక్తి కలుగుతాయి.

శ్లో. 27 **స్పర్శాన్‌కృత్వా బహిర్బాహ్యాన్ చక్షుశ్చైవాంతరే భ్రువోః ।**
**ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ ॥**
స్పర్శాన్, కృత్వా, బహిః, బాహ్యాన్, చక్షుః, చ, ఏవ, అంతరే, భ్రువోః,
ప్రాణాపానౌ, సమౌ, కృత్వా, నాసాభ్యంతరచారిణౌ ॥

| | | | |
|---|---|---|---|
| బాహ్యాన్, స్పర్శాన్ | = బాహ్యవిషయభోగములను | నాసాభ్యంతర | = నాసికా రంధ్రములందు |
| బహిః ఏవ, కృత్వా | = బయటికి పారద్రోలి | చారిణౌ | చరించుచున్న |
| చ | = ఇంకా | ప్రాణాపానౌ | = ప్రాణాపానవాయువులను |
| చక్షుః | = దృష్టిని | సమౌ, కృత్వా | = సమముగా చేసి |
| భ్రువోః, అంతరే | = భ్రూమధ్యమున (నిలిపి) | | |

**బాహ్యాన్ స్పర్శాన్ బహిః కృత్వా చక్షుః చ భ్రువోః అన్తరే ఏవ (కృత్వా) ।**
**నాసాభ్యన్తరచారిణౌ ప్రాణాపానౌ సమౌ కృత్వా ॥**

తాత్పర్యం తరువాత శ్లోకంలో చూద్దాము.

ఇంతకుముందు శ్లోకంతో జ్ఞానఫలం ముగిసింది. అది జీవన్ముక్తి, విదేహముక్తి అని చూశాము. నిజానికి దానితో ఐదవ అధ్యాయం అయిపోయిందని చెప్పవచ్చు. కృష్ణపరమాత్మ ఇందులో జ్ఞానయోగం గురించి చెప్పదలుచుకున్నాడు. అందువల్ల జ్ఞానం గురించీ, జ్ఞానఫలం గురించీ చెప్పేశాడు. అవి అయిపోయాయి.

**4. ధ్యానం- శ్లోకాలు 27-29** కృష్ణపరమాత్మ ఇంకొక అంశాన్ని ప్రవేశపెట్టి దాన్ని ముగిస్తున్నాడు. మూడు శ్లోకాల్లో ధ్యానం గురించి, దాని ఫలం గురించి చెప్పబోతున్నాడు. దాన్ని తరువాత వచ్చే అధ్యాయంలో వివరించబోతున్నాడు. గీతాబోధను అర్థం చేసుకుని, జీర్ణించుకోవటానికి ధ్యానం అవసరం. ఈ జ్ఞానం పైపైన ఏర్పడితే చాలదు, అది మన సుప్తచేతన మనస్సులో స్థిరపడాలి. ఎందుకంటే, మన జీవితంలో మనం చూపించే అనేక భావోద్రేకాలు మనం తెలిసి తెలిసీ చూపేవి కావు. ఎలా చెప్పగలుగుతున్నాము? ఎన్నో సందర్భాలలో తీవ్రంగా స్పందించేశాక, ఎందుకిలా చేశాను, ఎందుకిలా అన్నాను అని చాలా బాధ పడతాము. మనం తెలిసి తెలిసీ చేయకపోతే, ఎలా చేశాము? మన సుప్తచేతన మనస్సు ప్రవర్తించింది అలా.

మనం గీత నేర్చుకుని, పొందిన జ్ఞానం అంతా చేతన మనస్సులోనే ఉండిపోతోంది గాని సుప్తచేతన మనస్సులోకి వెళ్ళటం లేదు. అందువల్ల సుప్తచేతన మనస్సులో పాత సంసారి, అజ్ఞాని అలాగే తిష్ఠవేసుకుని కూర్చుని ఉంటాడు. అందువల్ల మన ప్రవర్తనలో ఏమీ మార్పురాదు. గీతాబోధను మన సుప్తచేతన మనస్సులోకి పంపిస్తే, అందులో జీర్ణించుకుంటే, మనకు తెలియకుండా చేసే పనుల్లో కూడా గీతాబోధ ప్రభావం ఉంటుంది.

అలా పంపాలంటే ఏం చేయాలి? ఈ జ్ఞానాన్ని మన ప్రవర్తనలో పూర్తిగా మలచుకోవాలి. కాఫీలో పంచదారను పూర్తిగా కలిపినట్టుగా. కాఫీలో పంచదార వేసి, దాన్ని కలుపుకోకుండా తాగితే ఏమవుతుంది? కాఫీ తీయగా ఉండదు. పంచదార వేయలేదని భార్యమీద చిందులు వేస్తాము. మళ్ళీ నాలుగు చెంచాల పంచదార వేసుకుని తాగినా కూడా కాఫీ తియ్యగా ఉండదు. ఎందుకు? పంచదారను కాఫీలో కలిసేలాగా చెంచాతో కలిపితే కదా! పంచదార కాఫీలో అడుగునా, మధ్యలో, పైనా అంతటా ఉండాలంటే దాన్ని బాగా కలపాలి. అలాగే మనం నేర్చుకున్న జ్ఞానం, దురదృష్టవశాత్తు మన మనస్సులో ఒకమూల ఉండిపోతోంది. దాన్ని అంతటా కలపాలంటే ధ్యానం చేయాలంటున్నాడు కృష్ణపరమాత్మ.

ధ్యానం చేసేముందు పాటించాల్సిన విషయాలు, ధ్యానం చేసే పద్ధతి, ధ్యానఫలం – ఈ మూడూ ఇక్కడ టూకీగా చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ శ్లోకంలో ధ్యానం చేసేముందు పాటించాల్సిన విషయాలు చెబుతున్నాడు. కొన్ని దశలను మనం ఊహించుకోవాలి. అవి తరువాత వివరంగా వస్తాయి. ఒక వ్యక్తి సుఖస్థిర ఆసనంలో కూర్చున్నాడు. అతని శరీరం విశ్రాంతిగా ఉందని ఊహించుకోవాలి. దాని తరువాత అతను ఏం చేయాలి?

**ప్రాణాపానౌ సమౌ కృత్వా** – ఉచ్ఛ్వాస, నిశ్వాసలను సమానంగా చేయాలి. మనస్సుయొక్క స్థితి, ఊపిరి పీల్చటం ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయి. అందువల్లనే మనలో భావోద్రేకాలు ఎక్కువైనప్పుడు శ్వాస కూడా వేగంగా పీలుస్తాము. అంటే శ్వాసను నియంత్రించగలిగితే, మన మనస్సును కూడా నియంత్రించగలము. అందువల్లనే ఏదైనా పూజ చేసేముందు, ప్రాణాయామం చేయాల్సివుంటుంది.

**నాసాభ్యంతరచారిణౌ** – ఉచ్ఛ్వాస నిశ్శ్వాసలను ముక్కు రంధ్రాలలో సమానం చేయాలి.

**చక్షుశ్చైవాంతరే భ్రువోః** – ఇంద్రియాలను బాహ్యప్రపంచంనుంచి వెనుకకు లాగాలి. ఇంద్రియాల్లో ముఖ్యమైనది కన్ను కాబట్టి, దాన్ని భ్రుకుటిమీద నిలపాలి. తక్కిన వివరాలు తరువాత అధ్యాయంలో వస్తాయి. అప్పుడు వివరంగా చూద్దాము.

**బాహ్యాన్ స్పర్శాన్ బహిః కృత్వా** – బాహ్యవిషయవస్తువుల ఆలోచనలను మనస్సులోంచి పారద్రోలాలి. వస్తువులు అంటే మనుష్యులు కూడా వస్తారని చూశాము. అంటే బాహ్యవిషయాల గురించి, మనుష్యులతో ఉన్న అనుబంధం గురించి ఆలోచించకూడదు. మానసిక సన్న్యాసి అవ్వాలి. అన్ని అనుబంధాలూ పక్కనపెట్టి, భగవంతునితో మాత్రమే అనుసంధానం చెందాలి. బాహ్య ఆలోచనలు ధ్యానభావనల ద్వారా పారద్రోలాలి. ఇవి ప్రాథమిక అంశాలు. ఇంకా కొన్ని ఉన్నాయి.

శ్లో. 28 **యతేంద్రియమనోబుద్ధిః మునిర్మోక్షపరాయణః ।**
**విగతేచ్ఛాభయక్రోధో యః సదా ముక్త ఏవ సః ॥**
యతేంద్రియమనోబుద్ధిః, మునిః, మోక్షపరాయణః,
విగతేచ్ఛాభయక్రోధః, యః, సదా, ముక్తః, ఏవ, సః ॥

| | | | |
|---|---|---|---|
| యతేంద్రియ మనోబుద్ధిః | = మనోబుద్ధీంద్రియములను జయించినటువంటి | విగతేచ్ఛా భయక్రోధః | = ఇచ్ఛాభయక్రోధరహితుడైన వ్యక్తి |
| యః | = ఎవరైతే | సః | = అతడు |
| మోక్షపరాయణః | = మోక్షపరాయణుడై | సదా | = సర్వదా |
| మునిః | = మననశీలుడై | ముక్తః, ఏవ | = ముక్తుడే యగును |

**యః మునిః యతేన్ద్రియమనోబుద్ధిః మోక్షపరాయణః ।**
**విగతేచ్ఛాభయక్రోధః సః సదా ముక్తః ఏవ ॥**

తా: బాహ్యవిషయభోగములను చింతన చేయక వాటిని పారద్రోలవలెను. దృష్టిని భ్రూమధ్యమందు స్థిరముగా ఉంచవలెను. నాసికయందు ప్రసరించుచున్న ప్రాణాపానవాయువులను సమస్థితిలో నడుపవలెను. ఈ ప్రక్రియల ప్రభావమున మనస్సు, బుద్ధి, ఇంద్రియములు సాధకుని వశములోనికి వచ్చును. ఇటువంటి సాధనవల్ల మోక్షపరాయణుడైన ముని ఇచ్ఛాభయక్రోధరహితుడై సదా ముక్తుడగును.

ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని అదుపులో పెట్టుకుని, ఇచ్ఛ, భయం, క్రోధాలను నియంత్రించుకుని, మోక్షమే అంతిమలక్ష్యంగా భావించి, ఎవరైతే ధ్యానం చేస్తారో వారు సదా ముక్తులవుతారు.

**యతేంద్రియ మనోబుద్ధిః** – ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి – వీటిని బాహ్యప్రపంచంనుంచి విడదీయాలి. అప్పుడు ధ్యానం చేయటానికి అవి అందుబాటులో ఉంటాయి.

**విగతేచ్ఛాభయక్రోధః** – భావోద్రేకాలనుంచి విడివడాలి. ఇచ్ఛ అంటే కోరిక; క్రోధం అంటే కోపం; కోరిక, భయం, కోపాలను మనస్సులోంచి పారద్రోలాలి. అప్పుడు మనస్సు ఒక్కదాని గురించే ఆలోచిస్తుంది. ఏమిటది?

**మునిర్మోక్షపరాయణః (భవేత్)** – ముని అంటే ధ్యానం చేసే వ్యక్తి. అతను శాస్త్రంలో వర్ణించిన మోక్షాన్ని తన స్వరూపంగా ధ్యానం చేయాలి. ఆ బోధలో నిలిస్తే;

**సదా సః ముక్త ఏవ (భవతి)** – అప్పుడు అతనిలో ఈ బోధ నెలకొని ఉంటుంది. అతను ఏ పని చేస్తున్నా, అతని సుప్తచేతన మనస్సులో గీతాబోధ ఎప్పుడూ ఉంటుంది.

శ్లో. 29 **భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్ ।**
**సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతిమృచ్ఛతి ॥**
భోక్తారమ్, యజ్ఞతపసామ్, సర్వలోకమహేశ్వరమ్,
సుహృదమ్, సర్వభూతానామ్, జ్ఞాత్వా, మామ్, శాంతిమ్, ఋచ్ఛతి ॥

| | | | |
|---|---|---|---|
| మామ్ | = నన్ను(భగవంతుణ్ణి) | సుహృదమ్ | = ఆత్మీయునిగా |
| యజ్ఞతపసామ్ | = యజ్ఞములకు, తపస్సులకు | జ్ఞాత్వా | = ఆ దేవునిమీద ధ్యానం చేస్తే |
| భోక్తారమ్ | = భోక్తగా | | |
| సర్వలోక మహేశ్వరమ్ | = సమస్త లోకములకు, లోకేశ్వరులకును అధిపతిగా | శాంతిమ్ | = (భక్తుడు) పరమశాంతిని |
| | | ఋచ్ఛతి | = పొందును |
| సర్వభూతానామ్ | = సకల ప్రాణులకును | | |

**యజ్ఞతపసాం భోక్తారం సర్వలోకమహేశ్వరమ్ ।**
**సర్వభూతానాం సుహృదం మాం జ్ఞాత్వా శాన్తిమ్ ఋచ్ఛతి ॥**

తా: భగవంతుడు యజ్ఞములకు, తపస్సులకు భోక్త. సమస్త లోకములకు లోకేశ్వరులకు అధిపతి. సమస్త ప్రాణులకును ఆత్మీయుడు. అంటే అవ్యాజదయాస్వరూపుడు. పరమప్రేమస్వరూపుడు. ఈ భగవత్తత్త్వము తెలిసిన భక్తునకు పరమశాంతి లభించును.

దేనిమీద ధ్యానం చేయాలి? నామీద అంటే భగవంతునిమీద అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎటువంటి భగవంతుడు?

**యజ్ఞతపసాం భోక్తారమ్** – పూజలన్నీ అందుకునే వ్యక్తి; యజ్ఞాలు, తపస్సులు అందుకునే వ్యక్తి.

**సర్వలోకమహేశ్వరమ్** – సమస్త లోకాలకు అధిపతి. ఎక్కడ ఉన్నాడు?

**సుహృదం సర్వభూతానాం మామ్** – దేవుడు ఎక్కడో లేడు. సమస్త ప్రాణుల హృదయాలలో నెలకొనివున్నాడు.

**జ్ఞాత్వా** – ఆ దేవునిమీద ధ్యానం చేస్తే;

**శాంతిమృచ్ఛతి** – శాంతి పొందుతారు. అంటే జీవన్ముక్తి, విదేహముక్తి రెండూ పొందుతారు. ఇది టూకీగా చెప్పాడు. ఇందులో ప్రతిపదాన్నీ మళ్ళీ వివరంగా చెబుతాడు.

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే**
**శ్రీకృష్ణార్జునసంవాదే కర్మ సన్న్యాసయోగోనామ పంచమోఽ ధ్యాయః**

హరి ఓం తత్సత్

ఇది శ్రీ మద్భగవద్గీతయందు, ఉపనిషత్తులయందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమునందు, శ్రీకృష్ణార్జున సంవాదమందు కర్మసన్న్యాసయోగము అనే ఐదవ అధ్యాయము.

## స్వామీజీ ఆణిముత్యాలు –

ఈ జ్ఞానం పొందాలంటే, మన ఉన్నతస్థితిని అర్థం చేసుకోవాలి. అది చాలా సూక్ష్మమైన సత్యం. ఆత్మ, ఆత్మ అంటున్నారు, అసలు నిజంగా ఆత్మ ఉందా? లేక అది మీ ఊహాగానమా అని ప్రశ్నించేవారికి జవాబు ఈ శ్లోకం –

**బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।**
**లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా ॥ 5.10**

నీ ఉన్నతస్థితిని చేరుకునేవరకూ నీ ఇష్టదేవత ప్రార్థన చెయ్యి అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్లనే మనం ప్రపంచంమీద ఆధారపడటంనుంచి దేవునిమీద ఆధారపడటం నేర్చుకుని, దేవునిమీద ఆధారపడటం నుంచి ఆత్మమీద ఆధారపడటం నేర్చుకోవాలి.

**ప్రపంచంమీద ఆధారపడటంనుంచి దేవునిమీద ఆధారపడటం – కర్మయోగం**
**దేవునిమీద ఆధారపడటంనుంచి ఆత్మమీద ఆధారపడటం – జ్ఞానయోగం**

# అధ్యాయము 5 - కర్మసన్న్యాసయోగము సారాంశము

కృష్ణపరమాత్మ గీతా సారాంశం మొత్తాన్ని 2,3,4 అధ్యాయాలలో చెప్పేశాడు. ఐదవ అధ్యాయంలో తను ఆ మూడు అధ్యాయాలలో చెప్పిన సారాన్ని మళ్ళీ చెప్పాడు. అందువల్ల ఈ అధ్యాయం చిన్నదే అయినా, గీతాసారం అంతా ఇందులో వస్తుంది కాబట్టి, చాలా ముఖ్యమైన అధ్యాయం.

ఈ అధ్యాయాన్ని ప్రధానంగా నాలుగు అంశాలుగా విభజించవచ్చు. అవి -

| | | |
|---|---|---|
| **1. నిష్ఠాద్వయం** | **శ్లోకాలు** | **1-6** |
| **2. సాధనద్వయం** | **శ్లోకాలు** | **7-21** |
| **3. జ్ఞానసాధన, ఫలం** | **శ్లోకాలు** | **22-26** |
| **4. ధ్యానం** | **శ్లోకాలు** | **27-29** |

1. **నిష్ఠాద్వయం - శ్లోకాలు 1-6** ప్రతి వ్యక్తికీ రెండు రకాల జీవనవిధానాలున్నాయి. అవి గృహస్థాశ్రమం, సన్న్యాసాశ్రమం. గృహస్థు సమాజంలో ఉంటూ, అన్నిటినీ అనుభవిస్తాడు. సన్న్యాసి సమాజాన్ని, ఆస్తులను త్యజించి ఒంటరి జీవితాన్ని గడుపుతాడు. గృహస్థాశ్రమాన్ని ప్రవృత్తిమార్గమనీ, సన్న్యాసాశ్రమాన్ని నివృత్తి మార్గమనీ అంటారు. కృష్ణపరమాత్మ ఈ రెండు ఆశ్రమాల గురించే చెబుతున్నాడు. ఎందుకంటే తక్కిన రెండింటినీ ఈ రెండింటికీ సిద్ధంచేసే ఆశ్రమాలని చెప్పవచ్చు. బ్రహ్మచర్యంనుంచి గృహస్థాశ్రమానికీ; వానప్రస్థంనుంచి సన్న్యాసాశ్రమానికీ వస్తారు. అందువల్ల ఈ రెండింటినీ పట్టించుకోవటం లేదు. రెండే నిష్ఠలు ఉన్నాయని మూడవ అధ్యాయంలో చెప్పాడు.

**లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ।** - 3.3

ఈ జీవన విధానాలు వేదాల్లో చెప్పబడ్డాయి. కాని అర్జునుడు సన్న్యాసాశ్రమం విషయంలో అయోమయంలో పడ్డాడు. మోక్షం పొందటానికి సన్న్యాసం స్వీకరించి తీరాలా? కృష్ణపరమాత్మ ఈ సందేహాన్ని ఇందులో తీరుస్తాడు.

**నిష్ఠ విషయంలో వికల్పం ఉంది.**

రెండు ఆశ్రమాలలో ఏదైనా పాటించవచ్చు.

**సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి న పండితాః ।**
**ఏకమప్యాస్థితః సమ్యగుభయోర్విందతే ఫలమ్ ॥** - 5.4

బ్రహ్మచర్యం తరువాత గృహస్థు అవచ్చు, లేదా సన్న్యాసం స్వీకరించవచ్చు. ఈ రెండు ఆశ్రమధర్మాల్లో ఏది బాగుందని అడిగితే రెండింటిలోనూ లాభనష్టాలున్నాయి. గృహస్థాశ్రమంలో భద్రత ఉన్నట్టు కనిపిస్తుంది, అనుబంధాలుంటాయి. అది లాభం. కాని హక్కులతో పాటే బాధ్యతలు కూడా ఉంటాయి. బాధ్యతలను వెన్నంటి

ఆందోళన ఉంటుంది. అది నష్టం. సన్న్యాసాశ్రమంలో అనుబంధాలు ఉండవు కాబట్టి బాధ్యతలు ఉండవు. బాధ్యతలు ఉండవు కాబట్టి వాటిని వెన్నంటి ఆందోళన ఉండదు. కాబట్టి అది లాభం. కాని ఆస్తిపాస్తులు ఉండవు, నా వారు ఉండరు, భద్రత ఉండదు, ఏకాకిగా జీవించాల్సి ఉంటుంది. అది నష్టం. అందువల్ల రెండింటిలోనూ లాభనష్టాలు ఉంటాయి.

మామూలుగా రెండింటి మధ్య ఎన్నుకోవాలంటే పెద్ద చిక్కే ఎవరికైనా! ఎందుకంటే వారు తీసుకున్న నిర్ణయాలవల్ల కలిగే పరిణామాలను తట్టుకునే శక్తి ఉండదు. అందువల్ల అర్జునుడు కృష్ణపరమాత్మనే రెండు జీవనవిధానాల్లో ఏదో ఒకటి తేల్చి చెప్పమని అడిగాడు.

**తయోస్తు కర్మసన్న్యాసాత్ కర్మయోగో విశిష్యతే** – 5.2

చాలామందికి గృహస్థాశ్రమమే క్షేమమని చెప్పాడు కృష్ణపరమాత్మ.

**సన్న్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తుమయోగతః** – 5.6

మనస్సు పరిపక్వత చెందకుండా సన్న్యాసం స్వీకరిస్తే వారు చాలా అవస్థ పడతారు. అందువల్ల గృహస్థాశ్రమమే క్షేమమన్నాడు.

నిష్ఠాద్వయంలో ఎన్నుకునే అవకాశం ఉంది.

**2. సాధనద్వయం – శ్లోకాలు 7–21** రెండు సాధనలు ఉన్నాయి. అవి – కర్మయోగ సాధన, జ్ఞానయోగ సాధన.

**ఎ). కర్మయోగ సాధన** – శ్లోకాలు 7–12 ఆశ్రమధర్మం విషయంలో ఎన్నుకునే అవకాశముంది కాని, సాధన విషయంలో ఎన్నుకునే అవకాశం లేదని గట్టిగా చెప్పాడు కృష్ణపరమాత్మ. ఈ విషయం బాగా అర్థం చేసుకోవాలి, ఎందుకంటే అది జ్ఞానం విషయంలో ఉన్న అనేక అపోహలను తొలగిస్తుంది. కొంతమంది జ్ఞానం పొందటానికి అనేక మార్గాలున్నాయని అనుకుంటారు. అవి – కర్మయోగం, భక్తియోగం, రాజయోగం, కుండలినీయోగం, సంగీత మార్గం. వేదం ఎక్కడా ఈ వాదనలను సమర్థించదు. భగవద్గీత కూడా ఈ వాదనలను సమర్థించదు. సాధన విషయంలో ఎన్నుకునే అవకాశం లేదు. కర్మయోగమూ పాటించాలి, జ్ఞానయోగమూ పాటించాలి.

రెండూ పాటించాలంటే ఒకేసారి పాటించాలా, ఒకదాని తరువాత మరొకటి పాటించాలా? ఒకదాని తరువాత ఒకటి పాటించాలని కృష్ణపరమాత్మ చెప్పాడు. దాన్ని **క్రమసముచ్చయం** అంటారు. ఒకదాని తరువాత ఒకటి పాటించాలంటే ఏది ముందు, ఏది వెనుక? జ్ఞానయోగంతో మొదలుపెట్టి, కర్మయోగానికి రావచ్చా? అలా కుదరదు. ముందు కర్మయోగం పాటించాక, జ్ఞానయోగానికి రావాలి. ఎందుకు?

**కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొంది; జ్ఞానయోగానికి వచ్చి, జ్ఞానం పొంది; మోక్షాన్ని పొందాలి. ఇదీ వరుస.**

అంటే కర్మయోగి శాస్త్రాన్ని అస్సలు నేర్చుకోకూడదని కాదు అర్థం. అతను గీతాక్లాసులకు వెళ్ళవచ్చు. కాకపోతే కర్మయోగికి కర్మ ప్రధానంగా ఉంటుంది. అలాగే జ్ఞానయోగికి జ్ఞానం ప్రధానంగా ఉంటుంది.

కర్మయోగాన్ని మూడవ అధ్యాయంలో వివరంగా చర్చించాడు. ఇక్కడ దాన్ని టూకీగా చెప్పాడు.

**కర్మయోగం = సరియైన కర్మ + సరియైన దృక్పథం**

**సరియైన కర్మ** – సరియైన కర్మ కిందికి నిష్కామకర్మలు లేదా సాత్త్విక కర్మలు వస్తాయి. ఇందులో ఎక్కువమంది మేలు పొందుతారు. రెండవరకం కర్మలు సకామకర్మలు లేదా రాజసిక కర్మలు. ఇందులో లాభం పొందేవారు తక్కువ వుంటారు. నేను, మహా అయితే నా కుటుంబం బాగు పడుతుంది. మూడవరకం కర్మలు నిషిద్ధకర్మలు లేదా తామస కర్మలు. ఇందులో నేను బాగా లాభం పొందుతాను కాని ఎదుటివారికి హాని చేస్తాయి ఆ కర్మలు. ఇవి ఆధ్యాత్మిక చింతనకు తోడ్పడకపోగా, ఇవి పాటిస్తే నన్ను ఇంకా కిందికి లాగుతాయి. అందువల్ల కర్మయోగి ఎక్కువగా సాత్త్వికకర్మలను, కొంచెం తక్కువగా రాజసికకర్మలను చేయాలి. తామసికకర్మలను కుదిరితే పూర్తిగా మానేయాలి, కనీసం చాలా తక్కువ చేయాలి.

**సరియైన దృక్పథం** – ఇందులో రెండు దశలున్నాయి.

**ఈశ్వరార్పణ భావన–** ఈశ్వరార్పణభావనతో కర్మలు చేయాలి.

**బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।**
**లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా ॥** – 5.10

ఈ అధ్యాయంలో చాలా ముఖ్యమైన శ్లోకమిది. దీన్ని శంకరులవారు తరచు ఉటంకిస్తూ వుంటారు. సాత్త్విక, రాజస, తామస కర్మల్లో ఏ కర్మను చేసినా కూడా ఆ కర్మను ఈశ్వరునికి అర్పించాలి. తామసకర్మను వీలున్నంతవరకూ మానాలని చూశాము. కాని ఒకవేళ చేయాల్సి వచ్చినా, దాన్ని భగవంతునికి అర్పిస్తే, ఏదో ఒక శుభముహూర్తాన వారు ఆ తామసకర్మలు చేయకుండా ఉండేలా భగవంతుడే వారి బుద్ధిని మారుస్తాడు.

అందువల్ల శంకరుల వారు 18వ అధ్యాయంలో ఒకచోట ఇలా చెబుతారు – ఒకవేళ నిషిద్ధ కర్మలను చేయాల్సివచ్చినా దాన్ని భగవంతునికి అర్పించి చేస్తే, ఆ నిషిద్ధకర్మను చేయాల్సిన అవసరం లేకుండా భగవంతుడే చూసుకుంటాడు. దేవునితో అనుసంధానం చేస్తే, దేవుడు మన బుద్ధిని మార్చగలడు. అందువల్ల కర్మలను ఈశ్వరార్పణభావనతో చేయాలి.

**ఈశ్వరప్రసాద బుద్ధి** – మనం చేసే సాత్త్విక, రాజస, తామస కర్మలకు ఏ ఫలం వచ్చినా కూడా దాన్ని ఈశ్వరప్రసాద బుద్ధితో స్వీకరించాలి. ఎందుకంటే మన జీవితంలో మనం పొందే ప్రతి అనుభవం కూడా మనం చేసుకున్న కర్మల ఫలితమే అని కర్మసిద్ధాంతం చెబుతుంది. ఒక్కోసారి మనం చాలా బాధలు పడుతుంటాము; వెనక్కి తరచి చూసుకుంటే, మనమేమీ పాప కర్మలు చేసివుండము. అప్పుడు మనకు సందేహం వస్తుంది. నేను తెలిసి తెలిసి ఎవరికీ పాపం చేయలేదు, నాకు ఎందుకు ఈ కష్టమొచ్చింది అని. దీనికి జవాబు – మనం అనుభవించే ఫలం మనం చేసుకున్న కర్మఫలం అన్నమాట అక్షరాలా నిజమే. కాకపోతే ఆ పాపకర్మ ఈ జన్మలోనిదే కానవసరం లేదు, మనం ఎన్నో జన్మలుగా సంచితకర్మలుగా మోసుకొస్తున్న పాపకర్మఫలాన్ని ఇప్పుడు మనం మంచివారిమైనా కూడా అనుభవిస్తున్నాము.

పూర్వజన్మ కర్మలు మనకు తెలియవు, ఈ జన్మలో చేసిన కర్మలు గుర్తుండవు కాని కర్మఫలదాత అయిన ఈశ్వరునికి తెలుసు. అందువల్ల మనకు ఏది జరిగినా, అది మనకు నచ్చనిది కాకపోవచ్చేమో కాని మనకు కానిది మాత్రం కాదు. అందువల్ల భగవంతుణ్ణి 'నాకే ఎందుకు?' ప్రశ్న ఎన్నడూ వేయకూడదు. అలా అడిగితే భగవంతుణ్ణి పరోక్షంగా పక్షపాతవైఖరి ఉందని నిందించినట్టు అవుతుంది. అందువల్ల 'నాకే ఎందుకు?' అని అడగకుండా, 'ఓ దేవా, నేను అనుభవిస్తున్నది నేను చేసుకున్న కర్మల ఫలితం అని నాకు తెలుసు. వీటిని భరించి, వీటినుంచి నేను విలువైన పాఠాలను నేర్చుకునే శక్తిని నాకు ప్రసాదించు,' అని ప్రార్థించాలి. అంటే తామరాకుమీద నీటిబొట్టులా ఉండగలగాలి. **కర్మయోగం = సరియైన కర్మ + సరియైన దృక్పథం**

ఇలా కర్మయోగం పాటించటంవల్ల కలిగే ఫలమేమిటి? దాని ఫలం చిత్తశుద్ధి కలుగుతుంది; ప్రాపంచిక సుఖాలమీద కోరిక తగ్గి, ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. గీతమీద, శాస్త్రంమీద శ్రద్ధ పెరుగుతుంది. ఏదో ఆషామాషీగా నేర్చుకోకుండా మనస్ఫూర్తిగా, తపనతో నేర్చుకుంటాము. ఈ కర్మయోగాన్ని సన్న్యాసీ పాటించాలి, గృహస్థు పాటించాలి. కాకపోతే వారు చేసే కర్మలు భిన్నంగా ఉంటాయి. కర్మయోగ దశలను కూడా కృష్ణపరమాత్మ వివరించాడు.

**బి). జ్ఞానయోగ సాధన – శ్లోకాలు 13–21:** జ్ఞానయోగానికి అందరూ వచ్చి తీరాలి. కొంతమంది జ్ఞానయోగం బాగుండదు, భక్తియోగంలో ఆర్ద్రత ఉంటుంది. భక్తిలో కన్నీరు కారుస్తాము అనుకుంటారు. ఇవన్నీ అపోహలు. జ్ఞానయోగం గురించి ఏడవ అధ్యాయంనుంచి వివరంగా చూస్తాము. అప్పుడు జ్ఞానయోగం, భక్తియోగాల గురించి చూద్దాము. ఇప్పుడు తెలుసుకోవాల్సిన అంశం గృహస్థు కాని, సన్న్యాసి కాని జ్ఞానయోగానికి వచ్చితీరాలి.

**జ్ఞానయోగం** – జ్ఞానయోగం అంటే ఏమిటి? జ్ఞానయోగం అంటే వేదాంతవిచారణ. దాన్ని వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా చేస్తాము.

**శ్రవణం** – ఒక క్రమపద్ధతిలో క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాల పాటు ఒక సమర్థవంతమైన గురువు వద్ద శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి. ఇందులో ప్రతి ఒక్క పదమూ ముఖ్యమే. ఒక క్రమపద్ధతిలో అంటే గీతలో ఒక అధ్యాయం తరువాత ఒక అధ్యాయాన్ని వరుసగా నేర్చుకోవాలి. ఎప్పుడో 1955లో 17వ అధ్యాయం ప్రసంగం విన్నాను, 1982లో మూడవ అధ్యాయం ప్రసంగం విన్నాను అంటే కుదరదు. ఒక వరుసక్రమంలో చదవాలి.

క్రమం తప్పకుండా, అంటే ఒక పద్ధతిలో నేర్చుకోవాలి. ప్రతి ఆదివారం గీతాబోధ ఉంటే ప్రతి ఆదివారమూ మానకుండా వెళ్ళాలి. కొన్ని సంవత్సరాలు అలా నేర్చుకోవాలి. ఎందుకంటే వేదాంతం అర్థం చేసుకోవటం, చేసుకున్నా దాన్ని జీర్ణించుకోవటం చాలా కష్టం.

ఒక సమర్థవంతమైన గురువు వద్ద నేర్చుకోవాలి. ఒకటే గురువు దగ్గర నేర్చుకుంటే మంచిది. తక్కిన గురువులు బాగా చెప్పరని కాదు, కాని ఒక్కొక్క గురువు ఒక్కొక్క పద్ధతిలో చెబుతారు. ఆ గురువు వాడే పదాలు కూడా వేరేగా ఉంటాయి.

శాస్త్రాన్ని నేర్చుకోవాలి. శాస్త్రం అంటే మళ్ళీ ధర్మశాస్త్రం కాదు; పురాణాలు కూడా కావు. రామాయణం ధర్మశాస్త్రం కిందకు వస్తుంది. రామాయణంలో ఆత్మ జ్ఞానబోధ రాదు. అందువల్ల వేదాంతశాస్త్రవిచారణ చెయ్యాలి.

అలా చేయటంవల్ల కలిగే జ్ఞానం ఏమిటి?

**ఆత్మజ్ఞానం** – నా అసలు స్వరూపం గురించి చెబుతుంది. ఆత్మ అంటే చైతన్యస్వరూపం అని రెండవ అధ్యాయంలో చూశాము. చైతన్యం లక్షణాలు చాలాసార్లు చూశాము.

- చైతన్యం శరీరంలో ఒకభాగం కాని, ఒక లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి చెందింది కానీ కాదు.
- చైతన్యం స్వతంత్ర వస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, శరీరాన్ని చైతన్యవంతం చేస్తుంది.
- చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
- చైతన్యం శరీరం పడిపోయినా ఉంటుంది.
- చైతన్యం సర్వవ్యాపకమైనా శరీరం అనే మాధ్యమం లేక తెలియదు, అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

చైతన్యం సర్వవ్యాపకం అని చూశాము కదా. కృష్ణపరమాత్మ చైతన్యం, ఆకాశంలా సర్వవ్యాపకమనీ, అందువల్ల ఆకాశంలా కర్మలు చేయదనీ చెప్పాడు.

**నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్ న కారయన్॥** – 5.13
**న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః॥** – 5.14

ఆకాశం సమక్షంలో పనులు అయినట్టుగా, చైతన్యం సమక్షంలో పనులు అవుతాయి కాని చైతన్యం తను చెయ్యదు, ఇంకొకరిచేత చేయించదు. దీనికి ఇంకో ఉదాహరణ కాంతి. కాంతి సమక్షంలో చేయి కదులుతుంది కాని కాంతి కదలదు, కర్మ చేయదు.

చైతన్యం అకర్త కాబట్టి అభోక్త కూడా. కర్మ చేయదు కాబట్టి కర్మ చేయటంవల్ల కలిగే పుణ్యపాపాలు చైతన్యానికి అంటవు.

**న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే॥** – 5.14
**నాదత్తే కశ్యచిత్పాపం న చైవ సుకృతం విభుః॥** – 5.15

నాకు పుణ్యమూ లేదు, పాపమూ లేదు. ఆత్మ చైతన్యమైన నేను పుణ్యపాపాలకు అతీతం.

కాంతి–చేయి ఉదాహరణలో మూడు దశలు చూస్తాము.

**ఎ).** ఇక్కడేముంది అంటే ముందు చేయి ఉందని చెబుతాము.

**బి).** చేతితో పాటు చేతిని ప్రకాశింపచేసే కాంతి ఉంది అంటాము.

**సి).** చేయి ఉన్నా లేకపోయినా కాంతి ఉంది అంటాము.

ఇదే సూత్రాన్ని శరీరం–ఆత్మకు వర్తించి చూద్దాము.

**ఎ).** నేనెవరు అంటే శరీరం అంటాము.
**బి).** శరీరంలో ఆత్మ ఉంది. అది శరీరాన్ని ప్రకాశింప జేస్తుంది అంటాము.
**సి).** శరీరం ఉన్నా లేకపోయినా ఆత్మ ఉంటుంది అంటాము.

ఈ మూడు దశలూ కలిపి ఆత్మజ్ఞానంలో మొదటిదశగా చెప్పవచ్చు. ఆత్మజ్ఞానంలో మూడు దశలున్నాయి. అవి– 1) శరీరంలో ఆత్మ ఉంది. 2) నేను శరీరం కాదు, ఆత్మను. 3) (తరువాత చూస్తాము).

అందువల్ల శరీరంలో ఆత్మ ఉంది అని నేర్చుకుంటే, జ్ఞానం పూర్తి అవదు. నేను ఆత్మను అని అర్థం చేసుకోవాలి. నేనెవరు అంటే నేను ఫలానా, నా వయస్సు ఇంత, నా తండ్రిపేరు ఇది, అంటూ బోలెడు వివరాలు ఇస్తాము.

ఇప్పుడు ఆత్మజ్ఞానం పొందాక, నేనెవరు అనే ప్రశ్నకు నేను శరీరం అనకుండా, **నేను శరీరం అంతటా ఉన్న ఆత్మను** అని చెప్పగలగాలి. శరీరానికి రాకపోకలు ఉన్నాయి; నేను ఈ ప్రపంచంలో వ్యవహారాలు నడపటానికి దేవుడు తాత్కాలికంగా నాకు ఇచ్చిన కానుక ఈ శరీరం. ఆత్మజ్ఞానం అంటే ఏమిటి?

**నేను శరీరాన్ని కాదు. నేను శరీరంలో ఉన్న ఆత్మను.** దీనివల్ల కలిగే ఫలమేమిటి? సమత్వం ఏర్పడుతుంది అన్నాడు కృష్ణపరమాత్మ. నేను ఎప్పుడైతే ఆత్మను అని అర్థం చేసుకుంటానో, అప్పుడే ఎదుటివారిని కూడా ఆత్మగా చూస్తాను. ఇద్దరమూ ఆత్మ అంటే, మా మధ్య ఏమీ భేదం లేదు.

**విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।**
**శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥** – 5.18

ఈ సర్వత్ర సమదర్శనం ఆత్మజ్ఞానం పొందితేనే చేయగలము. లేకపోతే అది పైపై మాటలే అవుతాయి కాని హృదయపూర్వకంగా రాదు. అందరూ ఒకటే అంటాము, మళ్ళీ హత్యలు జరుగుతూనే ఉంటాయి.

ఇంకొక లాభం – **మృత్యుభయం పోతుంది**. నేను శరీరం అనుకుని, శరీరంతో మమేకం చెందినన్నాళ్ళూ నాకు మృత్యుభయం ఉంటుంది. ఎప్పుడైతే నేను శాశ్వతమైన ఆత్మను, ఈ శరీరం నాకొక తాత్కాలిక వేషమని అర్థం చేసుకుంటానో, అప్పుడే మృత్యుభయం పోతుంది. శరీరం అన్నాక చావు, పుట్టుకలు ఉంటాయి అని తెలుస్తుంది. అలా జ్ఞానం సంసారంనుంచి విడుదల చేస్తుంది.

**3.జ్ఞానసాధన, ఫలం – శ్లోకాలు 22–26:** జ్ఞానయోగ ఫలాలు మూడని వివరించాడు కృష్ణపరమాత్మ. అవి– వైరాగ్యం, జీవన్ముక్తి, విదేహముక్తి.

**వైరాగ్యం** – ఆధ్యాత్మిక సాధనలు ఎన్నో ఉన్నాయి కాని ఇక్కడ కృష్ణపరమాత్మ ఒక విలువను స్తుతించాడు. అది వైరాగ్యం.

**సర్వం పరవశం దుఃఖం సర్వమ్ ఆత్మవశం సుఖమ్**

బాహ్యవస్తువులమీద నా ఆనందంకోసం ఆధారపడితే, అవి ఆనందాన్ని ఇవ్వవు. బాహ్యవస్తువులేవీ నా అధీనంలో లేవు. వాతావరణం, దేశం, ప్రభుత్వం, మనుష్యులు, పరిస్థితులు ఏవీ నా అధీనంలో ఉండవు. నా భార్య, పిల్లలే నా మాట వింటారన్న నమ్మకం లేదు. అందువల్ల బాహ్యవస్తువుల్లో ఆనందం ఉందనుకుని వాటి వెంట పరుగులు తీస్తే లాభం లేదు. దయానంద స్వామీజీ ఈ విషయాన్ని అద్భుతంగా చెబుతారు –

**సమస్య నువ్వే, పరిష్కారమూ నువ్వే**

అశాశ్వతమైన విషయాలమీద, శాశ్వతమైన ఆనందంకోసం ఆధారపడతాను. దానికి జవాబు ఏమిటి? ఆధారపడటంనుంచి స్వేచ్ఛ వైపుకు ప్రయాణించాలి.

**న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య నోద్విజేత్ ప్రాప్య చాప్రియమ్ ।**
**స్థిరబుద్ధిరసమ్మూఢో బ్రహ్మవిద్బ్రహ్మణి స్థితః ॥** – 5.20

నా శాంతి, నా తృప్తి, నా పూర్ణత్వంకోసం నామీదే ఆధారపడాలి. నామీద అంటే అనాత్మ అయిన నామీద కాదు; ఆత్మ అయిన నామీద.

**యస్త్వాత్మరతిరేవ స్యాత్ ఆత్మతృప్తశ్చ మానవః ।**
**ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే ॥** – 3.17

మనుష్యులు నా చుట్టూ ఉన్నా ఆనందమే, లేకపోయినా ఆనందమే. వారిమీద మానసికంగా ఆధారపడను. ఇది వైరాగ్యం.

**జీవన్ముక్తి** – జీవన్ముక్తి అంటే అంతర స్వేచ్ఛ. అది కూడా ఇక్కడే, ఇప్పుడే. ఎందుకు ఆంతర స్వేచ్ఛ అంటున్నాము? బాహ్యంగా స్వేచ్ఛ కుదరదు. బాహ్యంగా ప్రపంచంలో ఉన్న నియమాలు, నిబంధనలు పాటించితీరాలి. కారు నడుపుతుంటే, నేను జీవన్ముక్తుడను, నా ఇష్టం వచ్చినట్టు వెళతాను అనలేము. ట్రాఫిక్ నియమాలు పాటించితీరాలి. అందువల్ల శారీరకంగా, బాహ్యంగా ఆధారపడక తప్పదు కాని, ఆంతరంగా అన్ని రకాల బంధాలనుంచి విముక్తి కలుగుతుంది. అప్పుడు స్థితప్రజ్ఞుడవుతాను.

**వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే** – 2.56

ఇది జీవన్ముక్తి.

**విదేహముక్తి** – జ్ఞాని జీవన్ముక్తి పొంది, అలా ఎన్నాళ్ళు ఉంటాడు? అతని ప్రారబ్ధకర్మ ముగిసే వరకు, అతని శరీరం ఉంటుంది. జ్ఞాని అది కూడా అనుకోడు. ఎందుకంటే, అతను ఇంక శరీరంతో మమేకం చెందడు. తక్కినవారు అంటారు – ప్రారబ్ధకర్మ ఉన్నవరకూ జీవిస్తాడని. ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకూ జీవిస్తాడు, అది ముగిశాక, ఈ శరీరం రాలిపోతుంది. దాన్ని విదేహ ముక్తి అంటారు. కృష్ణపరమాత్మ దాన్ని **బ్రహ్మనిర్వాణమ్** అన్నాడు.

**లభంతే బ్రహ్మనిర్వాణమ్ ఋషయః క్షీణకల్మషాః** – 5.25

జ్ఞానఫలం మూడుగా చూశాము. వైరాగ్యం, జీవన్ముక్తి, విదేహముక్తి. ఇక్కడితో ఐదవ అధ్యాయంలోని ముఖ్యబోధ ముగిసింది.

4. **ధ్యానం శ్లోకాలు 27-29**– చివరి మూడు శ్లోకాల్లో ధ్యానం అంశాన్ని ప్రవేశపెట్టాడు కృష్ణపరమాత్మ. ధ్యానం చేసేముందు పాటించాల్సిన విషయాలు, ధ్యానం చేసే పద్ధతి, ధ్యానఫలం – ఈ మూడూ ఇక్కడ టూకీగా చెప్పాడు కృష్ణపరమాత్మ. దీన్ని తర్వాత వచ్చే అధ్యాయంలో వివరిస్తాడు. అందువల్ల వీటిని ధ్యానబీజశ్లోకాలు అంటారు.

ఈ అధ్యాయాన్ని సన్న్యాసయోగం లేదా కర్మసన్న్యాసయోగం అంటారు. సన్న్యాసం అంటే ఏమిటో అర్జునునికి వివరించాడు కృష్ణపరమాత్మ. బాహ్యసన్న్యాసం ముఖ్యం కాదు; ఆంతర సన్న్యాసమే అసలు సన్న్యాసం. బాహ్యసన్న్యాసం తీసుకుతీరాలని లేదు; కాని ఆంతరసన్న్యాసం పొంది తీరాలి.

**ఒక్క క్షణం వేదాంతశ్రవణం చేస్తేనే చాలు –**

ఈ భూమండలంమీద ఉన్న అన్ని తీర్థాలలో స్నానం చేయటంవల్ల లభించిన పుణ్యం,
ముక్కోటి దేవతలు ఒక్కసారిగా వచ్చి అనుగ్రహించిన పుణ్యం,
అందరి పితృదేవతలకు శ్రాద్ధం ద్వారా వచ్చే పుణ్యం,
ఈ సమస్త భూమండలాన్ని దానం చేస్తే వచ్చే పుణ్యం,
ఈ భూమండలంలో ఉన్న అన్ని యాగాలు, యజ్ఞాలు చేయటంవల్ల వచ్చే పుణ్యం,
ఒక్క నిముషం కాదు, **ఒక్క క్షణం వేదాంతశ్రవణం చేస్తేనే చాలు** ఈ అయిదు
పుణ్యాలు కలిపి చేసినంత పుణ్యం వస్తుంది.